ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక



"పొలంలో విశ్రాంతి"

15-12-48 ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY వెల 4 అణాలు

వార్తా చిత్రాలు




సర్దార్ వల్లభాయ్‌పటేల్ మొన్న 8-వ తేదీన గ్వాలియర్‌లో గజరాజా మెడికల్ కాలేజీకి ప్రారంభోత్సవము జరుపుచున్న దృశ్యం.



కాశ్మీర్‌లో మనసేనలు రాజౌరినుండి 45 మైళ్లు ముందుకు చొచ్చుకుని వెళ్లి నవంబరు 20-న పూంచీపట్టణముపై శత్రుముట్టడిని ఛేదించగలిగినవి. పర్వతప్రాంత యుద్ధనిర్వహణ చరిత్రలో ఈ విషయము చిరస్మరణీయమైనది. పూంచీ పొలిమేరలోని 'మహోత్రి' పర్వతాగ్రరక్షణకై భారతసేనల వలెనె సాహసోపేతముగ పోరాడుతున్న జమ్మూ కాశ్మీర్ సంస్థానసైనికులను చిత్రంలో చూడనగును.



క్లారాక్వాయిన్ అనే డచ్చి శిల్పికి తన రూప శిల్పచిత్రము తయారుచేయుటకు అవకాశ మొసగుచున్న సర్దార్ వల్లభాయ్‌పటేల్.



డిసెంబరు 6-న ఢిల్లీలో ప్రారంభమైన అంతరధినివేశ సమావేశంలో పాల్గొనుచున్న పాకిస్తాన్ ప్రతినిధివర్గ నాయకుడు గులాం మహమ్మద్; భారత ప్రతినిధివర్గ నాయకుడు ఎన్. గోపాలస్వామి అయ్యంగార్; చివర నిలిచియున్నవారు పాకిస్తాన్‌లో ఇండియా హైకమీషనర్ శ్రీ ప్రకాశ్; అస్సాం ప్రధాని గోపీనాథ్ బార్డోలాయ్‌గారలు.



కాకినాడలో జరిగిన ఆంధ్రరాష్ట్ర మహిళాసంఘ 19-వ వార్షికసభ సమావేశం.

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా రు. 12-0-0

విడిప్రతిక అణాలు 0-4-0

ప్రతి బుధవారమున ప్రకటింపబడును


ఒరు లేయవి యొనరించిన నరవర ! యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్.(మహాభారతము)

సంపుటము **41**

సంచిక **15**

Founder : K. NAGESWARA RAO

సర్వధారి సంవత్సర మార్గశీర్ష శుద్ధ చతుర్దశి బుధవారము



పెద్దాపురంకోట : శిధిలశేషం

ఆంధ్రపత్రిక

1948-వ సం॥ డిసెంబరు నెల 15-వ తేది బుధవారము

భాషా రాష్ట్రాలకు స్వస్తి

"ఈ రాష్ట్రము లన్నింటి యందును తీవ్రమైన పరిపాలనా సమస్య లున్నవి. మద్రాసు ప్రభుత్వములో ఆంధ్రులకు అరవలకు ఉన్న మాదిరి సంఘర్షణలు వైరుధ్యము లున్నవి. మలబారు, కర్నాటక రాష్ట్రము లందు ఎక్కడో ఉన్న బొంబయి, మద్రాసునగరములలో ఉన్న రాజధాని ప్రభుత్వములు తమ యవసరముల గమనించుట లేదను భావము ప్రబలముగ గలదు. ఈ ఆక్షేపణలు, కోరికలు చాలవరకు సహేతుకమైనవే నని కమీషను అభిప్రాయపడుచున్నది. వీటిని తొలగించుటకు భారతప్రభుత్వము తత్క్షణము మార్గముల నన్వేషింపవలసియున్నది." అని భాషా రాష్ట్ర విచారణసంఘమువారు తమ సుదీర్ఘ నివేదికను ముగించిరి. కాని ఈ ఆదేశము, నివేదకయందలి ఇతర విషయములు గమనించిన మీదట నిరర్థక మగుటయే గాక అర్థరహిత మగుచున్నది. నేడు కాదు గద, ఇకముందు కూడ రాష్ట్రముల నిర్మాణము, పునర్నిర్మాణము భాషా ప్రయుక్త రాష్ట్ర నిర్మాణ సూత్రము ననుసరించి జరుగరాదని కమీషన్ తన యభిప్రాయమును అసందిగ్ధముగ ప్రకటించెను.

రాష్ట్రముల పునర్నిర్మాణము జరుగుటకు వీరికి అభ్యంతరము లేదు గాని, అది భాషా సిద్ధాంతము ననుసరించి మాత్రము జరుగుటకు వీరు తమ తీవ్రప్రాతికూల్యమును వెల్లడించిరి. తమ ప్రాతికూల్యమును సమర్థించుకొనుటకు కమీషను సభ్యులు పేర్కొనిన కారణములు అర్థరహితము లనిమాత్రము చెప్పవచ్చును. ఇంతటి భూభాగమును పర్యటించి, అనేకమంది ప్రముఖులు, ప్రజా సంస్థలను విచారించినప్పటికిని, ప్రత్యేక రాష్ట్ర వాంఛ అర్థమునుగాని, ప్రత్యేక రాష్ట్ర నిర్మాణ పరమార్థమును గాని వీరు గ్రహింపలేకపోయిరి. ఆ గ్రహింపు లేక పోవుటవలననే వారి నివేదిక అనేక వైరుధ్యములతో, అపోహలతో, దురభిప్రాయములతో నిండిపోయెను.

ప్రత్యేక రాష్ట్రవాంఛ "ఉపజాతీయతా" జనితమని, భారత జాతీయత సుస్థిరమై, బలిష్ఠమైనగాని ఈ ఉపజాతీయతా భావజనిత ప్రమాదములను భారతదేశము అధిగమింపజాలదని కమీషను సభ్యులు హెచ్చరించిరి. దీనిని బట్టి వీరు వ్యాధికి చికిత్సనే గాక, అసలు వ్యాధి లక్షణమునే గ్రహింపజాలక పోయిరని స్పష్టమగుచున్నది ఇప్పటికి ప్రత్యేక రాష్ట్రమును కోరుచున్న ఆంధ్రులుగాని, కర్నాటకులుగాని, మహారాష్ట్రులుగాని తాము ఒక 'ఉపజాతికి' చెందినవారమని ఎన్నడును ప్రకటించుకొని యుండక పోవుటయే కాక, అట్లు భావించి అయినను ఉండలేదు. భారత జాతిసర్వతోముఖాభివృద్ధికి సమైక్య భారతదేశస్థాపనకు భాషారాష్ట్రములు దోహదము చేయుననియే ప్రాజ్ఞులందరు అభిప్రాయపడిరి. ఒరిస్సా సింధు రాష్ట్రములను నిర్మించుటవలన భారతజాతీయత కెట్టి ప్రమాదమూ ఏర్పడలేదు. ఈ విషయములో కమీషన్ దురభిప్రాయమునకు శ్రీ అరవిందుడు ఆంధ్ర విశ్వకళాపరిషత్తునకు ఇచ్చిన సందేశములో వెల్లడించిన యభిప్రాయము తగిన సమాధానము నిచ్చుచున్నవి. భిన్నత్వమునందు ఏకత్వమును సాధించుటకు భాషాప్రయుక్త రాష్ట్రమే మార్గమని శ్రీ అరవిందుడు విస్పష్టము చేసెను. కాని కమీషను సభ్యులు భారతదేశమున "ఉపజాతుల"ను స్థాపింపదలచిన భాషా రాష్ట్రముల నిర్మించుటకంటె మంచి మార్గము లేదని ప్రకటించిరి. ఇంతకు మించిన వితండవాదము వేరొకటి యుండదు. సభ్యుల దృక్పథమే వక్రముగ నున్నట్లు ఈ విషయము నిస్సందేహముగ ఋజువు చేయుచున్నది. అట్టి దృక్పథముతో తయారైన నివేదిక వేరొక విధముగ నుండజాలదు.

ప్రత్యేక భాషారాష్ట్రముల ఆందోళన వీరు వాదించినట్లు "ఉపజాతీయతా" భావ ప్రకోప జనితమే అయినను, అందువలన ఏర్పడు ఫలితముల నివారించుటకు మార్గము భాషా రాష్ట్ర నిర్మాణము అసాధ్యము చేయుట మాత్రము కాదు. ఇందువలన ఆ "ఉపజాతీయత" తీవ్రతరమై వికృతరూపమును కూడ పొందవచ్చును. అస్వతంత్ర భారత దేశమున నుండిన జాతీయాభిమానము, దేశాభిమానము స్వాతంత్ర్యము లభించిన తరువాత లేదని సర్వత్ర అంగీకరింపబడినది అట్టి స్థితిలో ఈ 'ఉపజాతీయత' ను నిర్మూలించుటకు, ఈ శక్తుల సంఘటితము కాకుండ నివారించుటకు గల ఏకైకమార్గము భాషా రాష్ట్రనిర్మాణమే నని సభ్యులు గ్రహింపలేకపోవుట చిత్రముగ నున్నది

పరిపాలనాసౌష్ఠవమునకు రాష్ట్ర పునర్నిర్మాణ మవసరమని వీరు గుర్తించిరి. కాని అట్టి రాష్ట్రములు 1938 కి పూర్వము 'చెక్స్లొవేకియావలె" ఏర్పడవలెనని వీరి యభిప్రాయము అనేక భాషావర్గములను చేర్చి ఒక రాష్ట్రముగ చేయుటవలన ఏ ఒక భాషా వర్గమూ శక్తివంతము కాకుండ నుండునని వీరి విశ్వాసము. కాని ఇందువలన వివిధవర్గములమధ్య అవిశ్వాసము ప్రబలి, ఐక్యత విచ్ఛిన్నమై ఏ రాష్ట్రమూ బలిష్ఠమై యుండజాలదు అందువలన కేంద్రప్రభుత్వము శక్తివంతమై భారతదేశ ఐక్యతను లేక ఏకత్వమును సంరక్షింపగలదని వీరు విశ్వసించుచుండవచ్చును కాని ఇందువలన అశాంతి ప్రబలవచ్చునను అనుమానము వీరిని బాధించక పోలేదు. కనుకనే రాష్ట్రములందేర్పడు సమస్యలను, కలహ సంఘర్షణలను ఎదుర్కొనుటకు కేంద్రప్రభుత్వమునకు విశేషాధికారములుండవలెనని సూచించియుండవచ్చును. రాష్ట్రములు కేంద్రప్రభుత్వపు ఏజెంట్లుగ పనిచేయవలెనని చెప్పుచు ఇట్టి ప్రతిపాదనలు చేయుటలో గల ఔచిత్యము బోధపడుటలేదు

ఒక్క బొంబాయి, చెన్నపట్టణం విషయములో వీరు చేసిన ప్రతిపాదనలు మాత్రము కొంతవరకు సబబుగ నున్నవి. వాటివిషయములోనైనను వీరు పరిష్కారమార్గమును స్పష్టముగ తెలిపియుండలేదు.

ఏ రాష్ట్రమూ ఆర్థికముగ స్వయం సమృద్ధముగ నుండదని, ఈనూతన రాష్ట్రములు కేవలము "పోలీస్ స్టేట్" వలె మాత్రము ఉండగలవనియు వీరు వెల్లడించిన యభిప్రాయము సబబుగలేదని వివిధసంఘములు సమర్పించిన నివేదికలే స్పష్టము చేయుచున్నవి ఆరు క్రొత్త రాజధానులను నిర్మించుట ప్రస్తుతము దుస్సాధ్యము గనుక ప్రత్యేక రాష్ట్ర నిర్మాణము వాంఛనీయము గాదని కూడ వీరు వాదించిరి.

మరికొందరెవరో ప్రత్యేక రాష్ట్రములను వాంఛించుచున్నారని, అందులకై ఆందోళన చేయుదురని, కనుక భాషా రాష్ట్రనిర్మాణము కూడదని కమీషన్ తెల్పుటలో ఆశ్చర్యపడవలసినదేమియూ లేదు. దాదాపు 30 సంవత్సరములక్రితం కాంగ్రెస్ నిర్వచించిన సిద్ధాంతము సరియైనది గాదని వాదించిన కమీషన్ ఏమైన నివేదింపవచ్చును.

అసలు వీరి నివేదిక, వీరికి రాజ్యాంగపరిషత్తు అధ్యక్షులు ఒసగిన ఆదేశమునకు పూర్తిగ విరుద్ధముగ నున్నది. భాషా రాష్ట్రనిర్మాణ సాధ్యాసాధ్యతలనేగాని, యుక్తాయుక్తతలనుగురించి గాదు విచారింపవలసినది. 1935 - భారతప్రభుత్వచట్టం 290 వ సెక్షను అనుసరించి ఏయే రాష్ట్రములేర్పడవచ్చునో తెలుపవలసినదియే పరిషత్తు అధ్యక్షుడు వీరిని కోరియుండెను. కాని కమీషన్‌వారు ఆ దృష్టితో ఆ సమస్యను పరిశీలింపనే లేదు. రాజ్యాంగపరిషత్తుగాని, భారత ప్రభుత్వముగాని వీరి నివేదికను అంగీకరించిన, ఏ ప్రమాదమును వీరు నివారింపదలచిరో అది ప్రత్యక్షమగును. దేశైక్యత ఎన్నటికీ సాధ్యము గాదు. ప్రత్యేక రాష్ట్ర నిర్మాణము ద్వారా గాక కమీషను తమ నివేదికను ముగించుచు చేసిన ఆదేశమును భారతప్రభుత్వమెట్లు శిరసావహించునో చూడవలసి యున్నది.

పారిస్, లాప్‌స్టన్ సమావేశము

మూడుమాసములు పారిస్‌లో సమావేశమైన ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశముగాని, లాప్‌స్టన్‌లో రెండు వారములు సమావేశమైన ఐక్యరాజ్య సమితి ఆసియా దూరప్రాచ్య ఆర్థిక సంఘముగాని చిరకాలముగ పరిష్కారము నపేక్షించుచుండిన ఏ ఒక్క ప్రధాన సమస్యనూ పరిష్కరింపలేదు.

ఐక్య రాజ్యసమితి ఏర్పడి మూడు సంవత్సరములైనను, ఇంతవరకు జరిగిన వార్షిక సమావేశములందనేక ముఖ్యమైన నిర్ణయములు జరిగినను ప్రపంచ రాజకీయ, ఆర్థిక, సాంఘిక పరిస్థితులు సమితి జననకాలము నాటికంటె నేడు అధ్వాన్నముగ నున్నవి. ఏ ఒక సమస్యా పరిష్కారము కాకుండుటే కాక, సమితి ప్రయత్నించిన కొలదీ సమస్యలు మరింత క్లిష్టమగుచున్నవి. సమితి, సమితి ఉపసంఘములు ఒక ఆశయ చిహ్నముగ నున్నవే గాని ఆ ఆశయసిద్ధికి ప్రయోజనకరములగు సాధనములు కాలేదు. ఈ పరివర్తన జరుగువరకు పరాధీన ప్రజలకు, పీడిత దేశములకు మోక్షము లేదు. ప్రపంచమునకు శాంతి యుండదు.

పారిస్ సమావేశము సాధించిన ఫలితములను గురించి పశ్చిమ రాజ్యముల ప్రతినిధులు ఒక విధముగను, రష్యావర్గ ప్రతినిధులు వేరొకవిధముగను తమ యభిప్రాయములను వెల్లడించుటలోనే యథార్థ విషయము వెల్లడియగుచున్నది. సమితి కార్యదర్శి, పారిస్ సమావేశ అధ్యక్షుడు కూడ సమితి తృతీయవార్షికసమావేశము సాధించిన

నేటి ప్రపంచం

చైనా రాజధాని నాంకింగ్ నగరంకోసం కమ్యూనిస్టు సేనలు ప్రారంభించిన యుద్ధం ఆనాటి కానాడు భయంకర పరిణామాన్ని పొందు తున్నది. రాజధానీ ఆక్రమణతో చైనా అంతర్యుద్ధం సమాప్తమవుతుందనిగాని, మార్షల్ చాంగ్ కై షేక్ ప్రభుత్వం పతనమవుతుందనిగానీ చెప్పడానికి వీలులేకపోయినప్పటికీ, జాతీయ సైనిక దళాలు నైతికప్రతిష్ఠ పూర్తిగా కోల్పోయే మాట వాస్తవం. కొత్త సంవత్సరం ప్రారంభమయే లోపుగానే నాంకింగ్ నగరాన్ని స్వాధీనపరుచుకోవలెననే స్థిరసంకల్పంతో కమ్యూనిస్టు సేనలు హోరాహోరిగా పోరాటం సాగిస్తున్నవి. ఈ సంకల్పం సఫలీకృతమయే సూచనలే కమ్యూనిస్టు సేనల ప్రస్తుత పురోగమన వేగాన్ని బట్టి ప్రబలంగా కనిపిస్తున్నవి. చైనా భవిష్యత్తుమీదనే చాలావరకు ఆసియా ఖండ భవిష్యత్తు కూడా ఆధారపడివున్నది కాబట్టి ఆసియాఖండ రాజ్యాలే గాక సమస్త ప్రపంచమూ చైనా అంతర్యుద్ధ మిచ్చేదిన పరిణామాల్ని అతిజాగ్రతగా వేయికళ్లతో గమనిస్తున్నది.

అంతర్యుద్ధ పర్యవసాన మేమవుతుందోనని మిగతా ప్రపంచమంతా నిరీక్షిస్తుంటే, తమ జాతికి, తమ జాతీయమునగడకు ఏర్పడిన ఈ అతి విపత్కర సమయంలో తాము కోరిన సహాయాన్ని అమెరికా ఇస్తుందా ఇవ్వదా అని చైనాప్రభుత్వం నిరీక్షిస్తున్నది.

అమెరికా సహాయం అర్థించడానికి ప్రత్యేకంగా పని కట్టుకొని వాషింగ్టన్ వెళ్లిన మదాం చాంగ్ కై షేక్ ప్రెసిడెంట్ ట్రూమన్‌తో ప్రథమ సమావేశం జరిపి తన దౌత్యకారణాన్ని వ్యక్తపరిచింది. ఈ సమావేశంలో అమెరికా విదేశాంగమంత్రి జార్జి మార్షల్ సతి, ట్రూమన్ సతికూడా పాల్గొన్నారంటే, ఇది కేవలం ఇష్టాగోష్ఠి సమావేశం మాత్రమేనో, లేక అసలు విషయమై గట్టి చర్చ

ఏదైనా జరిగిందో బాహ్యప్రపంచానికి ఇంకా తెలియలేదు.

మదాం చాంగ్ కై షేక్ చెప్పిన విషయాన్ని యావత్తూ ప్రెసిడెంట్ ట్రూమన్ సావధానంగా, సానుభూతితో విన్నాడని కొన్ని వార్తలు; ఆమె చేసిన విజ్ఞప్తి అమెరికా అధ్యక్షునికి ఏమాత్రం నచ్చినట్లు కనబడదని మరి కొన్ని వార్తలు వస్తూండడాన్ని బట్టి చూస్తే చాంగ్ సతి దౌత్యం సఫలమవుతుందనే ఆశ ఏమీ కనబడదు. మూడువందలకోట్ల డాలర్ల విలువగల ఆయుధసామగ్రిని సప్లయిచేసి, అమెరికన్ ఉన్నత సైనిక సలహాసంఘాన్ని ఒకదాన్ని చైనాకు పంపి సహాయపడవలసిందని చాంగ్ సతి కోరుతున్నది. అమెరికా అధ్యక్షుడు ట్రూమన్ ఈ విజ్ఞప్తికి ఏవిధమైన సమాధానాన్నీ ఇంకా ఇవ్వలేదు; విస్పష్టమైన వాగ్దానాలను వేటినీ ఇంకా చేయలేదు.

కమ్యూనిస్టు విజృంభణ ఫలితంగా రాజధాని నాంకింగ్ నగరానికి ప్రమాదం ఎక్కువవుతున్నది కాబట్టి అత్యవసరంగా సహాయపడవలసిందని అడగబోయిన చాంగ్ సతి ద్వారానే అమెరికా మార్షల్ చాంగ్ కై షేక్‌కు భవిష్యత్ కార్యక్రమాన్ని గురించి విపరీతమైన సలహాలు ఇస్తున్నట్లుకూడా ఇటీవల వచ్చిన వార్తలు తెలియజేస్తున్నవి.

కమ్యూనిస్టులతో ఏదోవిధంగా శాంతి రాయబారాలు జరిపి రాజీ ఏర్పాటుచేసుకోవలసిందన్నదే అమెరికా ఇస్తున్న ఈసలహా. ప్రస్తుతం వాషింగ్టన్‌లోనే వున్న చాంగ్ సతిద్వారానూ, చైనాలోని అమెరికన్ రాయబారిద్వారానూ చాంగ్ కై షేక్‌పై అమెరికా ఈవిషయమై వత్తిడి కలిగిస్తున్నదని షాంఘైలోని చైనా రాజకీయవేత్తలు అంటున్నారు.

అతిక్లిష్టపరిస్థితులు ఏర్పడిన ఈసమయంలో అమెరికా చైనాకు ఇంత విపరీతమైన సలహా ఇవ్వడంలో అంతర్యమేమిటనే ప్రశ్న రావడం సహజం. చైనా అంతర్యుద్ధంలో ప్రమేయం కలిగించుకున్నట్లయితే రష్యాతో బాహాటసంఘర్షణకు దిగవలసి వస్తుందనీ, అది ఇప్పట్లున అమెరికాకు ఏమాత్రం ఇష్టంలేదనీ, చైనా ప్రభుత్వం పటుతరమైన పరిపాలనా సంస్కరణలను చేటని ప్రవేశపెట్టలేక పోయింది కాబట్టి, అమెరికా తీవ్ర ఆశాభంగాన్ని చెందిందనీ, చైనా సంపూర్తిగా కమ్యూనిస్టు ఆధిపత్యం కిందికి పోవడం కంటే ఏదోఒకవిధంగా రాజీ ఏర్పాటుచేసుకోవడమే అందరికీ మంచిదని అభిప్రాయపడుతున్నదనీ పైకి కారణాలు చెప్పవచ్చు. చాంగ్ కై షేక్‌పై అమెరికా ఈవిధంగా వత్తిడి పెడుతున్నదంటే వీటన్నిటినీ మించిన అంతరంగిక కారణం మరొకటి వుండితీరాలి. అమెరికా ఇప్పటివరకూ సప్లయిచేసిన అధునాతన ఆయుధాలు, విస్తారం విమానబలాలు ఈనాడు చైనాకు లేకపోలేదు. ప్రభుత్వ సైనికులు యుద్ధరంగంలో ప్రస్తుతం ఈ విరామ మయిన బలసంపదను వినియోగించవలసినంతవిరివిగా వినియోగించడంలేదనీ, అందువల్లనే ప్రభుత్వదళాలు ప్రతి రంగంలోనూ పరాజయ పరంపరనే ఎదుర్కొనవలసి వస్తున్నదనీ ఒక ఆరోపణ వున్నది. యుద్ధరంగ పరిస్థితులను, కమ్యూనిస్టు సేనలు ఎక్కడికక్కడ చక్రబంధ వ్యూహాలు పన్ని సాగిస్తున్న అప్రతిహత పురోగమన వేగాన్ని బట్టి చూసినట్లయితే ఈ ఆరోపణలో కొంత రకమైనా సత్యం వుండకపోదేమోనని సహజంగా అనుమానం వేస్తుంది. ఇందువల్ల ప్రభుత్వసేనల చిత్తశుద్ధినే అమెరికా శంకిస్తుండవచ్చు. చాంగ్ కై షేక్ చిత్తశుద్ధినీ, సంకల్పబలాన్నీ పరీక్షించడానికి అమెరికా ఈ కొత్తపాచిక వేసి వుండవచ్చు.

అమెరికా సాగిస్తున్న వత్తిడి పర్యవసానం ఏవిధంగా తేలుతుందో, చైనాలో డా॥ సన్‌ఫో ఆధ్వర్యం కింద ఏర్పడే నూతన మంత్రివర్గ ప్రకటనతో స్పష్టపడవచ్చు. కమ్యూనిస్టులతో యుద్ధమే సాగించదలిస్తే ఒక రకమైన మంత్రివర్గాన్నీ, లేక రాజీనే ఏర్పాటు చేయదలుచుకుంటే మరొక రకమైన (వామపక్ష సభ్యులతోకూడిన) మంత్రివర్గాన్నీ నూతన ప్రధాని నిర్మించవలసివుంటుంది.

కమ్యూనిస్టు మహాప్రవాహాన్ని అరికట్టలేక చైనా సంపూర్తిగా దాసోహమనే పక్షంలో చైనాలో ఏర్పడే నూతన కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని పరిగణించి రాయబార సంబంధాలు స్థాపించుకోవడమూ, పశ్చిమ ప్రజాస్వామ్య రాజ్యాలు చాంగ్ కై షేక్ ప్రభుత్వాన్ని మాత్రమే గుర్తించడమూ జరుగుతుంది. చైనా ఒక అగ్రరాజ్యంగా భద్రతాసంఘంలో శాశ్వత సభ్యత్వం వున్న దేశం కాబట్టి, ఐక్యరాజ్యసమితి కూడా అప్పుడు తీవ్రప్రతిష్టంభనను ఎదుర్కొనవలసివస్తుంది. ఈ సమస్యలన్నీ చివరకు ఏవిధంగా పరిష్కారం కాగలవో, చాంగ్ కై షేక్ తన అధీనంలోవున్న చైనా అంతటా సైనికశాసనం విధించి ప్రయోగించి సాగిస్తున్న ప్రతిఘటన ఎంతవరకు ఫలిస్తుందో చూడవలసి వున్నది.

ఏది ఏమైనప్పటికీ సకాలంలో అమెరికా చేయవలసిన సహాయాన్ని చేయకపోతే, అంతిమ పరాజయంవరకూ పోరు సాగించడంకంటే కమ్యూనిస్టులతో రాజీపడడమే మంచిది కావచ్చుగాని, అంతిమవిజయం తమదేననే ధైర్యంగా వున్న కమ్యూనిస్టులు రాజీకి ఒప్పుకుంటారా అన్నది కూడా ప్రశ్నే.

* * *

"ప్రపంచ శాంతి భద్రతలను పెంపొందజేయడానికి శక్తికొద్దీ కృషిచేద్దామనే భారతీయులమైన మేము హృదయపూర్వకంగా అభిలషిస్తున్నాము. ఐతే, ఐక్యరాజ్యసమితి సభ్యులు కార్యక్రమ వ్యవహారధోరణిని తోసిరాజని వ్యక్తిదూషణకు ప్రాధాన్యమిచ్చినంత కాలం ప్రపంచశాంతి భద్రతలస్థాపనకు అవకాశం శూన్యమనే మాఅభిప్రాయం. ఈ వార్షికసమావేశంలో ప్రపంచసమస్యలను విస్మరించి వ్యక్తిదూషణచేసుకునే అధమస్థితికి సభ్యులు దిగారు. ఐక్యరాజ్యసమితి వ్యవహారధోరణి ఆసియాఖండ ప్రజలకు నిరాశాజనకంగా పరిణమించింది!" అని శ్రీమతి విజయలక్ష్మి పారిస్ నుంచి స్వదేశానికి ప్రయాణం గాకపూర్వం తీవ్రమైన విమర్శ చేసింది.

సెప్టెంబరు 21 వ తేదీన ప్రారంభమై పూర్తిగా పన్నెండువారాలపాటు వివిధ సమస్యలపై చర్చలుమాత్రం జరిపి మొన్న డిసెంబరు 11 వ తేదీన ముగిసిన సమితి పారిస్ సభా కార్యక్రమాన్ని అవగాహన చేసుకున్నవారెవరూ శ్రీమతి విజయలక్ష్మి విమర్శను తప్పు పట్టరు.

అనేకక్లిష్ట సమస్యలను పరిష్కరించవలసిన సమితి ఏ ఒక్క ప్రధాన సమస్యపైనా సమగ్రమైన నిర్ణయాలు చేయలేకపోయింది. ఇంచుమించు అన్ని ముఖ్య సమస్యలనూ అసంపూర్తి చర్చలతోనే వదలివేయడం జరిగింది. క్రియారూపంలో సమితి ఈ తృతీయ వార్షిక సమావేశంలో సాధించింది అత్యల్పం. బెర్లిన్ సమస్య మరొక ప్రపంచ సంగ్రామానికి దారితీసేటంత తీవ్రంగా ముందుకొచ్చిన సమయంలో సమితి సమావేశం పారిసులో ప్రారంభమైంది. అగ్రరాజ్యాల మధ్య తీవ్ర విభేదాలను సృష్టించి సాంతంగా భయంకర సంఘర్షణకు దారితీసే ఈ బెర్లిన్ సమస్య నేటికీ యథాప్రకారంగానే వున్నది. పాలస్తీనాలో యూదు అరబ్ యుద్ధనివారణ విషయంలోనూ, దక్షిణాఫ్రికా భారతీయుల సమస్యపైనా, నైరృతి ఆఫ్రికాపై ధర్మకర్తృత్వ స్థాపన విషయంలోనూ, కూడా సమితి స్పష్టమైన ఆదేశాలను ఇవ్వలేకపోయింది. ఇటలీ వలసల భవిష్యత్తునుకూడా పరిష్కరించలేక న్యూయార్కులో వచ్చే సంవత్సరం ఏప్రిల్ సమావేశానికి వాయిదా వేసుకున్నది.

పరమాణు శక్తిపై అంతర్జాతీయ అదుపు స్థాపన ఏర్పడుతుందనే ఆశ ఏమాత్రం లేకపోయినప్పటికీ, పరమాణుశక్తి విచారణ సంఘానికి ఈ సర్వసభ్య సమావేశం మరొక సంవత్సరంపాటు ప్రాణం పోసింది.

ఎటుజేరీ, ఈ తృతీయ వార్షిక సమావేశం సాధించినవాటిలో రెండు ప్రధానాంశాలను మాత్రం చెప్పకతప్పదు. ఒకటి ప్రపంచప్రజల ప్రాథమిక హక్కుల పత్రానికి సర్వసభ్య ఆమోదం; రెండు: ఒకజాతి మరొకజాతిపై సాగించే సాంస్కృతిక హత్యాకాండను అంతర్జాతీయ నేరంగా పరిగణించడం. సుదీర్ఘమైన కార్యక్రమంలో ప్రతిఅంశంపైనా ప్రతి సభ్యుడూ అతిదీర్ఘమైన ఉపన్యాసం చేయడమూ, చెప్పిన విషయాన్నే తిరిగి చెప్పడమూ సందర్భశుద్ధి వున్నా లేకపోయినా తిరిగి చెప్పడమూ, ఆవేశభరితులై ప్రసంగించడమూ తద్వారా అనవసరంగా కాలహరణం చేయడమూ జరిగింది.

అగ్రరాజ్య విభేదాలతోనూ, వారి సలహాలతోనూ పుణ్యకాలం కాస్తా పూర్తయిందని సమితి సభకు అధ్యక్షత వహించిన ఆస్ట్రేలియా ప్రతినిధి హెర్బర్ట్ ఇవాట్ విమర్శించాడంటే అందులో ఆశ్చర్యమేమీ లేదు.

ఇతరత్రా ఎన్ని విమర్శలు చేయడానికి వీలున్నప్పటికీ, పారిస్ సమావేశంలో అగ్రరాజ్యాలు పరిష్కారాన్ని సాధించలేక విఫలమైన అంశాలపై చిన్నరాజ్యాలు స్వతంత్రించి నిర్వర్తించిన పాత్రను మాత్రం ప్రశంసించక తప్పదు. చివరకు పరిష్కారం లభ్యం గాకపోయినప్పటికీ బెర్లిన్ ప్రతిష్టంభనవిషయమై చిన్నరాజ్యాలు ధైర్యంగా ముందుకు వచ్చిచేసిన కృషే ఇందుకు తార్కాణం.

సమితి సమావేశాలలో జరుగుచున్నది అగ్రరాజ్య విభేదాల పునరుద్ఘాటనా, తీవ్రవాగ్వాదాలుమాత్రమే అయినప్పటికీ, సమితి ఆశయాల పట్ల ప్రపంచ శాంతిస్థాపనలో దాని ఆవశ్యకత పట్ల పలువిధ దేశాలూ ఆదర్శరీత్యా విశ్వాసాన్ని కలిగివున్నవనే చెప్పవలసివుంటుంది.

ఐక్యరాజ్యసమితి లక్ష్యాలను ఆదర్శ రీత్యా ఆమోదిస్తున్న దేశాలే కొన్ని ఆచరణ రీత్యా వాటిని అనుసరించడంలేదు. ఎంత ఉన్నతాదర్శాలతో ఏర్పాటైనప్పటికీ ఈ కారణంచేతనే సమితి ఆశించినంతగా తన విధ్యుక్తధర్మాన్ని నిర్వర్తించలేకపోతున్నది.

ఇందుకు ప్రపంచ ప్రజల ప్రాథమిక హక్కుల ప్రణాళికనే ఉదాహరణగ తీసుకోవచ్చు. ఇంగ్లీషువారి 'మాగ్నా కార్టా'లోనూ, అమెరికా స్వాతంత్ర్య ప్రకటనపత్రంలోనూ, ఫ్రెంచివారి మానవ హక్కుల శాసనంలోనూ వున్న వివిధ ప్రాథమిక హక్కులనూ చేర్చి ఇప్పటికి రెండున్నర సంవత్సరాలక్రితం తయారుచేసిన ప్రపంచ పౌరహక్కుల ప్రణాళికను సమితి ఈ సమావేశంలో ఆమోదించింది. జాతి, మత, లింగ, వర్ణ, వర్గ దేశ విభేదాలతో నిమిత్తంలేకుండా ఈ ప్రాథమిక హక్కులను అందరికీ ప్రణాళిక ప్రసాదిస్తున్నది. దక్షిణాఫ్రికాలో భారతీయులపై అక్కడి ప్రభుత్వం జాతివిద్వేషకాండను ఇప్పటికీ యథాప్రకారం సాగిస్తూనే వున్నది. సహజసిద్ధంగా అనుభవించవలసిన సాధారణ హక్కులే వారికి లేకపోతున్నవి.

ఇంత బాహాటంగా దక్షిణాఫ్రికా ధిక్కార వైఖరిని చూపుతున్నా, సమితి ఆ ప్రభుత్వాన్ని

(21 వ పేజీ చూడుము)

కామన్‌వెల్తు సభ్యత్వము-భారతదేశము

శ్రీ నందివాడ కృష్ణమూర్తి

కామన్‌వెల్తు, సభ్యత్వము మనము నిలుపుకొనవలెనా, లేక ఇంగ్లీషుదేశముతో సర్వసంబంధములు తెగతెంపులు చేసికొని వినూతన స్వాతంత్ర్యము పైననే ఆధారపడి వేరుగా నుండవలెనా యను విషయము నేడు తీవ్రముగా చర్చింపబడుచున్నది. అధినివేశ ప్రతిపత్తి గల్గిన నాటినుండియు, ఈ విషయము, దేశములోని విజ్ఞానుల నాకర్షించుచున్నను, గత మాసమున జరిగిన కామన్‌వెల్తు సమావేశమునుండి, ఈ విషయమందు, హెచ్చు శ్రద్ధ చూపబడుచున్నది. ప్రపంచ పురుషుడు పండిట్ నెహ్రూ, ఈ సమావేశమున హిందూదేశ ప్రతినిధిగా పాల్గొనినను, తన దేశ శాసనసభా తీర్మానము కొకపూర్వము ఈ విషయమున, తాను నెట్టి అభిప్రాయము నివ్వలేనని తెలియ జేసియుండెను. కాని మన దేశమున కాయన తిరిగి వచ్చిన తరువాత, పత్రికా విలేఖరులతోను, కాంగ్రెసు వర్కింగు కమిటీతోను, రాజ్యాంగ పరిషత్తుతోను, మాటలాడుచు, రానున్న యుగమునందు, హిందూదేశము, ఇంగ్లీషు కూటమిలోనే యుండినచో మనకు మంచియే చేకూర్చునుగాని, చెడు కలుగజాలదని తెలియ జేసియుండెను.

నేటి ప్రపంచ పరిస్థితులలో, ఏ దేశమును, తనంతట తానుగా ఏ కార్యమును సాధించజాలదనియు, ఎప్పటికో ఒకప్పుడు వేరే దేని ఒక ప్రక్కకు ఒరగకతప్పదనియు భారత ప్రధాని నమ్మకమై యున్నది.

ప్రస్తుతము వివిధ దేశముల మధ్యనున్న సంబంధ బాధ్యతలను, తెగతెంపులు చేసికొని ఒంటరితనమును, ఏకాంతమును గోరుట మంచిది కాదు. తమ స్వాతంత్ర్యమునకు, భంగము కాకుండినంతవరకు, ఏ దేశమైనను, ఇతర దేశములతో సాధ్యమైనంత సన్నిహిత భావముల సంపాదించుటకు ప్రయత్నించవలసియుండును. వివిధ దేశముల మధ్య, సామరస్యమును పెంపొందించుచున్న సంస్థ, ఒక అంతర్జాతీయ సమితి తప్ప వేరొకటి లేదు. అట్టిచో కామన్‌వెల్తు ఒక తీరనిలోటును తీర్చగలదు. కామన్‌వెల్తు సభ్యత్వమునం దిరుకక్షులకూ చాల లాభములు గలవని నెహ్రూ పండితుడు చెప్పియున్నాడు.

ప్రపంచమున నేడు శాంతి ప్రబలియున్నది. ఎటు చూచినను తృతీయ యుద్ధము రాగలదను భయమే! ఎటు చూచినను యాందోళనయే. అందువలననే పీడిత ప్రజల, పరిస్థితులను బాగు చేయవలెనన్నచో, యుద్ధము రాకుండ చూచుటకు ఏ ప్రభుత్వమైనను సరియగు పరిస్థితులను కలుగజేయవలసియుండును. ఈ కోర్కెల సాధించవలెనన్న అంతర్జాతీయ సామరస్యము కావలసియున్నది.

నేటి ప్రపంచ వ్యవస్థలో, అప్పుడే రెండు కక్షులు కన్పట్టుచున్నవి. ఒక ప్రక్క అమెరికా ఇంగ్లాండు, పశ్చిమ యూరపు దేశములు తమతమ బలముల వృద్ధి చేసికొనుచుండ, వేరొక ప్రక్క, రష్యా దేశము, దాని యనుచరులు యుద్ధ సన్నద్ధులగుచున్నారు. ఒక ప్రక్క బెర్లిన్ వివాదము, వేరొకచోట ఆటంబాంబు విషయమున అసంతృప్తి. ఇక చిన్న రాజ్యములయిన, గ్రీస్ పాలస్తీనాలలో అంతర్యుద్ధములు జరుగుచుండ, ఈ రెండు కక్షులవారును వేర్వేరు వారలకు సహాయము చేయుచున్నారు. ఇవన్నియు నిటులుండ, చరిత్రాత్మక దేశమగు చైనా గత 18 సంవత్సరములనుండి అంతర్యుద్ధమున చిక్కి నేటికి విషమ పరిస్థితులయందు కూల్లుచున్నది. ఇక మన సరిహద్దు రాజ్యములను, బర్మా, సయాము, ఇండోనీషియాలలో కమ్యూనిష్టు నిరోధకుల విప్లవములు మన దేశమునకుగూడ ప్రాకునేమోనను యనుమానమును, భయమును కలిగించుచున్నవి. ఈ విధమగు ప్రపంచ పరిస్థితులలో, హిందూదేశము, అహింసా సిద్ధాంత కంకణముతో వేరుగ నుండవచ్చును. అది కష్టసాధ్యమైనను దుస్సాధము మాత్రము కానేరదు. ఇప్పటికే మన సిద్ధాంతములతో రెంటికి చెడ్డ రేవడులమైతిమి. మన మే పక్షమును అవలంబింపక ఉదాసీనముగా నుండదలచుట ఇతర రాజ్యముల కర్థమగుట లేదు. మనకు రష్యాయెడ స్నేహము కలదేమోనని అమెరికా, ఇంగ్లాండులును, వారితో కూడదలచితిమని రష్యావారును మనయెడ విశ్వాసము లేకయున్నారు. అదియునుగాక నేటి ప్రపంచమున మన ప్రతిజ్ఞలయందును నమ్మకములయందును ఎట్టి నమ్మకమున్నను అంతర్జాతీయ సంఘము మన యెడల సుముఖముగానే యుండెడిది. అందులకనే మనకు, అతి ముఖ్యమయిన, దక్షిణాఫ్రికా సమస్య నేటికిని పూర్తిగా చర్చింపబడకున్నది. ఇరు కక్షులకును అనుమానకారణముగా హిందూదేశము చాల కాలము నిలుచుట కష్టము గావుననే వెలుతురుండగనే యిల్లు చక్కబెట్టుకొనుట అవసరము.

అట్లయినచో, మనకు రెండు సమస్యలు గోచరించుచున్నవి. మనము స్వతంత్రులముగానే, వేరుగా నుండి ప్రపంచమునకు శాంతిదూతవలె పనిచేయుట మంచిదా? లేక ఏ దేని ఒక పక్షమునవలంబించి మన యదృష్టమును కెదురు జూచుట మంచిదా? ఈ రెండు విషయములలో మొదటిది నేటి ప్రపంచ వ్యవస్థలో దుస్సాధ్యము. ఇక రెండవ విషయమున ఏ పక్షములో సభ్యత్వము వహించుట యను సందేహము రాకమానదు.

ఇప్పటి కప్పుడే, దేశములోని విజ్ఞానులు చాలమంది తమ సలహాలనిచ్చి యుండిరి. రష్యాతో సంఘీభావము కోరువారు బహు కొద్దిమంది గలరు. చిన్నమంటలుగా బయలుదేరి, కారుచిచ్చుగా నలుకుకొని, తమ పీభత్సముతో చైనా, బర్మా మొదలగు దేశములను కబళించుచున్న సైన్యములు నేడు కమ్యూనిష్టు సైన్యములే! ఇక మనముగూడ రష్యాపజ్జ జేరినచో మన దేశమునకుగూడ ఈ గతి పట్టక తప్పదని ప్రజలు భయపడుచున్నారు.

ఈ సమస్యను పూర్తిగా నర్థము చేసికొనదలచినచో విదేశీయుల దృష్ట్యాగూడ మనము పరీక్షించవలసియున్నది. ఒక వేళ మన మీ సంస్థనుండి తప్పుకొనుటకే నిశ్చయించినచో బ్రిటనుకు మనకు గల సంబంధముల నెట్లు సరిచేసికొనగల్గుదుమను ప్రశ్న రాకమానదు. మనకు రాజకీయముగానేకాక, ఆర్థిక సాంఘిక కారణముల వల్లగూడ ఇంగ్లాండుతో సంబంధ బాంధవ్యము లున్నవి. అన్నిటి కన్న ముఖ్యము మన ఆర్థిక సంబంధము. దాని విషయము మనము తీవ్రముగా నాలోచించవలసియున్నది.

తెగతెంపులు చేసికొనుటన్నచో మున్ముందు రెండు నష్టముల నెదుర్కొనవలసియుండును. ఒకటి పౌరసత్వపు హక్కుల (*Citizenship-Rights*) ను పోగొట్టుకొనుట, రెండవది, బ్రిటిష్ కామన్‌వెల్తుతో, ఆర్థిక వాణిజ్య సంబంధములు తెంపుకొనుటకు నేటివరకు, వాణిజ్య విషయములలో మన దేశమునకు, ఇతర దేశములకు పరస్పర సంబంధములున్నవి. కాని మనము విడిపోయినచో మన ముడి పదార్థముల నెగుమతి చేయుటకుగాని, మనకు కావలసిన పనిముట్లను, పదార్థములను దిగుమతి చేసికొనుటకుగాని ఇకపైని బ్రిటిష్ కూటమితో వీలుపడదు. ఇప్పటివరకు అభిమాన దేశముల ఒడంబడిక (*most favoured National treatment*) ప్రకారము, ఇంగ్లాండతోను కామన్‌వెల్తు రాజ్యములతోను మనము లాభదాయకముగా వాణిజ్యమును చేసికొనగల్గుచున్నాము. ఇప్పుడట్టి సదుపాయములను పోగొట్టుకొనినచో, ప్రపంచమునందలి ఇతర రాజ్యములతో పోటీవ్యాపారము జేయుటగాని, మార్కెటుల సంపాదించుటగాని కష్టమగును. అట్లయినచో, ఇప్పుడే తక్కువగానున్న మన దేశ సౌభాగ్యము; ఇక పై నింకను తగ్గగలదనుటలో నేవిధమగు సందేహము ఉండగూడదు.

ఇక పౌరసత్వపు హక్కులె (*citizenship-rights*) విషయములో మనకు తీవ్రమైన నష్టము రాగలదు. పశ్చిమ దేశీయులకు, ఆసియావాసులకు, దేహవర్ణములబట్టి వైషమ్యము కలుగుచుండుట చూచుచుంటిమి. మన కండ్ల యెదుటనే దక్షిణాఫ్రికాలో, తెల్లవారు మన సోదర భారతీయులపట్ల చేయుచున్న దౌర్జన్యములను చూచుచున్నాము. ఇప్పుడు కామన్‌వెల్తునుండి మనము తొలగినయెడల ఈ దౌర్జన్యము ఒక్క దక్షిణాఫ్రికాలోనేగాక ఇతర రాజ్యములందు కూడ చూపబడవచ్చును. కాని యిప్పుడున్న పరిస్థితులలోనే దక్షిణాఫ్రికాకు అసంతృప్తి అధికముగానున్నది. మన మింగ్లాండు పక్షమున నుండ నిశ్చయించినచో వారు వైదొలగ నిశ్చయించినారను వార్తలు వచ్చుచున్నవి. ఇట్టి నిశ్చయమునకే వారు వచ్చినచో, వారి ఆలోచనలను మనము సులభముగా నర్థము చేసికొనవచ్చును. ఏది ఏమైనను ప్రస్తుత దక్షిణాఫ్రికా ప్రభుత్వము మన పౌరులయెడ వ్యతిరేకులను విషయమువారు నిర్వివాదాంశమందుచే మనము కామన్‌వెల్తు సభ్యత్వము నిలుపుకొనినచో, వారు వైదొలగి, లేక, మనము వైదొలగినచో వారు కామన్‌వెల్తులో నిల్చి—ఏదైన యొక మార్గముగా మన పౌరులను హింసించ నుద్దేశించియున్నట్లు తెలియుచున్నది. జాతిమతాచారములబట్టి ఒకరైన, దక్షిణాఫ్రికా ఆంగ్లేయులు, తమ మాతృభూమినుండి తెగతెంపులు చేసికొన దలచిరను మాట అంత సులభముగా నమ్ముటకు వీలులేదు. అన్ని విధముల భిన్నులమైన మనమే వైదొలగినచో వారి జాత్యహంకారమునకు మితియుండదు. మనము వైదొలగనిచో, అంతర్జాతీయ సమితి ఆంగ్లదేశ సహాయముతో కామన్‌వెల్తులోని ఇతర రాజ్యముల ఓట్లతో, దక్షిణాఫ్రికాపై నిషేధాజ్ఞల జారీచేయించుటకు ప్రయత్నింపవచ్చును. అది కానిచో, తర్వాత, ఈ కారణముగా కామన్‌వెల్తునుండి తప్పుకొనవచ్చును. కాని ప్రస్తుత పరిస్థితులలో వైదొలగుట యెంత మాత్రము శ్రేయస్కరము గాదు.

మరియొక విషయము గమనించవలసియున్నది ఇంగ్లాండు దేశమునందు మనకు స్టెర్లింగు నిలువలు చాలగలవు. అన్ని సంబంధములు నిలుపుకొనిన ఈ సమయమందే వానిని విడుదల చేసికొనుట చాల కష్టమగుచున్నది. ఈ నిలువల విడుదలపైననే మన భావి సౌభాగ్యమును పెంపొందించగల సన్నాహములన్నియు నాధారపడియున్నవి. అట్లయినచో, ఈ సమయమందు, కామన్‌వెల్తునుండి మనము తప్పుకొన నిశ్చయించినచో, ఈ నిలువల విడుదల ఆలస్యము చేయవచ్చును. కానిచో, యిప్పటికే, రొదగా వినబడుచున్న ఈ నిల్వల మొత్తముల తగ్గించవలెననెడి (*scaling down*), ఆందోళన పెచ్చుపెరిగి మనకు రావలసిన మొత్తములు విస్తారముగా తగ్గింపబడవచ్చును. అదియును కానిచో, ఈ అప్పుల తీర్చుటకు పూర్తిగా నిరాకరించవచ్చును (*Repudiation*). చరిత్రలో నిట్టి చర్యలకు నిదర్శనములు లేక పోలేదు. అట్టి చర్యలు జరిగినప్పుడు చేయునదేమియు లేదు.

అప్పుడే యుద్ధప్రేరేపకుడు చర్చిలు, కామన్‌వెల్తునుండి వైదొలగ నిశ్చయించినచో, హిందూదేశమును విదేశముగా చూడవలెననియు ఈ విదేశముతో ఎట్టి సంబంధములను నిలుపరాదనియు, భయపెట్టుచున్నాడు. అనగా మన మీ బెదరింపులకు లొంగవలెనని కాదు. ప్రస్తుతము, మన స్టెర్లింగు నిలువలు పూర్తిగా విడుదలగునవరకు, పెరిగి పెంపొందుచున్న కమ్యూనిస్టు విప్లవజ్వాలలు పూర్తిగా చల్లారు వరకు, దినదిన ప్రవర్ధమానమగుచున్న యుద్ధభీతి నశించువరకు, ఇరుకక్షులలోను, మన దేశమందున్న యనుమానము నశించునంతవరకు, మనము కామన్‌వెల్తులో నుండుట మనకే మేలు. అదియును గాక, అట్లు చేసినతరువాత కూడ మనకేదైన యన్యాయములు జరిగినచో, కామన్‌వెల్తునుండి మన యిచ్ఛకలిగినప్పుడు వైదొలగవచ్చును. సర్వస్వతంత్ర రాజ్యముల సమూహమే కామన్‌వెల్తు 1926 బాల్‌ఫోర్ హెచ్చరిక, (*Balfour declaration*), 1931 వెస్టుమినిస్టర్ చట్టము (*Statute of West-minster*) ప్రకారము, ఇష్టమువచ్చినప్పుడు కామన్‌వెల్తునుండి వైదొలగవచ్చుననుయంశము అంగీకరింపబడినది. యుద్ధమే వచ్చినచో కామన్‌వెల్తులోని ఏ సభ్యుడైనను దానికి తటస్థత (*Nuetral*) వహించవచ్చును. మొన్న జరిగిన సమావేశములో, కామన్‌వెల్తుకు ముందు "బ్రిటిష్" అను మాట తీసివేయుట ఇందుకు నిదర్శనము. అందుచే కామన్‌వెల్తు సభ్యత్వము మన స్వాతంత్ర్యమునకెట్టి భంగము కలిగింపదని చెప్పవచ్చును.

కాని కొందరు మనము కామన్‌వెల్తు సభ్యత్వమును నిలుపుకొనినచో అధికార సంఘములలో (*Power Groups*) చేరినవారమగుదుమనియు, అది మన యాదర్శములకు భిన్నమనియు వాదించుచున్నారు. కాని ఎప్పటికో ఒకప్పుడు ఒకరి పక్షమవలంబింపక తప్పదు. కావున అది యిప్పుడే చేయుట మంచిదని చెప్పవలసియుండును. ఇప్పుడింగ్లాండు అమెరికాల పక్షమో, రష్యాపక్షమో అవలంబింపవలసియుండును. కాని ప్రజాసామ్యమనందు నమ్మకమున్నంతవరకు, సామ్యవాదమునందు విశ్వాసము కలిగి, విప్లవ మార్గములవల్లగాక, సౌమ్యమార్గముల ద్వారా సామ్యవాద సిద్ధాంతములను దేశమందు ప్రవేశపెట్టదలచినంతవరకు, కమ్యూనిస్టు సిద్ధాంతముల వ్యతిరేకులుగా నున్నంతవరకు, బర్మా, మలయా, సయాం, ఇండోనీషియాలలోని కమ్యూనిస్టు విప్లవములనణగ ద్రొక్కదలచినంతవరకు, రష్యాతో స్నేహము పొసగదు. అందుచే రష్యా అనుమానమునకు పాత్రులమైనను, స్వశక్తిపై నాధారపడగల్గినంతవరకు, కామన్‌వెల్తుతో సంబంధము పెంచుకొనుట హిందూదేశమునకు లాభదాయకము.

మరి కొందరు, పాకిస్తాన్, కాశ్మీరు దక్షిణాఫ్రికా సమస్యలయందు, ఇంగ్లాండు మన కెట్టి సహాయము నింతవరకు చేసియుండలేదనియు, ఈ కామన్‌వెల్తుగూడ అంతర్జాతీయ సమితివలెనే, ఇట్టి విషయములలో శక్తిహీనమనియు, అట్టిదానితో సంబంధముల నుంచుకొనుట లాభదాయకము కాదనియు అభిప్రాయపడుచున్నారు. ఈ విషయము నిజమే, అందువల్లనే ఈ విషయమును నమ్మకము కుదుర్చుటకు ఇంగ్లాండు ఏదైనా చేయవలసియుండును.

ఇన్ని కారణములుబట్టి చూచినచో, కామన్‌వెల్తు సభ్యత్వమునకు లాభదాయకమనే చెప్పవచ్చును. ఒకటి అహంకారములను, భేదాభిప్రాయములను మరచిపోయి, క్షమాబుద్ధిని చూపుటయందే మానవునియొక్కగాని జాతియొక్కగాని గొప్పదనము కన్పడుచున్నది. కామన్‌వెల్తు సభ్యత్వమున్నచో, వెనుకటివలె ఇప్పుడు బానిసత్వసంబంధము గాదు. సమఉజ్జీవలె సమానసౌహార్దాలతో ఉభయ సౌభాగ్యముల పెంపొందించుటయే ఈ సభ్యత్వముల లక్ష్యము. కావున నేటివరకు జరిగిన తప్పులకు, దౌర్జన్యముల నింకను జ్ఞాపకముంచుకొని స్థిరభావముల (*Sentiments*) కు లొంగి పోయి, దూరదృష్టిని మరచి పోవుట మంచిది కాదు. మరియు, ఈ కామన్‌వెల్తుకూడ ఇక మీదట మునుపటివలె బ్రిటిష్ కామన్‌వెల్తు అనిపిలువబడుటలే దనుట మన స్వాతంత్ర్యమును గుర్తించిచేసిన మార్పేయని గమనించవలెను. ఇదివరకువలె మన మికమీదట గూడ బ్రిటిష్ సార్వభౌమునకు లొంగియుండనవసరము లేదు. మన ఆర్థిక, రాజకీయ సాంఘిక స్వాతంత్ర్యము పూర్తిగా నిలబెట్టుకొనుచు మన దేశమును స్వతంత్రమైన రిపబ్లిక్‌గా నిర్మాణము చేసికొనుచున్న సమయమందే, కామన్‌వెల్తుసభ్యత్వమునుగూడ నిలుపుకొనవచ్చును. నూతన స్వాతంత్ర్యముతో నవనవోన్మేషమై వెలుగొందుచున్న భారతదేశము భవిష్యత్కాలములో ప్రపంచచరిత్రలో గొప్ప పాత్ర వహించగలదు. కాని ఈ పాత్రధారణ బాగుగా జరుగవలెనన్నచో ప్రజాస్వామ్యవాదులగు దేశముల నేస్తము సంపాదించుట ప్రథమమున అవసరమని గుర్తించవలెను. రాబోవు రాజ్యాంగ పరిషత్సభలో ఈ విషయమున సభ్యులందరు తమతమ అహంకారములను మరచి పోయి, దేశసౌభాగ్యమునే మనసున దుంచుకొని కామన్‌వెల్తు సభ్యత్వము నిలుపుకొందురని ఆశించుచున్నాను.

పరమానందాయ్

మూలం : 'గుడ్‌సోల్జర్ ష్వీక్'

రచన :
జరోస్లావ్ హాసక్

'డిటెన్షన్ బారక్సులో' పరమాయి

అనుసరణ :
'ఆప్లవాన్'

అక్కడనుంచి పరమాయిని సరాసరి డిటెన్షన్ బారక్సులకు నడిపించుకుపోయారు.

డిటెన్షన్ బారక్సు యాజమాన్యం త్రిమూర్తులమీద నడుస్తూంది స్టాఫ్‌వార్డరు-స్లావిక్, రెండవవాడు కెప్టెన్ విన్స్టాగ్. మూడవవాడు సర్జంటు మేజరు రేపా. రేపాకు, "తలారి" అని కూడా ముద్దుపేరు ఉండేది ఈ డిటెన్షన్ బారక్సులో, ఒంటరిగదులలో పెట్టి, ఈ యమకింకరులు, ఎంతమందిని యమధర్మరాజుగారి దగ్గరకు పంపించారో చిత్రగుప్తుడికి కూడా లెఖ్ఖ అందదేమో

పరమాయిని బారక్సులో అధీనపరచుకోగానే, స్టాఫ్‌వార్డరు స్లావిక్, పరమాయి ముందరకు వచ్చి, భీముడి పిడికిలిలాంటి తన పిడికిలి బిగించి, పరమాయి ముక్కుదగ్గరకు ఆనిస్తూ—

"ఇదేమిటో తెలుసునురా అంట్ల వెధవా ?" అని అడిగాడు

పరమాయి పసిగట్టుతున్నట్టు శ్వాస ఆడించి, "చిత్తమండయ్యా, దానితో ముక్కుమీద ఒక్కటి పుచ్చుకొన్నారంటే దేవేంద్రలోకమే నండి ఆ వాసన వేస్తూనే ఉందండి" అని ముఖప్రీతిగా అన్నాడు.

ఆమాట పరమాయిని రక్షించింది పరమాయి మాటలకు స్లావిక్ సంతోషంతో సకిలించాడు పరమాయిని పక్కలో పొడుస్తూ, "అహ్హాహ్హా అదీమాట ! ఊఁ, సరిగ్గా నిలబడరా ! జేబుల్లో ఏమున్నాయి సిగరెట్లు ఏమన్నా ఉంటే ఇక్కడ పడేయి డబ్బుకూడా పడేయి మరేవస్తూ నీ దగ్గిర దొంగతనం చెయ్యటానికి వీలుండదు. ఇంతేనా ఉన్నదల్లా ! సరిఅయితే, మరో మాట ఖబడ్దార్—ఏమన్నా అపకతవకమాటలూ అబద్ధాలూ బైట చెప్పావంటే, పుచ్చె ఎగిరిపోతుంది తెలిసిందా !" అన్నాడు.

—సర్జంటు మేజరు రేపా, "వీడి నెక్కడుంచుదా"మని వార్డరు నడిగాడు

"నం 16 రు గదిలో చెడ్డీ-బనీను వెధవల మధ్య పడెయ్యి. వెధవలను వెధవల్లాగే చూడాలి ఎవడన్నా నోరెత్తితే వెంటనే ఒంటరి గదిలో పడేస్తామనీ, అక్కడికి చేర్చాక, పక్కఎముకలు విరగతంతామనీ చెప్పు వాడిని, ఆ కసాయివెధవని ఏంచేసాం! అల్లాగే చేస్తాం!" అన్నాడు వార్డరు

రేపా, మధురస్మృతులు తెచ్చుకొంటున్న క్షుద్రమోతుస్వరంతో అన్నాడు

"ఆ కసాయివెధవా! అబ్బ, బలే యాతన అయిందండి వాడితోటి! ఎందుకూ, బూట్సుతో వాడి గుండెలమీద ఎక్కి అరగంట తొక్కాక కాని "కటక్", "కటక్"మంటూ పక్కఎముకలు విరుగనేలేదు. అప్పటికి నోట్లోనుంచి నెత్తురు వచ్చింది అయినా వెధవ ఆ తర్వాత కూడా పదిరోజులు బతికాడండీ !"

"తెలిసిందిరా వెధవా! పెంకివాళ్లను ఇక్కడేం చేస్తామో తెలిసిందా! కాబట్టి వళ్లు దగ్గిరెట్టుకు మసులు ఇల్లా మమ్మల్ని రెచ్చగొట్టి ఆత్మహత్యలకు ప్రయత్నించకండి. రేపు ఇన్స్పెక్టరు వచ్చి ఇక్కడ ఎల్లా ఉందని అడిగితే "చిత్తమండయ్యా - ఇక్కడ నాకు చాలా బాగుందండి - ఏమీ కంప్లైంటులు లేవండి" అని చెప్పాలి, తెలిసిందా! చెప్పు, ఏమనిచెపుతావోఁ?" అని వార్డరు పరమాయిని అడిగాడు.

"చిత్తమండయ్యా, ఇక్కడ నాకు చాలా బాగుందండి - ఏమీ కంప్లైంటులు లేవండీ" అంటూ పరమాయి అమందానందకందళిత ముఖారవిందం పెట్టి అన్నాడు. అది అమాయకత్వం అర్భకత్వంక్రిందే వార్డరు భావించి తృప్తుడయ్యాడు.

"సరే! నీదుస్తులూ గిస్తులూ అన్నీ ఇక్కడ పెట్టి, చెడ్డీబనీను మాత్రమే మిగుల్చుకొని, 16 నంబరు గదికి పో"అని పంపించాడు

16 వ నెంబరు గదిలో చెడ్డీ బనీన్లమాత్రమే తొడుక్కొన్నవాళ్ళు పరమాయితో కలసి ఇరవైమంది ఉన్నారు

మర్నాడు చెడ్డీ-బనీనులవాళ్ళు ఇరవైమంది, "ప్రార్థనసమావేశంలో" పాల్గొనాలని, బారక్సు కాపలావాళ్ళు వాళ్లను ప్రార్థన సమావేశానికి తోలుకొనిపోయారు

(యుద్ధకాలాల్లో పాశ్చాత్యదేశాలలో సైనికులకు నిత్యప్రార్థన సమావేశాలు జరుపుతారు అందుకోసం ప్రత్యేకంగా ప్రీస్టులుంటారు ఆసమావేశంలో ప్రీస్టు చర్చి తదంగమంతా, మంత్రపుష్పంనుంచి తీర్థం ఇయ్యటంతోపాటు శరగోపురం పెట్టటందాకా అంతా జరుపుతాడు. దానితో బోలెడు పూజాతదంగం అంతా ఉంటుంది)

అవాళ ఆ తదంగం నడిపే ప్రీస్టు పేరు ఆటోకాట్జు ఆటోకాట్జు అసలు యూదు (*Jew*), కాలేజీలో చదువుకొన్నాడని ఒక కంపెనీలో అకౌంట్సు చూసే భాగస్వామిగా చేర్చుకొన్నారు తన అత్యధిక ఆర్థికవ్యాపార విజ్ఞానాన్నంతా ఉపయోగించి కాట్జు కంపెనీని ఒక ఏడాదిలో దివాలా తీయించాడు కంపెనీలో పెద్దభాగస్వాములిద్దరూ, ఉత్తరదక్షిణ అమెరికాలకు చెరోకరూ పలాయనం చిత్తగించారు. అప్పులవాళ్ళుమాత్రం అక్కడే నిలచారు

కాట్జుకు కిరస్తానీమతం పుచ్చుకొంటే, కొంచెం లాభం ఉంటుం దనిపించింది ఒకనాడు బాగా డోస్ మీద ఉన్నప్పుడు, అన్యాయంగా చర్చిఉద్యోగంలో చేరిపోయాడు అక్కడినుంచి ప్రీస్టు అయి ఊరుకొన్నాడు

ఆటోకాట్జు ప్రార్థనసమావేశాలలో ఉపన్యాసాలు తయారుచేసుకొచ్చే తెలివితక్కువపని ఏనాడూ చేయలేదు. ఆశువుగా, జానపదసాహిత్యంలో సృష్టిస్థితిలయాలకు సంబంధించిన పదజాలాన్నంతనూ ఊతపదాలుగా వాడుతూ శ్రోతలకు చెవుల పండుగగా ఉపన్యాసా లిచ్చేవాడు. అందుచేత అతని ప్రార్థన సమావేశం ఉంటుం దంటే, అందరికీ బలే ఖులాసాగా ఉండేది.

ఆటోకాట్జు, చర్చిమంత్రాలు చదివేటప్పుడు కూడ, ఆశుకవిత్వం దొర్లుతూనే ఉండేది పెళ్లిమంత్రం తద్దినానికీ, తద్దినం మంత్రం పెళ్లికీ చదువుతూండే అవస్థలన్నీ ఉండేవి కాస్త నిషామీద ఉన్నాడంటే ఆ ఉపన్యాసం ప్రతిభతో ఉట్టిపడ్తుతూ ఉండేది. ఒక్కొక్కప్పుడు ఆ నిషాలో ఒళ్లు తూలి వేదికమీదనుంచి తలక్రిందులుగా క్రిందికి పడుతూండేవాడు. ఏదయినా మొత్తానికి బలే సరదాగానే ఉండేది.

ఆనాడు ఆటోకాట్జు చాకొక్క దగ్గిరనుంచీ తిరగేసే తొడుక్కొని వచ్చాడు

పరమాయి "చెడ్డీ-బనీను" జనాభా ఇరవై మందితో కలిసి ఓమూల ఉన్నాడు. వాళ్ళూ తక్కిన అందరిలాగే కాట్జు ఉపన్యాసానికి ఆనందంతో పొంగిపోతున్నారు.

కాట్జు మొదలుపెట్టాడు

"కామోష్! మనం అందరం ఇప్పుడు ప్రార్థన చెయ్యాలి—నేను అందుకోగానే పల్లవిగా అంతా కలిసిఅనాలి ఆ వెనకాల ఎవడ్రా వాడు చేతిలో చీదుకొంటున్నాడు. ఓరి పందివెధవా! ఇక్కడ చీదకూడదురా—ఇది దేవాలయం, తెలుసా? ఇక్కడ చీదావంటే నాశనమైపోతావు-ఉ! ప్రార్థన గీతాలు అందరికీ జ్ఞాపక మున్నాయిట్రా, వెధవల్లారా! ఏదీ మొదలు పెట్టండి నాకు తెలుసును ఒక్కవెధవకీ అక్షరముక్క రాదు"

పరమాయి పక్కనున్నవాడు—ఇకిలిస్తూ పరమాయితో"ఇవాళ బలే మజాగానే ఉన్నాడు ఉపన్యాసం వినాలి" అంటూ లొట్టలు వేస్తున్నాడు

కాట్జు చెప్పుకుపోతున్నాడు

"మిమ్మల్నా! మిమ్మల్ని నిలువునా కాల్చెయ్యాలిరా, చేరారుమంద, మందగొడివెధవలు—మీకు దేవుడక్కర్లేదు- మీ కేమీ అక్కర్లేదు- ఇల్లా పాపమార్గంలో పడి పొర్లటమే మీకు సరదా.

"ఈ పాపమార్గ ముందే, ఓరి మట్టిబుర్రసుంటల్లారా, ఈ పాపమార్గం, అంతా ముళ్లతో నిండిఉందిరా! మీరు తిండిపోతు వెధవలు - ఒంటరి జైలుగదిలో ఇల్లా పాపంలో పొర్లేందుకయినా ఒప్పుకొంటారుగాని, ఈ పాపపుదోవ విడిచి, పరమాత్ముడుని చేరుకొందామని మీ కే కోశానైనా, కోరికైనా ఉందా! ఛీ! లేనే లేదే! పైకి చూడండ్రా మూర్ఖుల్లారా! పైకిరా-స్వర్గశిఖరాల్లోకి చూడండిరా విజయప్రకాశంతో భగవంతుడు కనబడటంలేదూ! ఆ వెనకాల ఎవడురా ఆ సకిలింపు-తనే గుజ్జానన్నను కొన్నాడా? ఇది గుజ్జపుకాల అనుకొంటున్నాడా? ఇది గుజ్జపుకాల కాదురా శుంఠా, దేవాలయంరా! ఒరేయ్ అంతా గుర్తుంచుకోండి, ఇది దేవాలయం - దేవాలయంలో - ఇప్పుడేవో చెప్పబోయాను, ఏమిటి చెపుతున్నాను? - ఆ! అదీ, ఓరి అడివిమృగాలూ, మీరు మనుష్యులమనీ, మనకి, దేవుడూ స్వర్గం అన్నీ చీకట్లోంచి ఛాయగా మాత్రమే కనబడ్తాయనీ తెలుసుకోండి - ఇక్కడ ఇదంతా నశించిపోతుంది దేవుడు మాత్రమే నశించడు. ఆ దేవుణ్ణి, అహోరాత్రాలూ, మిమ్మల్నందరినీ, మీ ఆత్మలన్నిటినీ రక్షించాల్సిందని, నేను ప్రార్థించాలని నన్ను నియమించారు కాని అక్కడే పొరబాటుపడుతున్నారు - నేను మిమ్మల్నెల్లాగో స్వర్గానికే చేర్పిస్తానని మీరు అపోహపడుతున్నారు - ఉహూ! ఛస్తే చేర్పించను - ఇందులో ఒక్కవెధవకోసమైనా పల్లెత్తుసాయం చెయ్యటానికి, భగవంతుణ్ణడగటానికీ నేను పూనుకోనే పూనుకోను - కలలోనైనా అల్లాంటి పని తలపెట్టను - మీరు భటాచోర్లు - రావణా వెధవలు - మీకు ఛస్తే సాయం చెయ్యను - వింటున్నారా సుంటల్లారా - అదిగో-ఆ బనీను - చెడ్డీల వెధవలూ - విన్నారురా!"

"చిత్తమండయ్యా! విన్నామండి"

"విని ఏడిస్తే చాలదోయ్ వెధవల్లారా, మీ జీవితాలకు పట్టిన మకిల, దేవుడు ప్రసన్నుడైనా పోదురా, బుద్ధూల్లారా! దేవుడి దయకూడా పరిమితి ఉందిరా—అది దాటితే దేవుడుకూడా మిమ్మల్నిరక్షించలేడురా—మరి మిమ్మల్ని రక్షించమని నేను దేవుడితో చెప్తాననుకొన్నారేమో, మిమ్మల్ని చీకటి కోణాల్లో పడేయించి బండకొయ్యల నేయిస్తా తప్ప, ఛస్తే దేవుడితో చెప్పను. మీకు దేవుడే కావాలిట్రా - మీకోసం ఇల్లా నేను ఏడుస్తున్నాగాని-మీరు మీపాపాలు మానుకొంటారా? ఎప్పటికైనా వెధవలు మీకే తెలిసివస్తుంది - నేను మీకు మంచిచేద్దామని ఎంత పాటుపడుతున్నానో—"

చెడ్డీ - బనీన్ల వాళ్లు ఇరవైమందిలో ఒకడు వెక్కి వెక్కి ఏడవటం మొదలు పెట్టాడు—మరెవరూ కాదు పరమాయే! పక్కనున్న వాళ్ళంతా కిచకిచలు పోతున్నారు.

కాట్జు పరమాయి వంక చూశాడు. పరమాయి వెక్కిలు పెడుతూ రెండు గుప్పిళ్ళతోటీ కళ్ళు నులుముకొంటూ తుడుచుకొంటున్నాడు.

"ఒరేయ్ వాడిని చూడండిరా! ప్రతి వెధవా వాడిని చూసి బుద్ధితెచ్చుకోండిరా- బాగుపడదామని సద్బుద్ధి కలిగి, పశ్చాత్తాపపడుతున్న మనిషి ఎదురుగుండా కనబడుతున్నా మీకు సిగ్గు రాదేంరా—ఒక్కొక్క వెధవ గడ్డి మేస్తూ కూర్చుంటూ కేమిరా పశువుల్లాగా, దేవాలయంలో ఎల్లా నడుచుకోటమో తెలియదేం—కామోష్! ప్రార్థనగీతాలలో అంతా నిశ్శబ్దంగా ఉండాలి—కిందటి మాటులాగా, వెనకనున్న వెధవలు బట్టలతావులు వేలం వెయ్యటం మొదలుపెట్టకూడదు - కామోష్ !"

ప్రార్థన పూర్తి అయాక ఆటోకాట్జు పరమాయిని ప్రత్యేకంగా పిలిపించాడు

పరమాయి అతని గదిలోకి వెళ్ళాడు

"ఆ! దా! నీకోసమే చూస్తున్నాను. ఒరేయ్! ఇందాకటి నీ ఏడ్పువిషయమే ఆలోచిస్తున్నా - ఒరేయ్ - ఇరవైయేళ్ళనుంచీ నేను ఉపన్యాసా లిస్తూంటే ఒక్కడూ ఏడ్చిన పాపాన పోలేదు, తెలుసా!"

అని పరమాయిదగ్గిరకు వచ్చి రెండుబుజాలూ పట్టుకొని గట్టిగా కుదిపిస్తూ, "ఓరి దొంగవెధవా! నిజం చెప్పు, నువ్వు దొంగవేషం వేశావా, లేదా ? నిజంగా నీకు ఏడుపు వచ్చిందటరా! ఎందు కేశావ్ దొంగవేషం - నిజం చెప్పు!" అంటూ మొహంలో మొహంపెట్టి ఉరిమాడు

పరమాయి ఏమీ చలించకుండా అతి తీవ్రంగా చెప్పుతున్నాడు

"చిత్తమండయ్యా; దేవుని ముందర ప్రమాణంచేసి చెప్తున్నానండి, సత్యప్రమాణకంగా నేను దొంగవేషమే వేశానండి. తమరి ఉపన్యాసం విన్నకొద్దీ—మీ ఉపన్యాసం రంజుగా ఉండాలంటే—పశ్చాత్తాపంపడ్డ పాపాత్ముడొక్కడే, లోటు అనిపించిందండి- మీరూ అందుకే చూస్తున్నారనుకొన్నానండి- అందుకనే మీకు కాస్త ఉపకారంచేద్దామనీ, పరోపకారబుద్ధి ఇంకా మాలో ఉంది అని మీకు ఋజువుచేద్దామనీ, కాస్త నా ఖులాసా కూడా తీర్చుకోవచ్చుననీ - అల్లా చేశానండి" అన్నాడు

కాట్జు, పరమాయి అమాయకవదనాన్ని పరీక్షగా పదినిముషాలు తేరిపారచూశాడు పరమాయి చలించలేదు - చివరికి కాట్జు బల్లమీద కూలబడి, "ఒరేయ్! నువ్వంటే నాకు ఎందుకో ఇష్టంపుడుతోందిరా - నువ్విప్పుడు ఏ రెజిమెంటులో ఉన్నావ్" - అంటూ త్రాగుడువల్ల వచ్చిన ఎక్కిళ్లలో మునిగిపోయాడు.

"చిత్తమండయ్యా-నేను 91 రెజిమెంటువాడినండి - అల్లా అని ఇప్పుడు 91 రెజిమెంటువాడినని చెప్పకోటానికే వీలున్నట్టులేదండి- అసలు నిజానికి ఇప్పుడు నా పరిస్థితి ఏమిటో నాకే బొత్తిగా తెలియదండి—" అన్నాడు పరమాయి.

కాట్జు, ఎక్కిళ్లమధ్యనే—"మరి ఇప్పుడిక్కడ ఎందుకున్నావురా?" అని అడిగాడు.

"చిత్తమండయ్యా ! ఇప్పుడిక్కడ ఎందుకున్నానో, దీనివిషయం మరి ఎవళ్లతోనూ నేను ఎందుకు ఫిర్యాదుచేసుకోటం లేదో నాకే తెలియటంలేదండి—అంతా నా దురదృష్టమే అనుకోండి! నేను ఎప్పుడూ "అన్నీ మన మంచికే" అన్న దృష్టిలోనే ఉంటానుగానీండి, ఎందుకో నాకు అన్నీ చెడే కలుగుతూంటాయి అండి—"

"నువ్వంటే నాకు ఇష్టం కలుగుతూందిరా. సరికాని ఇప్పుడు నీతో ఇక్కడ మాట్లాడుతూ కూర్చోటానికి నాకు తీరదు—నిన్ను నేనునాదగ్గిరకు తీసుకోటానికి ప్రయత్నంచేసి మర్నాడుతో చెపుతాను ఇప్పటికి పో—డిస్‌మిస్"—అని పరమాయిని పంపించాడు.

పరమాయిని తన దగ్గిరకు మార్పించమని కాట్జు సైనికశాఖకు తెలియచేశాడు. పరమాయి రికార్డు అంతా సైనిక కార్యాలయాలలో ఎక్కడో ఆఫీసులలో పోయింది. పరమాయి అక్కడ ఎందుకున్నాడో ఎవరికీ అజ చిక్కలేదు. చివరికి పీడ వదలిందే చాలనుకొని, ఆఫీసరు పరమాయిని ఆటోకాట్జు దగ్గిర సేవకుడుగా ఉండేందుకు ఇద్దరు సిపాయిల పహారాక్రింద పంపించాడు.

—

ఆంధ్రవిశ్వకళాపరిషత్తుకు

శ్రీ అరవిందయోగి సందేశం



ప్రస్తుత సందేశం ఆంధ్ర విశ్వకళాపరిషత్తుకు సంబంధించి ఉండవలసినదే కాని ఈదేశ పరిపాలనా విధానమేకాక, దేశ భవిష్యత్తు, జాతిప్రకృతి, ప్రపంచంలో దేశస్థితి నిర్ణయించబడుచున్న ఈనాడు, ఆ దిశ పరికించకుండా ఉండలేను బ్రిటిష్ పాలకులచే నిర్మింపబడిన కృత్రిమరాష్ట్రాలను పునర్విభజించే సమస్య ముఖ్యంగా గోచరిస్తున్నది ఐక్యతలోని ఈభిన్నత్వం భారతదేశచరిత్రలో పూర్వంకూడా ఉన్నదే.

భారతదేశానికి అప్పుడప్పుడు వచ్చిచేరిన అన్యులకు భారతజాతీయ విశిష్టత, భారత నాగరికతా విశిష్టత ఆపాదింపబడినవి. వారు భారత జాతిలో లీనమైనారు. అయినప్పటికీ భారత జాతీయతకు, నాగరికతకు అనుగుణముగానే వచ్చిచేరిన వివిధజాతులవారు తమవిశిష్టతను కూడ కొంత నిలపుకొన్నారు. వీరు భిన్నభాషలు, భిన్నకళలు, భిన్న సమాజాలు, భిన్నజీవిత విధానాలు అలవరుచుకున్నప్పటికీ, అంతర్యంలో ప్రాథమికభారత విశిష్టత పోలేదు నాగరికతలో ఇట్టి విశిష్టతను ఆర్జించినప్పటికీ, రాజకీయంగా ఎన్నడూ ఐక్యత సాధించలేదు. బ్రిటిష్ పరిపాలకులు వచ్చి, ప్రాంతీయభేదాలను, ఉపజాతిభేదాలను మన్నించకుండా కృత్రిమమైన రాష్ట్రవిభజన చేశారు వారి ఇంగ్లీషు విద్యాప్రచారం భిన్నరాష్ట్రముల అన్యోన్యతా సాధనకు సహాయపడింది. స్వాతంత్ర్యసమరానికి చాలినంత, పరిమిత ఐక్యత లభించగానే భారతదేశం స్వాతంత్ర్యం ఆర్జించింది అయితే పూర్తి జాతీయైక్యత ఇంకా సాధింపబడలేదు. ఇది చాలదన్నట్లు దేశం బలాత్కారంగా ద్విజాతి సిద్ధాంతం ఆధారంపై పాకిస్థాన్ హిందూస్థాన్‌లుగా ఖండించబడింది

బ్రిటిష్‌వారినుంచి హస్తగతం చేసుకున్న పరిపాలనా యంత్రాన్ని ప్రస్తుతస్థితిలోనే ప్రస్తుత రాష్ట్రవిభజనతోడనే తాత్కాలికంగా కొంత కాలం నడుపవలసిఉంటుంది. కాని ఈకృత్రిమ విభజన చిరస్థాయి కావన్న ప్రమాదం గోచరిస్తున్నది. ఈరీతిగానే రాష్ట్రాంగాలు ఉంటేనే ఐక్యత సాధించవచ్చునని కొందరు తలచుచున్నారు. పూర్వ ఉపజాతి వైషమ్యాల నీరీతిగా నివారించవచ్చునని వారి అభిప్రాయం. ఒకే జాతీయభాషలో, ఒకేరీతి విద్యావిధానం, పరిపాలన నెలకొల్పి ఐక్యతను బలవంతాన సాధించాలని వారి యత్నం. భవిష్యత్తు ఎట్లున్నప్పటికీ ఈవిధానం ఇప్పుడుమాత్రం మేలైనది కాదు. పూర్వ వైవిధ్యంలో లోపాలతోపాటు కొన్ని సత్ఫలితాలు వచ్చినవి. వైవిధ్యంవల్ల దేశం నలుమూలలా నిర్మాణాత్మక జీవనం వికసించింది.

ఇకనంచి ఈ వైవిధ్యం భారతజాతీయైక్యతకు భంగం కలిగించే ప్రమాదం లేదు ప్రయాణ సౌకర్యాలవల్లనూ, భౌతికశాస్త్రాభివృద్ధివల్లనూ ఐక్యతాభావం స్థిరపడింది పరిపాలనకు వీలైన కేంద్రాంగ మొకటి నిర్మించబడింది దేశభక్తి భావం ప్రజల హృదయాలలో గాఢంగా నాటుకొన్నది. ఇది ఇంక తరుగదు

ఇక ఉపజాతుల స్వేచ్ఛాజీవనాన్ని నివారించినందువల్ల ఐక్యతకు భంగం కలుగుతుందే కాని, వారి న్యాయోచిత వాంఛలను మన్నించినట్లయితే ఐక్యతాభావం భగ్నం కాదు సరిగదా, మరింత స్థిరపడగలదు ప్రత్యంగ సంపూర్ణవికాసంద్వారానే సామరస్యం చేకూరగలదు స్వాతంత్ర్య సిద్ధికి పూర్వం కాంగ్రెసు సంస్థ భాషాప్రయుక్తరాష్ట్ర విభజన చేయగలదని ప్రమాణం తీసుకొన్నది ఇప్పుడు కాకపోతే త్వరలోనే వాగ్దానాన్ని అమలుజరపడం వివేకమైన పని. అప్పుడు భారతజాతీయత సహజశక్తిపైన ఆధారపడి వృద్ధికాగలదు భారతదేశానికి సహజ లక్షణమైన వైవిధ్యంలోని ఐక్యతాభావం స్వభావ స్వధర్మాలపై సుస్థిరం కాగలదు ద్రావిడ ప్రాంతవాసులైన 4 ఉపజాతులు భిన్న స్వపరిపాలన కోరుతున్నారు మహారాష్ట్రులు కోరుతున్నారు వీనిని విభజించి హిందీభాష వినియోగంలోఉన్న ప్రాంతా లన్నిటినీ చేర్చి ఒక రాష్ట్రంగా నిర్మించినట్లయితే ఈ సహజ కార్యం పూర్తిఅవుతుంది భారతదేశ విభజనము ఒండెప్పుడో రద్దయినప్పటికీ ఈ సహజాభివృద్ధికి భంగం కలుగదు ఈ పునర్నిర్మాణంలో సంస్థానాలు అంతర్ధానం కాగలవు

ఈ నూతన వ్యవస్థలో ఆంధ్రవిశ్వ కళా పరిషత్తు ఆస్తికత స్థానం కాగలదు. భారతదేశంలోని ఇతర విశ్వవిద్యాలయాలవలెగాక ఆంధ్ర విశ్వవిద్యాలయం ఒక్కటే ఒకదేశభక్తుడైన ఆంధ్రుని కృషిఫలితంగా స్థాపించబడింది ఇది రాష్ట్రప్రధాన నగరంలోకూడా నెలకొల్పబడలేదు ఒక తెలుగు పట్టణంలో నెలకొల్పబడింది.

భారత రాజకీయరంగంలో ప్రశంసాపాత్రమైన కార్యమును నిర్వహించి, చిత్రకళ, శిల్పం, గానం, సారస్వతాలలో ఉన్నతస్థాయి పొందిన ఆంధ్రదేశం ఒక శక్తివంతమైన జాతికి నివాసం పూర్వ భారతసామ్రాజ్య చరిత్రలో తుది హైందవ సామ్రాజ్యమైన విజయనగర చరిత్ర స్మృతి ఏజాతియైనా గర్వించదగినది ఆంధ్ర యువజనులు పూర్వవైభవాన్ని సాధించడానికి, పూర్వకళా సారస్వత నాగరికతౌన్నత్యాలను సాధించడానికి, దేశంలో జ్ఞానవికాసం ప్రసరింపచేయడానికి సంపూర్ణావకాశా లిచ్చి విశ్వకళాపరిషత్తు ఉన్నతస్థాయిని పొందగలదు భారతపౌరులను, విజ్ఞానవంతులను తయారుచేయవలసియున్నది. ఆంధ్రదేశానికీ, భారతదేశానికీ ప్రపంచంలో ప్రతిష్ఠ తేగల పౌరలను తయారు చేయాలి

భారతదేశం ఈనాడు అనేక గురుతర సమస్యల నెదుర్కొనవలసి యున్నది యుద్ధానంతర ప్రపంచం కల్లోలంగా ఉంది శాన్‌ఫ్రాన్సిస్కోలో స్థాపింపబడిన ప్రపంచసంస్థ సామరస్యంసాధించలేకున్నది.

భారతదేశం ఇతరదేశాలవలె రాజకీయ తంత్రాంగంలో చిక్కుకొనరాదు. సైనిక, వాణిజ్య, రాజకీయ శక్తులవలన జాతీయజీవనం అంతమొందే ప్రమాదంనుంచి భారతదేశాన్ని కాపాడాలి. స్వధర్మాన్ని మరిచిపోనప్పుడే పూర్వ భారతౌన్నత్యం పునరుజ్జీవితం కాగలదు.

హిందీ సాహిత్యము : జాతీయభావన

శ్రీ దేసు సత్యనారాయణ

సాహిత్యము సమాజమునకు ప్రతిబింబము. సమాజమునందలి సాంఘిక, రాజనైతిక, ఆర్థిక పరిస్థితులను చిత్రించు సాహిత్యమే యుగమునకు మార్గదర్శి కాగలదు ప్రజల సామాజిక జీవితమును చిత్రించి వారి నైతిక జీవితమునకు బల మిచ్చుటే సాహిత్యమునకు పరమావధి అందును ముఖ్యముగా ప్రతిదేశమునందును, జాతియందును జాతీయ సాహిత్యమునకు గౌరవ మీయబడినది ఏ జాతియందు జాతీయసాహిత్య మౌన్నత్య స్థితియందు ఉండగలదో, ఆ జాతి సభ్యతా

భూషణకవికి తరువాత జాతీయ సాహిత్యమార్గమును ప్రశస్తము నొనరించినవాడు భారతేందు హరిశ్చంద్రుడు ఇతడు నిజమైన జాతీయ కవి ఇతని కవిత్వము నిర్దుష్టమై, ప్రజల కనుగుణమై అలరారుచున్నది భారతేందుని కావ్యప్రతిభ కల్పనా శక్తి, వర్ణనా పటుత్వ మెంతయు గొనియాడ దగియున్నవి కేవలము తానే గాక తన మిత్రులనందరిని ప్రోత్సహించి జాతీయ మార్గమున నడిపిన వీరవరుడు భారతేందుడు విదేశీయ ప్రభుత్వమునకు భయపడక నిర్భయముగా జాతీ



పాకిస్థాన్ ఆర్థికమంత్రి ఖులాం మహమ్మద్ గారికి అఖిలభారత ఆధినివేశమంత్రి శ్రీ గోపాలస్వామి అయ్యంగార్ గత ఆదివారం విందుచేసిన సందర్భంలో తీసిన ఛాయాచిత్రము

సంస్కృతులును ఉన్నత దశయందు ఉండగలవు ప్రస్తుతము నేనిచట హిందీ సాహిత్యమునందు జాతీయభావము లెప్పటినుండి కలిగినవో వివరించెదను

హిందీ సారస్వతమునందు మొట్టమొదటి జాతీయ కవి భూషణుడు. అతనికి ముందు జాతీయభావములచే ప్రేరితులైయెవరును జాతీయ సాహిత్యము రచింపలేదనియే చెప్పవచ్చును ఇతడు శివాజీఆస్థానమున నుండువాడు హిందీ సాహిత్యమునందది శృంగారకావ్యయుగ మయినను 'భూషణ' కవి దేశాభిమానము, జాతీయ గౌరవము గలవాడై వీరరసప్రధాన కావ్యములనే రచించెను పతిత హిందూజాతి, పతిత హిందూ ధర్మ సంరక్షణార్థమై అతడు చేసిన కృషి అమూల్యము. అతని ప్రతిపదమునందును స్వాతంత్ర్యప్రేమ జాతీయత స్వాభిమాన గౌరవ ప్రపత్తులు మనకు గోచరింపగలవు

యత, దేశభక్తి, ఆత్మోన్నతి మున్నగు ఉన్నతాశయములకు ఎలుగెత్తి చాటినవాడును భారతేందు హరిశ్చంద్రుడే నిజభాషా ఉన్నతి సబ్ ఉన్నతికో మూల్" అను నుపదేశము పరభాషా వ్యామోహితులైన అనేక యువకుల హృదయములందు మాతృభాషాభిమానమును కలిగించినది. నిజముగా హిందీ సాహిత్యాకాశమునందు భారతేందు (చంద్రు) ని వంటివాడు

భారతేందుని తరువాత చెప్పుకొనదగిన కవివరుడు బాబూ మైథిలీశరణ గుప్త గుప్తజీ వర్తమానజాతీయ,కవులలో సర్వశ్రేష్ఠుడు 1942సం. జాతీయ సంగ్రామమందు ప్రభుత్వా రీతని రచనలకు భయపడి అరెస్టు గావించిరి

గుప్తజీ అనేక కావ్యరచయిత "భారత భారతి" అను కావ్యము ఎక్కువగా ప్రశస్తి గాంచినది దానిని నేటి యువకులు రామాయణముకంటె నెక్కువగ ఆదరించి పఠించిరి, పఠించుచున్నారు. ఆ కావ్యమునందు ప్రాచీన భారతదేశ ఔన్నత్యము, వర్తమాన సమాజ పతనమునకు కన్నీరుగార్చి భవిష్యత్తు నందు మన మెట్లుండవలయునో బోధించిరి. ఆ కావ్యము మన తుమ్మల సీతారామయ్యగారి రాష్ట్రగానము వంటిది. "సాకేత" అను ప్రబంధకావ్యమునందు గూడ ప్రస్తుత సమాజమున కనుగుణముగా రామాయణమం దనేక మార్పులు చేసి నూతనశైలిలో, జాతీయభావములతో, తన యపూర్వకల్పనా శక్తితో రచియించెను. గుప్తజీ కావ్యభాషయు అతిసరసమై, కోమలమై, మాధుర్యయుక్తమై, ఓజస్సు, తేజస్సు కలిగియున్నది.

గద్యమునందు ప్రసిద్ధికెందినవాడు ప్రేమచందు. ప్రేమచందు ప్రముఖ నవలారచయిత. గాంధీ సిద్ధాంతములను తన రచనలయందు పూర్తిగా నన్వయముచేసి సాహిత్యరంగమున భావవిప్లవము కలిగించినవాడు ప్రేమచందు, "రంగభూమి", "కర్మభూమి" మున్నగు నవలయందు, ఈ కాలపు రాజకీయ సామాజిక-ఆర్థిక విప్లవములు మనకు గోచరించును. సమాజమునందలి అంధవిశ్వాసములను బారద్రోలి నూతన సమాజవ్యవస్థను సామ్యవాద సిద్ధాంతముల పునాదిపై నిర్మింపవలయు ననువాడు ప్రేమచందు.

ప్రేమచందు తరువాత సుమిత్రానందు పంతు "యుగధర్మ "యుగవాణి" అను కావ్యములను రచియించిరి. పంతు సుకుమారకల్పనాకవియైనను "యుగవాణి"యందు అతని విప్లవవ్వాణి ప్రతిధ్వనించినది. "దినకరు" విప్లవకవి. ఈతని ప్రతిపంక్తియందును దేశభక్తి జాతీయస్వాభిమానము ఉట్టిపడును. ఇంకను అనేక నవోదిత జాతీయకవులు గలరు.

శ్రీమాన్ యస్. శ్రీనివాస అయ్యంగార్

శ్రీ ఆర్. యస్. శర్మ

వర్తమాన ప్రఖ్యాత నాయకులగు డాక్టర్ పట్టాభి సీతారామయ్యగారు కాంగ్రెస్ అధ్యక్షులయిన సందర్భమున మరిఇద్దరు ప్రముఖుల నామములు మన దృష్టిపథములోనికి వచ్చినవి. అందొకరు శ్రీ ఆనందాచార్యులుగారు—పట్టాభిగారికి పూర్వమీ స్థానము నలంకరించిన ఆంధ్రుడు. రెండవవారు శ్రీమాన్ శ్రీనివాసయ్యంగారు—పట్టాభిగారికి పూర్వము రెండు దశాబ్దముల వెనక కాంగ్రెస్ అధ్యక్షుడైన తమిళ ప్రముఖుడు. వీరికి పూర్వము శ్రీ సేలం విజయ రాఘవాచార్యులు, సర్ శంకరన్ నాయర్ గార్లు ఈ గౌరవము పొందిన దాక్షిణాత్యులు.

పట్టాభిగారికి శ్రీ అయ్యంగారికి కొన్ని విషయములలో మనకు పోలిక కానవచ్చును. పట్టాభిగారి విషయములో ఆయన శ్రీ గంజాం వేంకటరత్నం పంతులుగారి అల్లుడను విషయము లోకము దృష్టి నాకర్షించినట్లే శ్రీనివాసయ్యంగారి విషయములో ఆయన శ్రీ భాష్యం అయ్యంగారి అల్లుడను అంశము లోకులకు బాగుగా విదితమే. రెండవది ఇద్దరియందు సమగ్రపాండిత్యప్రకర్ష గలదు. వారిరువుర రాజకీయ ప్రతిభ విస్మరింపబడినను, పట్టాభిగారి కాంగ్రెస్ చరిత్రయు, శ్రీ అయ్యంగారు హిందూ న్యాయశాస్త్రముపై వ్రాసిన గ్రంథమును వారి ప్రఖ్యాతి నాచంద్రార్కము నిలుప గలవు. మెయిన్ మహాశయుని హిందూ న్యాయ శాస్త్రమును ఏనాడో మేమట్లు పిలుచుట మాని శ్రీనివాసయ్యంగారి హిందూ న్యాయశాస్త్రము మనుచున్నామని న్యాయాగారొకసారి వ్రాసి యుండిరి.

పట్టాభి, అయ్యంగార్లయందు మనకు గోచరించు వ్యత్యాసములు

ఐతే ఈ ప్రముఖులిద్దరియందు మనకు గోచరించు భేదములింతకన్న ప్రధానమైనవి. పట్టాభిగారు గాంధితత్వముయొక్క ప్రధాన భాష్యకారులు కాని శ్రీనివాసయ్యంగారు గాంధితత్వమునకు ప్రబల వ్యతిరేకులు. పట్టాభిగారి అభిమానవిషయము నిర్మాణకార్యక్రమము కాగా శ్రీ అయ్యంగారికి శాసనసభాప్రవేశముపై మోజుఎక్కువ. శ్రీ అయ్యంగారికి కాంగ్రెసులో ప్రవేశించిన అచిరకాలములో అధ్యక్షపదవి లభ్యముకాగా, డాక్టరుగారు కాంగ్రెసులో ప్రవేశించిన సుమారు మూడు దశాబ్దులకుగాని ఈగౌరవము లభింపలేదు. నిరాడంబరత పట్టాభిగారి జీవితలక్ష్యము కాగా అయ్యంగారు మహాభోగి యని వాసికెక్కిరి.

శ్రీఅయ్యంగారి జీవితసంగ్రహము

శ్రీమాన్ శ్రీనివాసయ్యంగారు ప్రసిద్ధ విజ్ఞాన కేంద్రమైన మధురలో 1874 వ సం సెప్టెంబరు 11 వ తేదీన జన్మించిరి. వీరి తండ్రి శేషాద్రి అయ్యంగార్ అను సంపన్న గృహస్థుడు. మొదట మధురలోను పిదప రాజధాని కళాశాలలోను చదివి పిమ్మట న్యాయశాస్త్ర మభ్యసించెను.

న్యాయశాస్త్ర మభ్యసించినపిదప తన మామగారును, అఖండప్రజ్ఞాశాలియు నగు శ్రీభాష్య మయ్యంగారి రొద్ద తరిఫీదునొంది 1898 లో న్యాయవాది పట్టాను గ్రహించెను. ఈకాలమున ఆయనకు శుశ్రూషచేసిన మరొక ప్రముఖుడు ప్రసిద్ధ రాజకీయవేత్తయు న్యాయవాదియునైన శ్రీ వి కృష్ణస్వామయ్యరు. శ్రీ అయ్యంగారు వృత్తిలో కాలిడిన అనతికాలములోనే తన మేధాశక్తి వలన, న్యాయశాస్త్రపాండితివలన వృత్తిలో ప్రముఖుడయ్యెను. శ్రీభాష్యమయ్యంగార్, సుందరయ్యర్, కృష్ణస్వామయ్యర్ మున్నగువారు న్యాయవాదరంగమునుండి విరమించగనే వారి స్థానము నాక్రమించెను. ప్రతిముఖ్యదావా యందును కక్షిదారులందొకరు వీరిని తప్పక తమవైపు న్యాయవాదులుగ నియమించుకొనుచుండిరి. 1916 లో నీయనను అడ్వొకేట్- జనరలు పదవి వరించినది. ప్రసిద్ధమైన బిసంటమ్మ కేసులో అర్థున హోమురూలు ఉద్యమము రాజద్రోహకరముగాదని తెల్పుటకు ప్రభుత్వమువారి అనుమతి సంపాదించెను.

న్యాయవాదిగా ఈయన ప్రతిభను గూర్చి సర్ పి యస్ శివస్వామయ్యర్, (స్మారపుష్ప) రాజీప్రధాన న్యాయమూర్తియగు సర్ లియొనల్ లీచిగారు వాక్రొవిన విషయములు ఉల్లేఖింపదగినవి. శివస్వామయ్యరుగారిట్లు వ్రాసియుండిరి

"A man of the m^st acute in'el'ect and great learning he was one of the ablest lawyers in the province He has laid the profession under a great obligation by his new editions of Ma ne's Hindu Law Which he has practicalley rewritten and is probably the most abiding contribution he has made to 'Hindu Law"

1939 వ సం॥ సెప్టెంబరునెలలో ఆయన పటము న్యాయవాదమండిరమునందు ఆవిష్కరించుచు సర్ లయొనల్ లీచ్ ఇట్లు పలికినాడు.

"Mr Srinivasa Ayyangar always put his points quickly without repelation and without divergence from the essentials of the case His mind worked so quickly and his speech kept pace with his brain that a judge had him self to be quick-minded to follow him, but in following him he got the greatest assistance"

రాజకీయ జీవితము

1920 నాటికి భారతదేశ స్వాతంత్రోద్యమము బహుముఖములుగ విజృంభించినది. దానితో ప్రభుత్వమువారి నిర్బంధవిధానము తీవ్రమైనది. దేశమందలి విద్యార్థులు ఉద్రేకపూరితులైరి.

కేవలము న్యాయవాదిగ తనకు గడించిన విజయములతో తృప్తిపడక ప్రజాజీవితమందు గుర్తించి కల్గిన శ్రీనివాసయ్యంగారు తన అడ్వొకేట్ జనరలు పదవికి 1920 ఫిబ్రవరిలో స్వస్తిచెప్పి రాజకీయ రంగమున దూకినాడు. 1920 వ సం॥న తిరునల్వేలిలో జరిగిన చెన్నరాష్ట్ర రాజకీయ మహాసభ కధ్యక్షుడైనాడు. విశ్వవిద్యాలయ నియోజక వర్గమునుండి ఎన్నుకొనబడుటవలన శాసన సభ్యత్వమును CIE బిరుదమును గూడ గాంధి మహాత్ముని ఆదేశానుసారముగ విసర్జించి వైచినాడు. తరువాత స్వరాజ్యపార్టీ నిర్మాణములో చిత్తరంజన్ దాస్, మోతిలాల్ నెహ్రూ మున్నగువారితో చేతులు కల్పినాడు.

ఐతే రాజకీయరంగమున శ్రీనివాసయ్యంగార్ సాధించిన ప్రధాన విజయము కార్పొరేషను మొదలు కేంద్రశాసనసభవరకుగల ప్రజాసంస్థలలో కులతత్వసంస్థయు ప్రభుత్వమువారి ఆదరణపాత్రమును అగు జస్టిస్ పక్షమును పరాజయము నొందించుట.

1926 లో గౌహతి కాంగ్రెసునకు ఆయన అధ్యక్షుడైనాడు. అదే సందర్భమున స్వామి శ్రద్ధానందుని ఢిల్లీలో ఒక మహమ్మదీయుడు హత్యగావించెనను వార్త దేశమును దుఃఖసాగరమున ముంచినది. అధ్యక్షుని ఊరేగింపు మున్నగు ఆడంబరములన్నియు కార్యక్రమమునుండి తొలగింపబడినవి. శ్రీనివాసయ్యంగారు దేశము నెదుర్కొనిన వివిధసమస్యలను సాకల్యముగ చర్చించి తన అభిమానవిషయము అగు హిందూముస్లిం సఖ్యత విషయమై ప్రతినిధుల హెచ్చరించినాడు.

చెన్నపట్టణ ప్రతినిధిగా కేంద్రశాసన సభ్యుడైన ఈయన మోతిలాల్ నెహ్రూ నాయకుడుగాగల పక్షమునకు శాసనసభలో ఉపనాయకుడయ్యెను.

1927 లో డాక్టరు అన్సారిగారి అధ్యక్షతను జరిగిన చెన్నపురి కాంగ్రెసుకు ఈయన ఆహ్వానసంఘాధ్యక్షుడు గాకున్నను నిర్వహణబాధ్యత వహించెను. ఆ సభకై ప్రోగుచేయబడిన నిధినుండియే మిగిలిన మొత్తములో కాంగ్రెసు భవనము నిర్మించిరి. ఆ భవననిర్మాణము పూర్తియగుసరికే ఆయన కాంగ్రెసునుండి విరమించుట వలన ఆ భవనమునకు ఆయన పేరు పెట్టుట సాధ్యము కాకపోయెను.

1928 వ సం॥న పశ్చిమదేశములలో పర్యటనము గించుకొని వచ్చినపిదప సంపూర్ణస్వరాజ్యము కాంగ్రెసు ఆదర్శముగ చేయ యత్నించుచున్న బోసు, జవహర్‌లాల్ నెహ్రూ మున్నగు వారితో చేతులు కల్పినాడు. అది లాహోరు కాంగ్రెసులో కాంగ్రెసువారి ఆదర్శమైనది. లాహోరు కాంగ్రెస్ సమావేశమునకే ఆయనకు గాంధిమహాత్మునితో భేదములు పొడసూపినవి. శ్రీ అయ్యంగార్ వెంటనే తన శాసనసభ్యత్వమును వదలి, రాజకీయరంగముతో సంబంధము పూర్తిగ వదులుకొనెను.

కాంగ్రెస్ అధిష్ఠానవర్గముతో అభిప్రాయభేదములు కల్గినపిదప నేతాజీ సుభాష్‌చంద్రబోసు ఈయనతో అనేకమార్లు సంప్రతించెను. చనిపోవుటకు పూర్వ మీయన—అనేకులాసించినట్లు—రాజకీయరంగమునకు దిగకపోయినను—రాజకీయవిషయములపై తనకు గల భావములను వ్యక్తపరచుచు అనేక బహిరంగ ప్రసంగములు గావించెను. అహింసా సిద్ధాంతమునందలి ప్రమాదము, మతమును రాజకీయములను జోడించుట వలన నష్టములు, పార్లమెంటరీ ప్రజాస్వామ్యమునకు బదులు సర్వపక్షప్రభుత్వము స్థాపింప వలసిన ఆవశ్యకత మున్నగునవి ఆయన రాజకీయ భావములు.

సంఘసంస్కరణాభిలాష

శ్రీమాన్ శ్రీనివాసయ్యంగారు సంఘసంస్కరణమునందును ముఖ్యముగా హరిజనాభ్యుదయమునందును అభిలాషి. చెన్నపురి సంఘసంస్కరణసంఘ నిర్వాహకులందొకడు. అనేకమంది హరిజనులకు ఆర్థికసహాయము చేసెను. అస్పృశ్యతను గూర్చి ఆయన గౌహతి కాంగ్రెసు అధ్యక్షప్రసంగమున నుడివిన పలుకులు గాంధిమహాత్ముడు 'Young India' పత్రికలో ప్రశంసించి యుండెను.

"Judged by any test humanitarian, rational or spiritual, patriotic or democratic we cannot with decency uphold in Hinduism, the dogma of an immutable untouchability It clouds our vision, limits our experience, badens our heart, narrows our sphere of responsibility and prevents our ideals of Justice love and sincerity from being perfect"

పాండిత్య ప్రకర

ఇదివరలో చెప్పబడినట్లు శ్రీమాన్ శ్రీనివాసయ్యంగారు వివిధ విషయములలోను ముఖ్యముగ రాజ్యాంగ శాస్త్రములోను అపార పాండిత్యముగల వ్యక్తి. స్వర్గీయ రైటానరబిల్ వి యస్ శ్రీనివాసశాస్త్రిగారు నుడివినట్లు—


"Endowed with an acu'e brain he stored knowledge of various kinds and had it all at his command some years ago I used to be a visitor at his place and never returned without having my mind stimulated and freshened"

1912—1916 సం॥ల మధ్య ఆయన చెన్నపురి విశ్వవిద్యాలయ సెనేట్ సభ్యుడుగా నున్న కాలములో భారతదేశ చరిత్రకు పాఠ్యవిషయములలో స్థానముండవలయు నని పోరాడెను. రాజకీయ వేత్తలు స్వతంత్రముగ యోచించి నిగ్గుదేలిన భావములు కలిగియుండవలయు నని ఆయన నిశ్చితాభిప్రాయము. శ్రీ అయ్యంగారి రెండు గ్రంథములు చదివినవారికి ఆయనకు రాజ్యాంగ శాస్త్రములోను న్యాయశాస్త్రములోను గల విజ్ఞానము స్పష్టము కాగలదు. అందు మొదటిది మద్రాసు విశ్వవిద్యాలయమువారి యాజమాన్యమున శ్రీనివాసశాస్త్రి ఎండోమెంటు క్రింద "భారతదేశమందలి ప్రజాస్వామ్య సమస్యలు" అను ప్రసంగవ్యాసము. రెండవది బర్కెన్ హెడ్ ప్రభువు సవాలుగా ఆయన తయారుచేసిన స్వరాజ్యరాజ్యాంగచట్టము. సుమారు రెండు దశాబ్దముల క్రిందట ఆయన స్వరాజ్య రాజ్యాంగ చట్టపు ఉపోద్ఘాతములో భాషాప్రయుక్త రాష్ట్రములనుగూర్చి ఆయన వ్రాసిన పలుకులు ఈనాడును యథార్థములే. ఆయన ఖర్చు తగ్గుటకు ప్రజాస్వామ్యము వర్ధిల్లుటకు రాష్ట్రముల పునర్విభాగము (rearrengemeut of provinees) కావలెనని ఉద్ఘాటించుచు నిట్లు పలికినాడు:—

"On the whole, the linguistic basis is the safest for the proper functioning of Indian democracies and for the minimising of inter communal friction It is the natural solvent of religious and communal differences and is amongst the most powerful of unifying agencies It is by far the best foundation of India's Swarajya" (P XXVII—XXVIII)

శ్రీమాన్ శ్రీనివాసయ్యంగారు 1941 వ సంవత్సరము మే నెలలో పరమపదించిరి. శ్రీనివాసయ్యంగార్ జస్టిస్ పక్షమునకు సింహస్వప్నముగ నుండెనో ఆ పక్షనాయకులలో నొకరగు శ్రీ కూర్మా వేంకటరెడ్డిగారు ఈయనను 'ఎంతమాత్రము కులతత్వభావము లేని వ్యక్తి' యని ప్రశంసించిరి. ప్రతికక్షుల మన్ననను గూడ బడసిన శ్రీ అయ్యంగార్ ధన్యుడు కదా?

సాహిత్యవిమర్శ:



నన్నిచోడ మహాకవి కవితా శిల్పము

శ్రీ తిమ్మావజ్ఝల కోదండరామయ్య

"ప్రతిభా వ్యుత్పత్తులలో ప్రతిభ గరీయసి" (విశ్వనాథ సత్యనారాయణగారు) తొలిది దైవదత్తము, జన్మాంతర సుకృత లభ్యము. మలిది నిరంతరకృషి సాధ్యము. ప్రతిభ చాలనివాడు వ్యుత్పన్నుడయ్యు ప్రకాశింపజాలడు. ప్రతిభావంతుడు వ్యుత్పన్నత కొఱవడినను ప్రకాశించును కవి, శిల్పి కివి రెండును రెండు కన్నులు!

శిల్పము - కవిత - ఇవి రెండును రెండు విశిష్ట కళలు! ఒకటి దృగ్గోచరము, మఱొకటి మనోగోచరము తొలిది భౌతికోపదార్థ నిర్మితి మలిది వాఙ్నిర్మితి ఒకటి లౌకిక రసానుభూతిని సాధించును. మఱొకటి యలౌకిక రసానుభూతిని దన్మయుల జేయును. కాగా, శిల్పకారునకును, కవీశ్వరునకును ప్రతిభావ్యుత్పత్తులు రెండును సమానములే. పర్యవసానము కవిత యొక శిల్పము. శిల్పమొక కవిత.

నన్నిచోడ మహాకవి కవితను ఉత్తమశిల్పముగా బోల్చినాడు ఈ పద్యము జూడుడు

పరగు సువర్ణబంధ మృదు
　భావవిశేషములోన జూచినన్
బొరపగు చిత్రరూపమును
　బోలె సుసత్కవికావ్య మిమ్మహిన్
బరగు సువర్ణబంధ మృదు
　భావవిశేషము లోన వెల్వలన్
సరియగు రత్నపుత్రికయు
　సత్కవి కావ్యము నొక్కరూపమై

(నన్ని - కుమా - అవతారిక)

సమర్థుడగు శిల్పకారుని యమృతహస్తమున కఠినశిలలు కూడ వెన్నవలె గరగి దివ్యరూపముల దాల్చినట్లు ప్రతిభాశాలియగు కవీశ్వరుని చేతిలో భావముల పొంబడి బడి పలుకులు మలకలు దిరిగి హృద్యపద్యరూపముల దాల్చును.

'అల్పాక్షరముల ననల్పార్థ రచన
కల్పించుటయకాదె కవి వివేకంబు'

అని పాలకుఱికి సోమనాథుడు వేలిభావము లకు నక్షరరూపముల గల్పించుటయే కవి వివేకమని పేర్కొనినాడు. ఇట్టి శిల్పరచనమునకు తొడగినవారు హేమాహేమీలు - అనేకులు. అందు నన్నిచోడ మహాకవి యీ శిల్పరచనములో నెట్లు కృతార్థుడయ్యెనో చూతము

సప్తమహర్షులు పార్వతిని జూచి వచ్చి 'యపర్ణారూపవర్ణ నాకర్ణనదత్తకర్ణుం'డైన పరమేశ్వరునితో నామె సౌందర్యాదికమును బ్రస్తుతించు పద్యమిది

"హరి నీలోపమ మధ్యకేశి శశి బిం
　బాస్యోష్ఠ రాజీవ కే
సర నేత్రామల గంధి విద్రుమలతా
　సద్వర్ణ తన్వంగి సిం
ధుర కుంభాలసయాన పూర్ణకుచ సం
　స్తుత్యారుణాబ్జాంఘ్రి కం
ధర శైలాత్మజ జెప్పనొప్పగు సుధా
　ధామార్ధ చూడామణీ!"

(నన్ని-కుమా-అష్టమాశ్వాసము 5)

ఇందు పార్వతి ప్రత్యంగవర్ణనము ప్రత్యేక ప్రత్యేకముగా నుపమానాత్మకముగా జేయబడినది. పార్వతి-హరిమధ్య, నీలకేశి, చంద్రాస్య, బింబోష్ఠ, రాజీవనేత్ర, కేసరగంధి, విద్రుమవర్ణ, లతాతన్వంగి-సింధురాలసయాన, కుంభపూర్ణకుచ, అరుణాంఘ్రి, అబ్జకంధర—యిట్లు.

ఇదియిట్లు సులభగ్రాహ్యముగా పైకి గోచరించుచున్నను కవి యిందొక వింతశిల్పము కూర్చినాడు ప్రత్యంగవర్ణనాత్మకమైన యొక్కొక్క సమాసపదముననుఉపమానపదములు రెండును కలిసి యొకటే సమాసపదముగా, నొకటే యుపమాన వాచకముగా గోచరించునట్లు,పాఠకులట్లే భ్రాంతి చెంది తికమకలు పడునట్లు వింతకూర్పు కూర్చినాడు. ఉపమాన వాచకముల జంటల నివి చూడుడు. హరినీల, శశిబింబ, రాజీవకేసర, విద్రుమలత, సింధురకుంభ, అరుణాబ్జ-ఇవి ప్రత్యేక సమాసపదములై, యొకటే యుపమానముగా సామాన్యదృష్టికి గోచరించును కాని జాగ్రత్తగా జూచిన నివి రెండేసి యుపమానపదములు గల ఏకోపమానార్థకబోధకములగు సమాసపదములని తెలియును. ఇవి రెండు ఉపమానములని తెలియక యేకోపమానపదమని భ్రమజెందిన పద్యార్థము కుదురదు పద్యము కడపట నీశ్వరసంబుద్ధిగానున్న 'సుధాధామార్థ చూడామణీ' యనునది సాభిప్రాయమై 'పై సమాసపదము ఏకోపమానబోధకము కాదు సుమా! అట్లు తలచిన నర్థము కుదురదు ఆ సమాసపదమును సగమునకు విఱిచి చూడుము. ఇపుడవి రెండుపమానములై యర్థమునకు బొందుపాటు కలిగించును' అని తెలుపుచున్నది

రావిపాటి త్రిపురాంతకుని 'త్రిపురాంతకోదాహరణము' లోని యీ పద్యమును జూడుడు

పాముస హారముల్ వెలయు
　బాపట నేసయు నేఱు మల్లికా
దామమతోలు దువ్వలువ
　దట్టపుభూతియు జందనంబు మై
పూసిన జాలనందముగ
　సన్నిధి సేసిన జాడ గంటి నే
నామదిలో గుమారగిరి
　నాథుని శైలసుతాసనాథునిన్.

ఇచట 'శైలసుతాసనాథు'డనుటచే నీశ్వరుని యర్ధనారీశ్వరత్వము ధ్వనితమై యిందలి పరమేశ్వరవర్ణనము కనులకు గట్టినట్లు గోచరించును

పార్వతి ప్రత్యంగవర్ణనసందర్భము నందలిదే మఱొక పద్యమిది చూడుడు

అలికేశి లక్తకాదలపాదతలములు
　నమృతాంశు ముఖశుక్తి కాంఘ్రియుగము
గంబుకంధర వ్రీహి గర్భాభజంఘలు
　బిసహస్త రంభోరు లసితరుచియు
బూర్ణకుంభస్తన పులిననితంబంబు
　హరిమధ్య వేది మధ్యాభినుతియు
కుంభికుంభనితంబ కోకస్తనంబులు
　కరభోరు మృదులతా కరయుగంబు
గామ శరధి జాను క్రముకకంఠంబును
గమఠ పాద వికచకమల ముఖము
బల్లవాంఘ్రితల సుబర్హిణాలకములు
నజునకైన బొగడ నరిది కాదె.

(నన్ని - కుమా-అష్టమాశ్వాసము 18)

'దేవతానాం పాదాంగుష్ఠ ప్రభృతి వర్ణ్యతే, మానుషాణాం కేశా దారభ్య' అని—

దేవతావర్ణనము పాదాదికేశపర్యంతము చేయవలెనను సంప్రదాయానుసార మిందు వరుసగా పార్వతి పాదతలములు, అంఘ్రియుగము, జంఘలు, ఊరువులు, నితంబము, మధ్యము, స్తనములు, కరయుగము, కంఠము, ముఖము, అలకములు నని దిగువనుండి మీదికి పార్వతి ప్రత్యంగవర్ణనము ఆరోహణక్రమమున గావింపబడినది ఇందొక్కొక్క యవయవమును వర్ణించుచో నొక్కొక్కచోటను బ్రయోగింపబడిన దేవీవాచక పదము లివి అలికేశి, అమృతాంశుముఖ, కంబుకంధర, బిసహస్త, పూర్ణకుంభస్తన, హరిమధ్య, కుంభికుంభనితంబ, కరభోరు, కామశరధిజాను, కమఠపాద, పల్లవాంఘ్రితల - యవరోహణ క్రమమున నుండుటను మనము గుఱుతింపగలము ఈ పద్యములో నింత వింతశిల్పము నద్భుతముగా చిత్రించి పార్వతి సౌందర్యప్రశంసావ్యాజమున 'అజునకైన బొగడ నరిదిగాదె' యని తన పద్యశిల్పమును దానే ప్రశంసించుకొనినాడు.

ఈ యారోహణావరోహణ వర్ణనా సూచనము ఈ పద్యము తరువాతి వచనములో నిట్లు కలదు

'అని యనేక ప్రకారంబుల నగజరూపవిభ్రమ సౌందర్య విలాసంబును నారోహిణ్యవరోహిణుల వర్ణించుచున్న సప్తర్షి మహర్షుల వచనంబులతనుపంచబాణంబులై నట్లిందు,రు డెందంబు భేదించిన'

ఆ సందర్భమునందలిదే యింకొక పద్యమిది చూడుడు

క్రొవ్విరు లెసగి పూగొలల మోపోపక
　నసకంపు లేదీగె నెవులునట్లు
వీగాగు చనుగవ వ్రేగున గాదీగ
　వడుపసి వాసులు వాడుచుండు
విలసిల్లు నిండారు వెన్నెలలో గారు
　చిఱురు దీగెలు వెలుగునట్లు
తెలిమోముపై బర్వ తోలకాడు చాయలో
　మెలరారు కనుగవ మెఱుగు లడరు
దావి పొంపిరి వోవు నెత్తమ్మివలన
పలుము కంపారి తెమ్మెరల్ విచునట్లు
కమ్మవాతెఱవాసన గలసి కలయ
నోడుముట్టుచు నూర్పులు నుడియుచుండు.

ఈ పద్యములో నొకపాద ముపమానముగను, తరువాతి పాద ముపమేయముగను పద్యమందంతట నందుట గోచరింపగలదు సీసపద్యరచనములో నిది యొక పద్ధతి శిల్పము! బేసి పాదము లుపమానములు, సరిపాదము లుపమేయములు—

"ప్రియాగమన వేళాయాం
మదనావేశ సంభ్రమాత్
విభ్రమో గంధహారాది
భూషాస్థానవిపర్యయః"

అని పూర్వలక్షణము లక్షణ గ్రంథములలో జేర్కొనబడినది ఈ 'విభ్రము'ను కవులు కేవలము వెఱ్ఱిగా వర్ణించినారు పారిజాతాపహరణములోని ఈ పద్యమును జూడుడు

సుదతి యొకతె పరాకున
బదాంగదము కంకణముగ బాణి దొడిగి న
య్యదువల్లభు గనుగొనుచుం
దుదినదియును యేనవొంగి తుత్తునురయ్యెన్.

(పారి-తృతీయాశ్వాసము—18)

అందఱు కవులవలెనే నన్నిచోడుడును ఈ 'విభ్రమము'ను వర్ణించినాడు పరమేశ్వరుడు హిమవంతుని నగరమున కరుదెంచినప్పుడు పురకాంతలతని జూపబోవుచు బొందిన విభ్రమ వర్ణనమిది ఆ వర్ణనములో నొక ప్రత్యేకత కలదు ఈ పద్యము జూడుడు

కలిమిడి నలికంబు చెలువంగబోవుచ
　తెలుపార నైనింప నలదికొనుచు
బూవులు గుఱుమంగ బోవుచ వలగొంత
　దోపంగ ముందల దుఱిమికొనుచు
మోవి లత్తుక పూయబోవుచ లాలాట
　పట్టిక దిలకంబు బెట్టుకొనుచు
గాటుక మొఱుచుచ కన్నుల నిడబోయి
　పాలుక గళమున బూసికొనుచు
సితరుచీందుఖండశిఖనేత్ర గరళంబు
లొడల జడల నదుట మెడను దాల్చి
పొల్చుశంభు నొర్త్రి పోలి చూపఱు దన
కెఱుకచుంచె వచ్చె నీసుజూడ

(నన్ని-కుమా-అష్టమా—66)

ఈశ్వరుని జూడవచ్చుచు నొకకాంత భూతిని ముఖమున దాల్చుట మఱచి యొడలెల్ల బూసికొనినది. కొప్పున బూవులు ముడువ మఱచి సుందల వలదిక్కున గొంత జెకివికొనినది మోవికి లత్తుక పూయమఱచి లలాటములో తిలకముగా బెట్టుకొనినది. కన్నుల గాటుక నిడబోయి మఱచి గళమున బూసికొనినది. ఇట్టి భూషణాదివిపర్యయము ఆమెకు మేలే చేసినది! ఆ విపర్యయమును నామెకును దెలియకయే యొక ప్రత్యేకతను గోచరింపజేసినది అందుచే నామె 'సితరుచీందు ఖండశిఖనేత్ర గరళంబు, లొడల జడల నదుట మెడను దాల్చి పొల్చు శంభు'ని పోలియుకడెను ఆమెను జూచి నిజముయిన యీశ్వరుడే యేమో యని చూపఱు లాశ్చర్య సాష్టాంగపడుచుండిరి అట్లుగదా యదృష్టముండవలయును! ఆ యదృష్ట మామెకు నన్నిచోడని ప్రసాదము!

సాయంసంధ్యానంతరము నక్షత్రోదయ వర్ణన పద్య మిది, చూడుడు

సరసిజహితుడట చన దరతర మ
త్సరుణరుచిన్ మెఱుగడరుదు వడినం
బరమున నడుతతి ప్రవిమల మయ్యెన్
నిరుపమ 'మణిగణనికర' విభాతిన్

ఇందలి తొలిమూడుపాదములతో నక్షత్రోదయ వర్ణనము పూర్తియయినది నాలుగవ పాదమున నానక్షత్రములను మణిసమూహములతో నుపమించుచు బద్యము ముగింపబడినది ఇందొక విశేషము ఈపద్యము 'మణిగణనికరము'! మణిగణనికరమును 'మణిగణనికరము'లోనే పేర్కొనుచు నాపద్యనామము నట్లే యా పద్యమున నిబంధించుటలో నన్నిచోడనికి ప్రత్యేక ప్రయత్నమున్నటుల గోచరింపక మానదు 'మణిగణనికర' మను పదమును మాని తత్సమానార్థక మయిన వేఱొకపదముతో పద్యము పూర్తిచేయవచ్చును, కాని యది నన్నిచోడని కిష్టము కాదు విశిష్ట శిల్పనిర్మాణమునైపుణకే ప్రతిభావంతుని ప్రజ్ఞ మొగ్గుచూపుచుండును!

మఱొకపద్యమిది చూడుడు—

అహరాద్రి పరలకను
　లహర్షి పెసగ గేసం
దోహమునకు పీరలక్ష్మి
　తోడ గొండెబు
సాహసూపమెసగె మునిజ
　నాశయమ్ముల 'నత్యహో
త్సాహ' మయ్యె 'నకుమార
　సంభవంబు'నందొగిన్

(నన్ని-కుమా-దశమాశ్వాసము-415)

ఇందు కుమార సంభవానంతరము మునిజనోత్సాహము 'మత్సాహ' వృత్తములో నభివర్ణింపబడినది గ్రంథనామము 'కుమార సంభవము' కూడ నిందు పొందుపఱుపబడి యుండుట మఱియు నొక విశేషము! రెండవ పాదము ముద్రణమున గ్రంథాంగము కొన వచ్చుచున్నది—

ఇట్టిదే ప్రథమాశ్వాసములో మఱొక పద్య మిది చూడుడు.

హృదయాహ్లాదముతోడ బాయక సదా
　నైక ప్రకారంబులన్
మదనాసక్తి జెనంగుచున్న విలస
　'న్మత్తేభవిక్రీడితం'
బది దాక్షాయణి సూచికౌతుకరతై
　కాలీనభావాఖిలా
పదృగత్యుజ్జ్వల దీధితుల్ పఱపె నీ
　శానాననాబ్జంబుపైన్.

(నన్ని-కుమా-ప్రథమాశ్వాసము. 101)

ఇందు మత్తేభవిక్రీడితమును వర్ణించుచు తద్వర్ణనమును 'మత్తేభవిక్రీడితము' లోనే గావించుటలో కవి సప్రయత్నుడని స్పష్టమగుచుండుట లేదా!

మహాకవులు సూర్య చంద్రోదయాది వర్ణనములను తత్తత్కథా వస్తు సందర్భ సముచితములుగాను అందుచే ఔచితీవిలసితములుగాను గావించుట కలదు నన్నిచోడుడును కథావస్తువునకు

(18 వ పేజీ చూడుడు)

అన్నపూర్ణాదేవి పూజామందిరంలోంచి చిరు గంట మ్రోగేసరికి విశాలాక్షీ, సాంబశివ మూర్తీ పూజామందిరంలోనికి వచ్చారు.

సపర్యల్ని పూర్తిచేసి గౌరీశంకరులకు హారతి యిచ్చి, అత్తమామలకుకూడా యిచ్చి తనూ పుచ్చుకుంది భగవన్నివేతమైన ప్రసాదాన్నీ, పూజాపుష్పాల్నీ వృద్ధదంపతుల కిచ్చి తనూ స్వీకరించింది.

విశాలాక్షీ, సాంబశివమూర్తీ వెళ్లిపోయారు.

గౌరీశంకరుల పాదాలదగ్గర ఫాలాన్ని మోపి, స్థాణువై కన్నీళ్లు కాల్వలు కట్టేటట్టు ఏడ్వ సాగింది.

ఇది ఆమె దినచర్యలో ఒక భాగం. శ్రావణ వర్షమేఘం వంటి ఆమె హృదయంలో ఎంత కన్నీరుందో మరి!

'ఎంత కని అలా ఏడుస్తావు తల్లీ! లే! మీవల్ల సుఖపడవలసిన యీ రోజుల్లో విచార భారాన్ని నెత్తిని వేశాడు భగవంతుడు దుర దృష్టవంతులం పాపి చిరాయుః అని యింకా ఎన్నాళ్లు నీ కష్టాల్ని చూడవలసిఉంటుందో' అని అత్తమామ లంటూండడం, అన్నపూర్ణ కాస్త శాంతిపడటంకూడా దైనికచర్యలే.

'వంశమర్యాదల్ని నాశనం చెయ్యడానికి పుట్టాడు పిల్లలని ఎంత ముచ్చటపడ్డామో అంత ఆనందం అయింది వీడెదో ఉద్ధరిస్తాడను కున్నాం గాని మమ్మల్ని రచ్చలోనికీడ్చి తల ఎత్తుకు తిరగకుండా చేస్తాడని ఎప్పుడూ వూహించుకోలేదు. దుర్మార్గుడు! దుర్మార్గుడు' అని సాంబశివమూర్తి అంటున్నప్పుడల్లా 'క్షమించండి మామగారూ! వారి నననెం ఎందుకు? యిదంతా నా అభాగ్యం. యీ కష్టాలన్నింటికీ నేనే కారణం' అంటూ ఏడుస్తుంది.

* * *

అన్నపూర్ణాదేవీ, విశ్వనాథం, ఏనాడూ గట్టిగా మాట్లాడుకునైనా ఎరగరు. వారిది ఆదర్శమైన దాంపత్యంగా ఉండేది. భార్యా భర్త లిద్దరూకూడా కోటీశ్వరుల బిడ్డలే అవటం చేత జీవితావసారాల్లో ఏవిధమైన లోటూ లేదు. అందుచేత విశ్వనాథానికి అకస్మాత్తుగా భార్యపై అయిష్టత కలగడానికి ఏవిధమైన కారణం కనుపించదు. అలా అని భార్య కురూపీ కాదు. దీర్ఘరోగి కాదు. సుభావంగా కొన్నాళ్ళు గడిపి ఒకనాటిరాత్రి యిల్లు విడిచి వెళ్లిపోయాడు.

ఈ విషయం తెలిసేసరికి ఊళ్లో సంచలనం కలుగకపోలేదు. కాని అన్నపూర్ణాదేవీ, విశ్వనాథాల్లో ఎవరిది తప్పో తెలుసుకోలేక పోతు న్నారు.

కడుపులో పుండు పుట్టడం వల్ల కొద్ది రోజుల క్రిందటే పెద్ద ఆపరేషన్ చేయించుకుంది అన్నపూర్ణాదేవి ఆమెకింకా పూర్తి ఆరోగ్యం చేకూరనే లేదు అటువంటి సమయంలో యీ సంఘటన జరిగేసరికి ఆమెకి మనోవ్యాధి రావ టంలో ఆశ్చర్యం ఏముంది!

భర్త అవిధంగా చేయడానికి ఏం కారణమై ఉంటుందా అని ఎన్నో విధాల ఆమె వితర్కించుకుంది దాని ఆమెకి ఏ కారణం కనుపించలేదు.

ఆ మనోవ్యాధితో ఆమెభక్తి ఉద్రిక్తమైంది అనారోగ్యాన్నైనా లెక్కచెయ్యకుండా స్నానం, ధ్యానం, పూజా, పురస్కారం వీటిలోనే నిమగ్నమయింది

'నామనస్సు బాగులేక పోవడంనుంచి, శాంతిని అన్వేషిద్దామని బయలుదేరాను మీకు తెలియకుండా బయలుదేరినందుకు క్షమించాలి. నేను తిరిగి ఎప్పుడు వచ్చేదీ నిశ్చయంగా చెప్ప లేను తెచ్చుకున్న డబ్బు అయిపోయింది. వెంటనే అయిదువందలరూపాయలు పంపగలం దులకు ప్రార్థిస్తున్నాను'

కాశీనుంచి కొడుకు వ్రాసినపై ఉత్తరం చదివేసరి సాంబశివమూర్తికి కొడుకు క్షేమంగా ఉన్నందుకు సంతోషమూ, యీ విధంగా మారినందుకు విచారలో కలిగాయి. భార్యకీ, కోడలుకీ చెప్పాడు యీ విషయం

'వెంటనే రమ్మని వ్రాయండి అక్కడేం యిబ్బందులు పడుతున్నాడో! వేళపట్టున తిండా, తిప్పా; కాలు నొచ్చినా చెయ్యి నొచ్చినా చూశేవారెవరు? వెంటనే రమ్మని వ్రాయండి. డబ్బుమాత్రం పంపకండి అది అయిపోయేదాకా రాడు'—అంది విశాలాక్షి

కథానిక.

అన్నపూర్ణ

'పూ. భా.'

అన్నపూర్ణకి ఏ మనాలోకూడా పాలు పోలేదు. ఆమె కళ్లంట మాత్రం నీళ్లు తిరుగు తున్నాయి చరచరావెళ్లి కలం కాయితం మాత్రం తెచ్చి మామగారి కిచ్చింది

భార్య చెప్పినప్రకారమే ఉత్తరం వ్రాసి. కాశీనుంచి యింటికి రావడానికి సరిపోయే ఖర్చుల్ని మాత్రమే పంపించాడు సాంబశివమూర్తి

భర్తని క్షేమం యింటికి రప్పించు తండ్రీ అని అన్నపూర్ణ అవిరళధ్యానంలో మునిగింది

ఎప్పుడొస్తాడా అని తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు.

'మీ కుమారుడు వారణాసీ పురవీధుల్లో భిక్షుకుడు కాకుండా ఉండాలంటే నేను కోరిన ప్రకారం డబ్బు పంపిస్తారు' అని వ్రాసిన కొడుకు ఉత్తరానికి సాంబశివమూర్తికి విచారాన్ని మించిన కోపం వచ్చింది కొడుక్కి పిచ్చిగాని ఎత్తిందా అని అనుమానం కలిగింది. వంశమర్యాదలు వీధులంట పరుగెడుతున్నందుకు చాలా విచారించాడు.

'చెప్పలేను'

'ఏ కారణంలేకుండా యిలాంటి పనిచేస్తే పిచ్చి ఎక్కి ఉండాలి.'

'మీ రేమన్నా వంటాను'

'ఇంత గాని ఎన్నడూ అనలేదు.'

'అది ఉన్నన్నాళ్లు నేను రాలేను'

'కారణం'

'. . .'

'దానిలో ఘనమైన లోపం ఉంది, లేక ఫలానా తప్పుచేసింది అని నిరూపించు'

'. . .'

'దాన్ని నిరూపించ నక్కరలేదు చెప్పు, అది ఏం తప్పు చేసిందో'


'అదేం తప్పు చెయ్యలేదు'

'మరి'

'. . .'

'అన్యాయంగా, అకారణంగా మమ్మల్నీ, దానినీ ఎందుకిలా ఏడిపించడం?'

'అది నా కింక భార్యగా పనికిరాదు.'



కాశీ విశ్వవిద్యాలయ ప్రత్యేక స్నాతకోత్సవంలో గవర్నర్ జనరల్ శ్రీ సి రాజగోపాలాచారి గారు ఉపన్యసిస్తున్నారు. డిసెంబరు 2న జరిగిన ఈ ఉత్సవంలో రాజగోపాలాచారి గారికి విశ్వ కళా పరిషత్తువారు "డాక్టర్ ఆఫ్ లాస్" (గౌరవపట్టము) ను ప్రసాదించిరి.

'మీరు వెళ్లి తీసుకురండి' అని భార్య చెప్పిన సలహా ననుసరించి కాశీకి బయలుదేరాడు సాంబ శివమూర్తి.

* * *

'వాళ్ల యింటిదగ్గర జరక్కూడదు మన యింటికి, మనకి యిష్టంలేం సాంప్రదాయం మన యింటిదగ్గర ఉండడం మర్యాద పోనీ నువ్వే ఆలోచించు, దానికి దాని పుట్టింట ఏవిధమైన లోపం ఉందా? మన యింటికి ఎందుకు వస్తుంది చెప్పు? డబ్బుకోసమా? మర్యాద కోసమా? పెండ్లైనా, పెద్దమనిషైన స్త్రీ పుట్టింట ఉండడం మర్యాదా కాదు అలాగే ఉంటే పుట్టింటివారింటికీ, అత్తింటివారింటికీ ఎంత అగౌరవమో ఆలోచించు పోనీ అది చేసిన తప్పు ఏమైనా ఉంటే చెప్పు అంతే కాని అకారణంగా, నీవు చేసిన యీ పనిని నేనే కాదు, ఎవరూ హర్షించరు. లే, పద'

'. . . . .'

'ప్రాణముండగా ఏదో వనే అనుకుంటున్నాను కాని యీ విధంగా మారుతావని ఎన్నడూ కలలోనైనా ఊహించుకోలేదు.'

'క్షమించండి నాన్నగారు! తిరిగి అక్కడకు వచ్చేందుకు నామనస్సు యిష్టపడకుండా ఉంది!'

'ఇన్నాళ్లూ ఉన్న యిష్టం యిప్పుడెక్కడ వారి మారిపోవడానికి కారణం'

'ఊహాగానం చేస్తున్నావా, లేక ఎవరైనా చెప్పారా?'

'చెప్పారు'

'ఎవడా మూర్ఖుడు?'

'డాక్టరు'

'ఏ డాక్టరు?'

'దానికి ఆపరేషన్ చేసిన డాక్టరు.'

'ఏమని చెప్పాడు'

'ఆమె భర్తకి పనికిరా దని చెప్పాడు'

'మరి ఆ సంగతి అక్కడ మాతో ఎందుకు చెప్పలేదు?'

'చెప్పి ఏం ప్రయోజనం?'

'చెప్పితే యీ పాటికి మరో భార్యతో కాపురంచేస్తూండే వాడివి'

'అది ఉంటూండగానే.'

'ఆ! అందులో తప్పేముంది? హిందూధర్మ శాస్త్రప్రకారం బహుభార్యాత్వం నిషేధం కాదే. తన అంగబలాన్నీ, అర్థబలాన్నీ చూసు కుని ఎన్ని వివాహాలైనా చేసుకోవచ్చు పురుషుడు.'

'ఆమెకి అన్యాయం.. '

'నువ్వు అన్యాయం చెయ్యడమేంటి. ఆమెకి భగవంతుడే చేశాడు కాకపోయినా నువ్వు యీవిధంగా దేశాలుపట్టడం న్యాయంగాఉందా ఏమి?'

'. . . . .'

'పిచ్చిపిచ్చి ఆలోచనలు మాని బయలుదేరు.'

రైలు కదులుతోంది అంత రభా తనతో ఉన్న కొడుకు మాయమయేసరికి సాంబశివ మూర్తి గాభరా పడ్డాడు దిగిపోదా మను కున్నాడు. కాని బండి నడుస్తోంది. కొడుకు చేసిన మోసాన్ని దూషించుకుంటూ, అస్థిమిత మైన మనస్సుతో ఒక మూల కూలబడ్డాడు

సాంబశివమూర్తి యింటికి చేరిన మర్నాడే విశ్వనాథందగ్గరనుంచి ఉత్తరం వచ్చింది. తన భార్య బ్రతికిఉన్నన్నాళ్లూ తాను యింటికి రానని వ్రాశాడు. విశాలాక్షి, సాంబశివమూర్తీ చాలా దుఃఖపడ్డారు

ఆవిషయం అన్నపూర్ణకి తెలియనియ్యలేదు.

* * * *

తెలివైనవాడు ఒక తప్పుపని చేసిన తరువాత దానివిషయమై ఆవేదన పొందకపోడు. మనో ధైర్యాన్ని కోల్పోతూన్న విశ్వనాథం పిచ్చి వాడల్లే గయా, ప్రయాగా, హృషీకేశం, బదరి నారాయణం మొదలైన పుణ్యక్షేత్రాలు తిరి గాడు మహాపురుషుల్ని సందర్శించాడు. యీ విధంగా ఒక సంవత్సరం ఆధ్యాత్మిక వాతావరణంలో తిరిగేసరికి అతనిలో ఎంతో మార్పు వచ్చింది జీవితాన్ని కొన్ని నియమాల మీద నడిపించడం అలవాటు చేసుకున్నాడు ఒంటరిగా కూర్చుని తను చేసిన అపరాధాల్ని తలుచుకుని ఏడ్చేవాడు. ఈ పరిస్థితుల్లో తన భార్యకు చేసిన అపచారం జ్ఞాపకం వచ్చింది. తనవల్ల ఆమె ఎంతబాధ పడుతోందో అను కున్నాడు ఆమెదగ్గరకు వెళ్లి క్షమాపణ వేడు కుందా మనుకున్నాడు; కాని ఆత్మగౌరవం అనేది అతనిలో పూర్తిగా నశించకపోవడంవల్ల ధైర్యంగా యింటికి బయలుదేరలేకపోయాడు

మనోవ్యాధితో మంచంపట్టి కుమిలి కృశించి పోతూన్న అన్నపూర్ణకి విశ్వనాథం వ్రాసిన ఉత్తరం దొరికితే చదువుకుంది. 'నేను చనిపోతే గాని వారు తిరిగి రారట. అలాంటప్పుడు నేను బ్రతికిఉండడం ఎందుకు? నేం తీసుకుపో భగ వంతుడా! ఎలాగైనా వారు తిరిగివచ్చి తల్లి దండ్రులకైనా కొంత ఆనందాన్ని యిస్తారు! అనుకుని ఎంతో ఏడ్చింది. ఆ ఏడుపుతో తెలివి తప్పి పడిపోయింది.

వ్యాధివల్ల తెములుకోలేక రోజురోజూ క్షీణించిపోతూ మరణశయ్యమీద ఉంది అన్నపూర్ణ. డాక్టర్లు పెదవులు విరచారు. ఆమె మరణ యాతన పడుతోంది.

అలాంటి విషాదపరిస్థితిలో విశ్వనాథం ఆతృతగా వచ్చాడు. పరిస్థితిని గమనించేసరికి అతని ముఖంలో ఆందోళన తుపానువలె చెలరేగింది.


'అన్నపూర్ణా! అన్నపూర్ణా!' అని వెర్రి పిలుపు పిలచి, ఆమె ప్రక్కని కూర్చుని ఆమె తలను తన తొడమీద పెట్టుకున్నాడు.

మరణాయాసంతో కొద్దిగా కళ్లు విప్పి భర్త ముఖం చూసింది


ఆమె కళ్లంట నీళ్లు గిరగిరా తిరిగాయి.

ఆయాసంలో ఏమీ చెప్పలేకపోయింది.

నీళ్లు తిరుగుతూన్న కళ్లు మూతలు పడి పోయాయి.



ఫాస్‌బగ్గర్‌ద్ద విమానాలసరుకులను పడవలలో కెక్కిస్తున్నారు.




బెర్లిన్‌కు సరఫ

బెర్లిన్‌కు విమానాలద్వారా



← విమానాల ద్వారా వచ్చిన బొగ్గు రేవును తీసుకొంటున్న జర్మను వనిత.






రైన్ కేసుద్ద విమానాలలోకి యంత్రాలద్వారా సామానుల సప్లయి.


,ఆహుకు అండ తెస్తున్న విమానాలను బెర్లిన్ వాసులు ఆశతో తిలకిస్తున్నారు




బెర్లిను, టెంపెల్హాఫ్ విమానాశ్రయంలో చేర్చి ట్రక్కులపై నిలిపిన సామానుపీపాలు.








ా వాయు మార్గాలు




బెర్లిన్, టెంపిల్ హోఫ్ విమానాశ్రయంలో అమెరికన్ విమానాల శ్రేణి సరకులు దిగుమతిచేస్తున్నవి


జీవితావసరాల సరఫరా



ఫ్రాంక్‌ఫర్ట్ క్రమ సిద్ధంగా మాను ట్రక్కులు విమానాలకై బారులు దీరి న్నాయి. ఇక్కడ నుంచి విమానాలు బెంపిన్హాఫ్‌కు సరకులు తీసుకుపోతాయి.




విమానాలలో పిండి బస్తాల దిగుమతి




అమెరికానుంచి బెర్లిన్‌కు, ఒక్కొక్కసారి 20 టన్నుల పిండి చేరవేస్తున్న గ్లోబ్‌మాస్టరు విమానము

బెర్లిన్ విమానాలలో కెక్కిస్తున్న పిండి బస్తాలు.





గ్లోబ్‌మాస్టరు విమానంచిగ్యాలను లోపిస్తున్న జర్మన్ శిశువులు.





ఆనీ - రూనీ

శ్రీ బి. జగ్గారావు

అమెరికాలో ఆనీ రూనీ అనే యిద్దరు స్నేహితు లుండేవారు. ఆనీ ఒకనాడు 45 డాలర్లు లాటరీలో సంపాదించాడు. ఈ విషయాన్ని రూనీతో చెపితే "సరే! మనము మూడు రోజుల ప్రయాణంలో నున్న గ్రామంలో వ్యాపారం చేసి లాభాలు గడిద్దాం" అన్నాడు. "ఇంతకు రానూపోనూ తిరగటానికీ కారు ఒకటి ఉండాలి. కాబట్టి కారు కొందాం పద" అన్నాడు ఆనీ.

ఇద్దరూ "కార్సు ఫర్ సేల్"ను చేరుకొన్నారు. చాలా కార్లున్నాయి. ఆందులో రెండే రెండు కార్లు నచ్చాయి. ఒకదాని ఖరీదు 45 డాలర్లు. రెండవదాని ఖరీదు 15 డాలర్లు. ఆనీ "15 డాలర్ల కారు కొందాం. తక్కిన డబ్బు మిగుల్చుదాం" అన్నాడు. రూనీ "45 డాలర్ల కారే మంచిది. గ్యారంటీగల కారు. కాబట్టి ఈ కారే కొందాం" అన్నాడు. వెంటనే ఆనీ "మంచికి గ్యారంటీతో పనిలేదు. చెడ్డదానికి గ్యారంటీ చెప్పకపోతే చెల్లదని గ్యారంటీ యిస్తారు. కాబట్టి 15 డాలర్ల కారే మంచి" దంటూ, మేనేజర్ని అడిగాడు. మేనేజరుకూడ 15 డాలర్లది మంచిది కాదు 45 డాలర్లదే మంచిదని చెప్పాడు. వెంటనే "మా దగ్గిర డబ్బు దొబ్బాలని నీవు 45 డాలర్ల కారే మంచి దంటున్నావు. నాకు తెలుసు నీ సంగతి. నీ వేషాలు కట్టిపెట్టి 15 డాలర్ల కారే యియ్యి" అంటూ ఆనీ డబ్బు యిచ్చాడు తీసికోమని. ఆనీ వెంటనే కారెక్కాలని తలుపు తీశాడు.

దురదృష్టవశాత్తు తలుపు ఊడి పోయింది. మేనేజరు మరి ఐదు డాలర్లు యిస్తే తలుపు బిగిస్తా నన్నాడు. ఆనీ తలుపు బిగించేందుకు 5 డాలర్లు దండగ పెట్టి అప్పటికీ కారు 20 డాలర్లకి కిట్టిం దంటూ 45 అంత నష్టం లేదంటూ కారెక్కాడు రూనీతో సహా.

కారు బయలుదేరింది. చాల వేగంతో పోతోంది. కొన్నికొన్ని చోట్ల ఆనీ కారు తాలూకు వేగాన్ని తగ్గించ బోయాడు. కాని కారువేగం అంతకంత కెక్కువవుతోంది. కాని తగ్గడం లేదు. కారు ఒక వంతెనను సమీపించింది. వంతెనమీద కారు 5 మైళ్ల కన్న ఎక్కువ వేగంతో పోకూడదు. ఆనీ కారుతాలూకు వేగం తగ్గించ బోతే తగ్గలేదు. ఈ విషయాన్ని దగ్గిరగానున్న పోలీసు గమనించాడు. వెంటనే కారు నాపమన్నాడు. ఆనీ కారును వంతెన దాటి కొంతదూరం పోయాక ఆపగలిగాడు. వెంటనే పోలీసు అక్కడకు పరుగెత్తి ఆనీని కారు నుంచి దిగమంటూ వంతెనపై 5 మైళ్ల కన్న కారు ఎక్కువ వేగంతో పోకూడదు. కాబట్టి 5 డాలర్లు పెనాల్టీ యిచ్చుకోమన్నాడు. ఆనీ "నన్నేమి చెయ్యమంటావు. నా కారుకు సరిఅయిన టువంటి బ్రేకులు లేవు. నే నాపాలని చూసినా కారాగకపోతే నేనేం చేసేది?" అంటూ దబాయించాడు. వెంటనే పోలీసు వంతెనమీద కారును వేగంతో పోనిచ్చినందుకు 5 డాలర్లు, సరైనటువంటి బ్రేకులు లేని కారు నుపయోగిస్తున్నందుకు 10 డాలర్లు—మొత్తం 15 డాలర్లు యిచ్చుకో మన్నాడు. చేసేది లేక ఆనీ 15 డాలర్లు యిచ్చుకున్నాడు. అప్పటికీ ఆనీ తనకు కారు మొత్తం మీద 35 డాలర్లకు కిట్టిం దంటూ 45 డాలర్లంత నష్టం లేదనుకొని బయలు దేరాడు. కారు మళ్లీ శరవేగంతో బయలు దేరింది. రూనీకి ఆనీ విషయం నచ్చక పోయినా ఏం మాట్లాడకుండా ఆనీతో పాటు బయలు దేరాడు. కారు యథ ప్రకారంగా వేగాన్ని హెచ్చించుకొంటూ బయలుదేరుతూ ఎదురగుండా వస్తున్న ఒక ట్రాముకు గుద్దేసింది. దానితో ఆనీ రూనీలు ఎగిరి ఆమడ దూరాన్న పడ్డారు. కారు ముక్కలైపోయింది. పోలీసు వెంటనే పరుగెత్తుకొచ్చి రాష్‌గా డ్రైవు చేసినందుకు ఆనీకి 10 డాలర్లు జుల్మానా వేశాడు. ఆనీ-రూనీలకు తీవ్రంగా గాయాలు తగిలాయి. చేసేదిలేక 10 డాలర్లు యిచ్చుకొన్నారు.

కారిని ఆసుపత్రికి చేర్చారు. ఇప్పటికి 45 డాలర్లకి కిట్టింది కారు. ఆ కారైనా చెత్తకిప్పయి పోయింది.

అతిలోభిత్వములో పడ్డ ఆనీకి 45 డాలర్లూ దక్కలేక; కారూ దక్కలేదు. గాలిమేడలు కూలిపోగా దెబ్బలు తిని ఆనీ-రూనీలు బిక్కమొగాలతో ఆసుపత్రిలో పడుకొని ఒకరినొకరు చూచుకొంటూ కన్నీరు కార్చారు.

బాలగేయాలు

అభిసారం

[గేయ కథ]

రచన: 'అమరేంద్ర'

[గురుదేవులు రవీంద్రులకు కృతజ్ఞతతో]



1

మాపటి వేళా మధురానగరం మాటుమణగినాదీ
మాటుమణగినా ఊరి వెలుపలా బాటసారి ఒకడూ
కటిక నేలపై గాఢనిద్రలో కనులు మూసినాడూ
ఆకాశంలో శ్రావణ మేఘాలావరించినాయీ
ఆకాశంలో తారలకాంతులు అంతరించినాయీ
అంతలోనె ఘలు ఘల్లున మోగే అందెలసడితో
అంగన ఎవరో దారినిపోతూ అంధకారమందూ
చూడక అతనీ గుండెలమీదా అడుగు వేసినాదీ
తాకినంతనే తళుకున మెరిసే మెరుపులాగ లేచీ
మిణుకు మిణుకనే ప్రమిద వెలుగులో కరుణ తొణుకుకనులా
చూచి చకితుడై మాటలాడకా మిన్నకుండినాడూ
కన్నుల యెదుటా కామిని ఒకతే కానవచ్చినాదీ
ఘల్లున మోగే గజ్జెలందెలూ
విల్లున పోలే విలాసరూపం
పెల్లున పొంగే యౌవనరాగం
కన్నుల యెదుటా కామిని యెవరో కానవచ్చినాదీ
చీకటి రేతిరి ఒంటరిగానూ
చేతి దివ్వెతో పిటుల వెదుకుతూ
మధురా నగరపు మదవతి ఒకతే కానవచ్చినాదీ
మదవతిపేరూ వాసవదత్తా నవయౌవనమత్తా.
దివ్వె వెలుగులో బాలభిక్షుని తేజము చూచిందీ
చిరునవ్వులనూ చిందే మోమూ
కరుణాకాంతుల కురిసే కనులూ
చందమామలా మెరిసే నుదరూ
నుదుటిమీదనా విరిసే శాంతీ
కాంచినంతనే కామిని కన్నుల కమ్మినాది సిగ్గూ
కమ్మిన సిగ్గున భామిని కంఠమూ కంపించిందండీ
కంపించేటి కంఠంతో కామిని పలికిందీ:
"క్షమించవయ్యా, క్షమించు స్వామీ,
దయుంచవయ్యా దాసురాలిపై
దయుంచవయ్యా దీనురాలిపై
దయచేయాలీ దాసియింటికీ,
అంగకాడ యీ కటికనేలపై కందిపోదె నీ కోమల దేహం?
సందేహించకు సమయం కాదిది మందిరానికీ పోదాం రావా?
హంసతూలికా తల్పంమీదా
హాయిగ నిద్దర పోవా రావా?"
మదవతిమాటకు తెరువరి వెంటనె బదులు పలికినాడూ
పెదవులమీదా మందహాసమూ చిందులాడినాదీ
కరుణ నిండినా కంఠంతోనూ మారుపలికినాడూ
"సమయం కాదిది సుందరి! నేడూ సమయం కాదమ్మా
సాగిపొమ్మా నీదారిని, నాకూ సమయం రాలేదూ
తరుణం వస్తే తరుణి నీదరికి తప్పక వస్తానూ
సమయం వస్తే సుందరి నేనే సరగున వస్తానూ"
అంటుంటేనే ఆకాశంలో చీకటి కమ్మిందీ
అంటుంటేనే పిడుగుల మోతలు ఫెళఫెళ మన్నాయీ
అంటుంటేనే మెరుపులూ తళతళ మన్నాయీ,
అంతలోనే ఆ హోరుగాలిలో
అంతులేని ఆ కాళరాత్రిలో
ప్రళయ భైరవుని విలయశంఖమే
భుగున మోగిందీ
ఆకాశంలో దాగి ఎవ్వరో
వాసవదత్తను చూసి ఎంగుకో
వెక్కిరించుతూ వెటకారంగా ఫక్కున నవ్వారూ
అక్కడినుంచీ వెంటనె ఇంటీ దిక్కుకు మళ్లిందీ
మధురా నగరపు వాసవదత్తా యౌవన మధుమత్తా. (ఇంకావుంది)

బాలానందం

యుగోస్లావియా దేశంలోని-
పిల్లల పట్టణం

శ్రీమతి కనకవల్లి

నేను చెప్పబోయేది కథ కాదు. కలా కాదు. నిజంగా ఉన్నదే. యూరప్ ఖండంలో యూగోస్లావియా అని ఒక దేశము ఉంది. ఈ దేశం మొన్న మొన్నటిదాకా, హిట్లరు క్రింద ఉండేది. కాని రెండో ప్రపంచ యుద్ధం తరువాత ఆ దేశప్రజలు స్వరాజ్యం సంపాదించుకో గలిగారు. రెండు సంవత్సరాల్లో వాళ్లు ఎన్నో ఫ్యాక్టరీలు అవీ కట్టుకుని, అనేకవిధములైన జీవనోపాధులు కల్పించుకుని ఎంతో సుఖంగా ఉన్నారు. ఇంకోరి అవసరం లేకుండా, వాళ్లకి కావలసినదేదో వారు నడుపుతారు, చుట్టు ప్రక్కల దేశాల్తో ఎంతో స్నేహంగా ఉంటున్నారు.

ఆ దేశంలోనే ఉంది 'పిల్లల పట్టణం.' ఆ దేశం ముఖ్య పట్టణమైన 'బెల్‌గ్రేడ్' నగరానికి 5 మైళ్ల దూరంలో కట్టారీ చిన్న పట్టణాన్ని. దీన్ని 'పయినీర్ సిటీ (Poineer City)' అంటారు. పయినీర్ అంటే భావి పౌరులుగా తర్ఫీదు పొందే పిల్లలన్న మాట. ఈ పూరంతా పిల్లలే పరిపాలిస్తారు. అంటే ఈ వూళ్లో పెద్ద వుద్యోగస్థులూ, చిన్న ఉద్యోగస్థులూ, మునిసిపల్ కౌన్సిలర్లూ, పోలీసు వాళ్లూ అంతా పిల్లలే నన్నమాట. ఈ వూళ్లో పౌరులు కూడా పిల్లలే. ఈ ఉద్యోగస్థుల పిల్లల వయస్సు 7 ఏళ్ల మొదలు 14 ఏళ్ల దాకా వుంటుంది.

ఆ వూరి పొలిమేరలో—అంటే టోల్‌గేట్ అంటామే, అక్కడ—యిద్దరు పోలీసులుంటారు. 9 సంవత్సరముల వయస్సుగల ఒక అమ్మాయి, ఒక అబ్బాయీను. వీరు, ఈ పట్టణం చూడ్డానికివచ్చిన మనుష్యులను, వారు వచ్చిన పని అడిగి తెలిసికొని వార్ని గురించి పోలీస్ స్టేషన్‌లో తెలియపరచి, వారి అనుమతిమీద నూతన వ్యక్తులను నగరంలో ప్రవేశపెడతారు. ఊళ్లోకి వెళ్లగానే వివిధములైన ఆటలు ఆడుకోడానికి వీలుగానున్న ఆట స్థలాలున్నాయి. దానికెదురుగుండా ఆవూరు పోస్టాఫీసుంది. అందులో పోస్టుమాస్టరు వయస్సు 12 సం.లు. అక్కడ ఒక్క యుగోస్లోవేకియాతోనే కాకుండా ప్రపంచంలో మరే యితర ప్రాంతాలతోనైనా సరే వుత్తర ప్రత్యుత్తరాలు జరిగే ఏర్పాటుంది.

ఇంకా ఆవూళ్లో పత్రికాలయముంది. ఆ పత్రికపేరు 'పయినీర్ సిటీ వార్తాపత్రిక.' 2 వేలకాపీలచ్చు వేస్తారుట. కాయితాలు కత్తిరించడానికొక మిషనూ, అచ్చు వెయ్యడానికి చేత్తో పనిచేసే రెండు మిషనులూ, అక్షరాలూ అన్నీ ఉన్నాయి. అక్షరాలుకూర్చడం, అచ్చువెయ్యడం, అన్నీ పిల్లలే చేస్తారు, కొందరు యువకులు మాత్రం కొంచెం పని నేర్పుతూంటారు.

ఇక్కడ కౌన్సిలర్లనీ వాళ్లనీ ఈ వూరిలోని ప్రజలే ఎన్నుకుంటారు. వారికి కావలసిన వస్తువులు తయారు చేసుకుందుకు ప్రత్యేక కార్ఖానాలు ఉన్నాయి. అక్కడకూడా పిల్లలే పని చేస్తారు నేర్పేవారలు మాత్రం కొద్దిమంది పనివారలుంటారు. వీరికి కావలసిన పనిముట్లు 'యకోలిక్' ఫాక్టరీ వాళ్లు ఆవూరిపిల్లకి బహుమానంగా యిచ్చారుట.

ఇంకో చోటొక సినిమా హాలుంది. అక్కడ వారానికి రెండు మాట్లు సినీమాగాని, నాటకంగాని ప్రదర్శిస్తారుట. విజ్ఞానమందిరమని మరో చక్కని విశాల భవనముంది. 500 మంది పిల్లలాభవనంలో వుండొచ్చు. అక్కడ నృత్యం, ఆటలూ, పాటలూ, బుఱ్ఱకథలూ, యింకా ఎన్నో మనస్సుకుత్సాహం, ఉద్రేకం పుట్టేవి చూపిస్తారు. అందులోనే ఒకవార మంచి లైబ్రరీ ఒకటుంది. చిన్నపిల్లలకి పనికొచ్చే కథలపుస్తకాలూ, బొమ్మలపుస్తకాలూ, సైన్సు పుస్తకాలూ యింకా ఎన్నో వివిధశాస్త్రాలకి సంబంధించిన పుస్తకాలూ వున్నాయి. అందులోనే ఒకవైపు పెద్ద భోజనాలగదివుంది. వంట ఒక్కటి తప్పతతిమ్మా పనంతా పిల్లలే చేస్తారు ఆ యింట్లోనే ఒక చోట యుగోసోవియాలో కట్టిన పెద్ద నావలన్నిటిలోకి పెద్ద నావనమూనా వుంది. దీన్నక్కడి పిల్లలకి బెల్‌గ్రేడ్ నౌకా నిర్మాణ సంఘం బహుమానంగా యిచ్చారుట అక్కడి పిల్లలు కొత్తవాళ్లదగ్గర జంకూ, సిగ్గూ మొహమాటమూ లేకుండా ఎంతో సరదాగా వుంటారు. ఆ వూరికి రైలుకూడా వుంది. దానిపేరు 'పాయినీర్ రైలు' మొత్తం మూడు స్టేషన్లున్నాయి. ఆ రైలుకి ఇంజనుకాక మూడు పెట్టె లుంటాయి. అన్నీకూడా మూడవ తరగతి పెట్టెలే! ఆ స్టేషనులో మామూలు వెయిటింగ్ రూముకాకుండా పుస్తకాలు, పత్రికలూ కలిగి చదువుకుందుకి వీలుగా మరొక గది వుంది. ఆ స్టేషన్ మాష్టరు, టికెట్ కలక్టరు, పోర్టర్లూ, రైలు నడపేవారూ అంతా పిల్లలే. 14 సం. పిల్లలు. ఆ రైల్లోని సీట్లన్నీ పిల్లలు కూర్చున్న తరువాత మరీ పెద్ద వాళ్లకిస్తారు. చోటు లేక పోతే పెద్దవాళ్లు నిలబడవలసినదే! అన్ని రంగాల్లో పిల్లలూ బాలలూ, బాలికలూకూడాను. పెద్ద వాళ్లు టిక్కెట్ లేకుండా ప్రయాణం చేస్తే 15 అ. పైన యియ్యాలి పిల్లలైతే 2 అ. ఈ రైలు నుంచివచ్చిన సొమ్మంతా యిలాంటిదే మరో పిల్లల పట్టణం కట్టడానికి ఖర్చుచేస్తారుట. ఈ రైలుకి సంబంధించిన టెలిఫోన్, టెలిగ్రాఫీ అన్నీ పిల్లలే నడిపిస్తారు. అయితే ఎప్పుడూ ఒకే పిల్లలు పని చేయరు ఉదయం బడికి వెళ్లేవాళ్లు మధ్యాహ్నం, మధ్యాహ్నం బడికి వెళ్లేవాళ్లు పెళ్లీ ప్రొద్దుటా పనిచేస్తూంటారు. ఈ విధంగా అన్నిపనులూ అందరూ ఎంతో ఉత్సాహంతో నేర్చుకుంటారు.

ఈ వూళ్లో ప్రతి పౌరుడూ ప్రొద్దుటే లేవగానే తను, తనిల్లు పరిశుభ్రం చేసికోవాలి. తరువాత అందరూకలసి ఆడుకోడం, పాడుకోడం, చదువుకోడమున్నూ. చరిత్ర, భూగోళం మొదలగు విషయాలన్నీ వుపన్యాసాలుంటాయి. ఇవి మన బళ్లల్లోలా గాకుండా ఎన్నో మాపులూ, బొమ్మలూ మొదలైన ఉపకరణాల్తో ఎంతో ఉత్సాహంగా, అనేక మంచి విషయాలు తేలికగా తెలిసికొనేటట్లు చెబుతారు. ఇంకా సాయంకాలం చుట్టు ప్రక్కల తోటలకీ, కొండలకీ, నదులకీ షికార్లు వెళ్లడం, అప్పుడప్పుడు తోటల్లోనే వుండిపోయి వండుకు తినడం, యిలా ఎంతో వుత్సాహంగా, ఆనందంగా స్వర్గీయానందాన్ననుభవించుతూంటారు. ఏ విధమైన అసంతృప్తికీ, అశాంతికీతావుండదక్కడి పిల్లలకి. దీని బాధ్యతంతా ఆదేశప్రభుత్వానిదే? ఇంకా వాళ్ళ ప్రజలన్నా, నాయకులన్నా, దేశమన్నా వాళ్లకెంతో అభిమానమూ, గౌరవమూను. దేశం అభివృద్ధిలోకి రావాలన్నా, గొప్ప దనిపించుకోవాలన్నా, దాని బాధ్యతంతా పిల్లలమీదే ఆధారపడి వుంటుంది. వీరు బాగా చదువుకొని, పెద్ద శాస్త్రవేత్త లయితేనే దేశము ముందుకు రావటానికి వీలుంటుంది. అందుచేత పిల్లలందరూ సంతోషంగా ఉత్సాహంగా, ఆరోగ్యంగా, సంఘీభావంతో, ఐక్యతతో విద్యాభ్యాసం పొందడమే ప్రతివారి ఆదర్శమూను. వారి నినాదాలు "తక్కువ మార్కులు పిల్లల శత్రువులు," "తక్కువ మార్కులు రాకూడదు." మొదలైనవి.

ఇటువంటి పిల్లలపట్టణాలు మనదేశములో కూడా వుంటే ఎంతో బాగుంటుందికదూ! పోనీ పట్టణాలదాకా పోకపోయినా 'శిశువిహార్' లైనా వుంటే ఎంతో బాగుంటుంది. నిజంగా దేశం అన్నివిధాలా అభ్యుదయకరంగా వృద్ధి పొందాలంటే, ప్రస్తుతం పిల్లలుగా వున్న బాలబాలికలకు సరియైన పద్ధతుల్లో, సరియైన అవకాశాల్తోటి పెరగడానికి అవకాశాలు కల్పించాలి. ముఖ్యంగా ప్రస్తుతవిద్యావిధానం మారాలి. చాలా వరకు పాఠశాలలు వసతి గృహములతో, పసి పిల్లలు కూడా విద్యాభ్యాసం చెయ్యడానికి వీలైన నూతన మార్గాలతో సర్కించాలి. వృత్తి విద్యలతో గూడిన విద్యను బోధించునట్టుండాలి. ఇటువంటి పాఠశాలలు జిల్లాకొకటైనా వుంటే కొంతవరకూ బాగుంటుంది. ప్రస్తుతం మన చెన్న రాష్ట్రంలో ఇటువంటి పాఠశాలలు లేవనే చెప్పొచ్చు.

మన భారతదేశ భావిభాగ్యోదయానికి కారకులైన భావిపౌరులు కాగల బాలబాలికల విద్యాపోషణల విషయమై మన ప్రజాప్రభుత్వం పూనుకోవాలి.

(సూలం సత్యపాల్ రాంగ్)

వ్రతంచెడ్డా ఫలం తప్పదు

పిల్లల కథ

చి॥ వై. శేఖర్

రామునికి ఆరోజు లెక్కల పరీక్ష. వాడు బాగుగా లెక్కల పరీక్షకి తయారు కాలేదు. మరియు లెక్కలంటే అసలే భయము. వాడు తను లెక్కలలో తప్పిపోవుట నిశ్చయమని తీర్మానించుకొనెను.

వాడికి ఏంచేయాలనో తోచలేదు. ఎట్లయినను పాసుమార్కు తెచ్చుకోవాలని ప్రయత్నించవలెనని తలచెను అతనికి ఒక ఉపాయము తోచెను. అతడు తన స్నేహితులవద్దకు వెళ్లి తనకు పరీక్ష హాలులో లెక్కలుచూపించవలెనని అడిగెను. వారు దానికి సమ్మతించలేదు.

రాముడు చాల విచారపడెను. వాని తల్లిదండ్రులు అతనిని పిలిచి 'పరీక్షకు గంట అయినది. త్వరగా స్నానముచేసి పరీక్షకు పోరా' అని చెప్పిరి. వాడు స్నానము చేయుటకు స్నానాల గదికి వెళ్లెను. వానికి ఒక తేలు కనబడెను. తేలును పట్టుకొనిన కుట్టునుగాదా పరీక్షకు వెళ్లుట తప్పునని ఆశతో రాముడు తేలుచే కుట్టించుకొనెను 'తేలు కుట్టింది బాబో!' అని గట్టిగా గోల పెట్టెను. అతని నాన్న, అమ్మ ఇద్దరూ వానికి మాంత్రికుని పిలిచి మంత్రము వేయించిరి. అపుడు వాని నాన్న, "పరీక్షకు పోవద్దు నేను మాష్టారు దగ్గరి కెళ్లి చెప్పెదను" అని చెప్పెను. వాడు దర్జాగా లెక్కల పరీక్ష గండము తప్పిపోయినదని బాగుగా పక్కలో పడుకొని నిద్రపోయెను.

ఆ రోజు సాయంత్రము వాని నాన్న రాముని పిలిచి, "ఓరేయ్, ఈ రోజు లెక్కల పరీక్ష జరగలేదట. పరీక్ష పేపరు దొంగతనముగా తెలిసిపోయిందట. అందువలన రేపు మరల లెక్కల పరీక్ష పెట్టెదరు. నీకు మంచిదయినది" అని చెప్పెను.

రాముడు తేలు కుట్టించు కొనినను పరీక్ష తప్పలేదే యని విచారించుచు తలవంచు కొనెను

ఆసురవివాహము

శ్రీ వావిలాల సోమయాజులు

కవిబ్రహ్మ తిక్కన సోమయాజి అనుశాసనిక పర్వంలో ధర్మరాజుకు గాంధర్వాది వివాహ విధానాలను చెప్పేంచె సందర్భంలో 'మున్న మనంబున దగిలిన కన్నియ యెవ్వాని గోరు గాంధర్వం బా, యన్న నతని కిచ్చుట, వెలవన్నియ యాసురము సూవె కౌరవముఖ్యా!' (ద్వితీయాశ్వాసము. 233) అని అసురవివాహ (*marriage by purchase*) లక్షణాన్ని వ్యక్తీకరించినాడు. కన్యక పోషకులు—తండ్రి కావచ్చును, లేదా ఇతరులు కావచ్చును—ఆమెను ఒకానొక క్రయవస్తువుగా భావించి వివాహార్థిగా వచ్చిన వరుని దగ్గరనుంచిగానీ, లేదా వాని బంధువుల దగ్గరనుంచిగానీ కొంత ప్రతిఫలాన్ని పొందటము అసుర వివాహానికి ముఖ్య గుణము. ఇది భారతదేశంలో అనాది కాలంనుంచీ ఒక వైవాహికవిధానంగా ఉంటూ ఉన్నట్లు మన్వాదిస్మృతులవల్ల వ్యక్తమౌతూ ఉన్నది.

అనాగరకజాతుల్లో నేటికీ ఈ వివాహ విధానమే విశేషంగా కనిపిస్తున్నది. ఇది కేవలం రాక్షసవివాహంవలె (*marriage by capture*) అధమము కాదు; దైవ ప్రాజాపత్యాలవలె ఉత్తమమూ కాదు. నాగరికతా పరిణామంలో మధ్యమస్థితి వహించినవాళ్లల్లో ఈ వివాహ విధానమే విరివిగా కనిపిస్తున్నది.

కొన్ని అనాగరకజాతుల్లో వివాహానికి వధువుబంధువర్గం దగ్గరనుంచీ అంగీకారం దొరికే నిమిత్తం కన్యక తండ్రికిగానీ, ఇతర ఆత్మబంధువులకుగానీ కొంత 'శుల్కం' ఇవ్వవలసి ఉంటుంది. అది కేవలమూ ఆస్తిపాస్తుల వల్లనే కాకపోవచ్చును. కొన్ని జాతుల్లో వివాహ యోగ్యఅయిన కన్యక దొరకవలెనంటే వరుడు ఆమె బంధువర్గానికి కొంతకాలం సేవ చేయవలసి ఉంటుంది. కొన్ని జాతుల్లో కన్యకు ప్రతిగా మరిఒక కన్యకను ఇవ్వవలసిఉంటుంది.

ఈవిధంగా ప్రతిఫలాన్ని ద్రవ్యరూపానగానీ, మనుష్యరూపానగానీ, లేక సేవామూలంగాగానీ పొందితేగాని కన్యకను వివాహ యోగ్యుడైన వరుడికి ఇవ్వకపోవటము చాలా నికృష్టమైన ఆచారం. దీనిని స్త్రీలైన ఎదుర్కోటానికి యత్నం చెయ్యలేదు. పైగా వారు ఇటువంటి 'పణ్యద్రవ్యం' పుచ్చుకోటంవల్ల వివాహానికి క్రమగౌరవం కలుగుతుందనీ, అది వారికి గౌరవవిషయమనీ భావిస్తున్నారు. కొన్ని జాతుల్లో ఆమెకోసం వ్యయమయ్యే ధనాధిక్యతను బట్టి భార్యకు గౌరవం లభిస్తున్నది.

'కన్యాశుల్కం' కోసం కొంత ధనం వ్యయం చేయకుండానే లభించిన భార్యను వెలి వేసిన వ్యక్తివలె భావించటం యాకూట్ జాతి వారి అభిప్రాయం. యద్విధమైన శుల్కం లేకుండానే లభించే ఐరోపాజాతి స్త్రీలంటే ఆ జాతిస్త్రీలు అగౌరవంగా చూస్తారట. క్రమమైన వెలయిచ్చి కొనక్కోని భార్యను జారిణిగా పరిగణించటం పశ్చిమాఫ్రికాజాతుల ఆచారం. ప్రియుడు 'శుల్కం' చెల్లించలేని స్థితిలో కొన్ని జాతుల్లో ప్రియ అతనితో కలిసి తండ్రి యింట్లోనుంచి పారిపోతుంది. అప్పుడుతప్ప ఆమె మనసార ప్రేమించిన ప్రియుణ్ణి వివాహం చేసుకోటానికి అవకాశ ముండ దన్నమాట. అందువల్ల కొన్ని జాతుల్లో ఈ శుల్కాన్ని తప్పించుకోటానికి యువతీయువకులు పారిపోవటం (*Elopement*) జరుగుతుంటుంది. అటువంటి వరుణ్ణి వధూజాతివారు దొంగసొత్తుతో ఉన్న వాడివలెనే చూస్తారు.

భార్యకు ప్రతిగా ఇచ్చే ఈ 'శుల్కం' జాతుల్నిబట్టి మారుతుంటుంది. మక్కాలో కన్యకలను భార్యలుగా ఉత్తమ తరగతులవారే వలపై మొదలు మూడువందల డాలర్లవరకూ అమ్ముతుంటారని ఫీల్డింగు అతని 'విచిత్రాచారాలు' అనే గ్రంథంలో వ్రాశాడు. చాలా దేశాలల్లో ఇది బహుమానంగా ఇవ్వటం జరుగుతుంది. దానికి ప్రతిగా వరుడు కొంత కట్నమూ పొందవచ్చు. ఆంధ్రదేశంలో పెట్టే సొమ్మూ అల్లుడికిచ్చే కట్నానికీ అధికసంబంధం నేటికీ కనిపిస్తూ ఉన్నది.

ఉత్తర అమెరికాలోని ఇండియను జాతుల్లో అందమైన వధువుకు 'శుల్కం' పన్నెండు పోనీ జంతువులు. అక్కడి కాలిఫోర్నియాలోని హూపాజాతిలో వధువుకు ఇచ్చే శుల్కం వరుని తండ్రి తల్లిని వివాహమాడేటప్పుడు ఇచ్చిన 'పణ్యధనం'మీద ఆధారపడిఉంటుంది. ఆఫ్రికా జాతుల్లో భార్యను కొనుగోలుచెయ్యటం విపరీతం. పణ్యధనం ఆహారవస్తువులు, గొంగళీలు, కత్తులు మొదలైన వస్తుసామగ్రి ఏదైనా కావచ్చును. జాతిపెద్ద భార్యను కొనటానికి నూరు పశువుల నిస్తాడు. ఉగండాజాతుల్లో ఉత్తమతరగతివారు భార్యకోసం నూరు మేకలనూ, పదహారు ఆవులనూ క్రయధనంగా ఇవ్వవలసిఉంటుంది. పేదవాడు మూడునాలుగు ఎద్దులనూ అయిదు ఆరు సూదులు ఇస్తే భార్య దొరుకుతుంది. బంగలాజాతిలో వరధనంతప్ప పుచ్చుకోరు. ఆ జాతిలో భార్య కావలిస్తే ఇద్దరు ఆడబానిసలనూ, ఇద్దరు మొగబానిసలనూ స్వతంత్రుడైనవాడు ఇవ్వవలసి ఉంటుంది. ఆఫ్రికాజాతుల్లో సర్వసామాన్యంగా పశువులకూ కన్యకలకూ మారకం జరుగుతుంది. పది పన్నెండు పశువులు ఇస్తే కాఫర్‌కు భార్య లభించటం కద్దు. హెరిరోజాతిలో పేదవాడికైనా, ధనికుడికైనా భార్య ఒకేరీతిగా, ఒకే మారకానికి దొరుకుతుంది. కన్యక తండ్రికి ఒక బలిసిన ఎద్దునుగానీ, లేదా ఒక మేకపోతునుగానీ పంపిస్తే చాలు. దానిని వివాహ సమయంలో చంపి తినేస్తారు. ఇది ఒక్కటే వారి వివాహ తంతు. ఒక బండెడు చొప్పకుగానీ, ఒక బండెడు కట్టెలకుగానీ పేదవాడికీ, మూడువేల రుబుల్సు శుల్కమిస్తేగానీ ధనికుడికీ రష్యాలోని బాస్కిర్ జాతివారిలో భార్య ఒకానొక కాలంలో లభించేది కాదని ఒక సాంఘికశాస్త్రవేత్త వ్రాసి ఉన్నాడు.

సర్వసామాన్యంగా 'ఈ శుల్కం' అనేక విషయాలమీద ఆధారపడిఉంటుంది. వధువు అందచందాలు, ఉభయుల ఆర్థికస్థితీ, వరుడి వయస్సు, స్త్రీపురుష జనసంఖ్య, మరి కొన్ని స్థానిక కారణాలూ దీన్ని నిర్ణయిస్తూ ఉంటవి. కొన్ని సందర్భాలలో ఈ సందర్భాలతో అవసరం లేకుండా భార్యను పొందటానికి ఇంత శుల్కమని నిశ్చితమై కూడా ఉంటుంది. సర్వసామాన్యంగా విడాకులు పొందిన స్త్రీనిగానీ విధవఅయిన స్త్రీనిగానీ తక్కువ వెలకు పొందవచ్చు. పుష్పవతిగాని పిల్లగాని, బహుకాలం వివాహంగాని స్త్రీగానీ తక్కువకే దొరకవచ్చు.

చైనాలో అత్యుత్తమ నాగరక జాతుల్లో ఈ నాటికీ ఆసురవివాహం కనిపిస్తున్నది. శుల్కం చేత పడ్డంతవరకూ పెళ్లి జరిగినట్టే కాదు, తంతు జరిగినాసరే. మొట్టమొదట మహమ్మదీయ దేశాల్లో తండ్రికి 'కన్యాశుల్కం' ఇవ్వటం జరిగేది. అది క్రమంగా భర్త చనిపోయిన తరువాతిగానీ, విడాకులు పొందినప్పుడుగానీ ఉపకరించే స్త్రీధనంగా పరిణమించింది. కొన్ని సందర్భాలలో ఇది వధువుకు బహుమతి మూలంగా చెందే ఏర్పాటు జరిగింది.

ఆసుర వివాహం స్త్రీలకు నైచ్యస్థితి ఏర్పడటానికి కారణంగా పరిణమించింది. వ్యక్తిత్వముగానీ, స్వేచ్ఛా స్వాతంత్ర్యముగానీ, లేని పశువుగా ఆమె పరిగణితకావటం పురాతన సంఘాలలో ఆమె మారకానికి ఉపకరించే వస్తువైంది.

గ్రీసుదేశం అత్యుత్తమ నాగరికతను అనుభవిస్తూఉన్న కాలంలో ఈ ఆసుర వివాహానికి సంబంధించిన ఒక వైవాహికాచారం ప్రబలంగా ఉన్నట్లు వారి సాహిత్యంవల్ల వ్యక్తమౌతున్నది. ఆమె క్రొత్తయింటికి అమ్ముడు పోవటంవల్ల ఆమెకు స్వాతంత్ర్యం లేదు—అని నిరూపించటానికి ఆమె ఎక్కివచ్చిన బండిని వరుని ఇంటి ముందు పురాతన గ్రీకులు పరపరామప్రీతి చేసేవారట. 'ప్రదానపు టుంగరము' అనేక జాతుల్లో ఈ శుల్కాన్ని చెల్లించటానికి గుర్తుగా భావిస్తారు. ట్యూటానిక్ ఇంగ్లీషుజాతుల్లోనూ ఇదే లక్షణము.

రష్యాలో వధువు వరుని పాదాలు ముగు పెట్టుకోటమనే ఆచారం అమె దాస్యభావాన్ని వ్యక్తంచేయటమే. అది ఫ్రాన్సుదేశంలో తరువాత కాలాన భర్త కాళ్లదగ్గర ఉంగరం పడేట్లుగా చేసి దానిని వధువు వంగి తీసుకోటమనే మార్పు పొందింది. రష్యాలో మహావిప్లవం వరకూ ఆసుర వివాహం బాహాటంగా సాగింది. వరుని తండ్రి వధువు తండ్రి దగ్గరికి వెళ్లి బేరమాడి కోరిని కొనుక్కొచ్చేవాడు. గేదె, గుర్రం, ఆవును బేరమాడటానికి వధువుని తెచ్చుకోటానికీ ఏవిధమైన విభేదమూ లేదు. వారు వివాహయోగ్యమైన కన్యను 'శంక' అంటారట. 'శుస' అంటే మార్టిన్ అనే జంతువు. పూర్వం దాని చర్మానికి మారకంగా వివాహయోగ్యమైన కన్యక లభించటంవల్ల నేడు కూడా యుక్తవయస్కఅయిన కన్యకు ఆ పేరే నిలిచింది.

ఐర్లండు జాతులవారు శుల్కానికి 'కాదో బాళీ' అంటారట. దానికి వస్తుసముదాయమని అర్థం. అందులో బంగారము, రాగి, ఇత్తడి, గుడ్డలు, పందులు, ఆవులు అన్నీ ఉండవచ్చును. భార్యాపణ్యద్రవ్యాన్ని ఒక్కమాటుగా ఇవ్వవలసిన అగత్యం అన్ని జాతుల్లోనూ లేదు. వివాహం జరిగిపోయినతరువాత కొన్ని సంవత్సరాలవరకూ ఇస్తూ ఉండవచ్చును.

సైబీరియాలో కిర్గిజ్ అనే టర్కిష్‌జాతిలోని తండ్రి కుమారుడికి పదిఏళ్లు రాగానే ఒక పిల్లను నిర్ధంచేసకొని ఎనభై పశువులదాకా ఉండే శుల్కద్రవ్యాన్ని జాగ్రత్త చేయటం ప్రారంభిస్తాడు. ఇది అనేకపర్యాయాలుగా చెల్లించవచ్చును. ఎక్కువ మొత్తం రాగానే పెళ్లి జరుగుతుంది. ఈ జాతిలో శుల్కం అధికం. అందువల్ల ఎవరూ తొందరపడి భార్యకు విడాకు లివ్వరు. ఇస్లాంమతధర్మం పురుషుని ఆధిక్యాన్నే నిరూపిస్తున్నా, స్త్రీ భర్త ఆస్తిగా పరిగణించటాన్ని ఏర్పరచినా కావలసినంతమంది దొరక్కపోవటంవల్ల (*Economic law of supply and demand*) ఇటువంటి పని జరగదు అని శాస్త్రజ్ఞుల అభిప్రాయం.

ఆసుర వివాహలక్షణమైన 'శుల్కం' పూర్తిగా చెల్లిస్తేగాని భార్య భర్త ఇంటికి రాక తల్లిదండ్రులతోనే ఉండటం అనేక జాతులల్లో ఉంది. పశ్చిమాఫ్రికాలో పూర్తిగా శుల్కం చెల్లించలేని భర్త మామగారింట్లోనే చెల్లించేవరకూ భార్యతో కాపురం చేస్తుంటాడు. అంతవరకూ కలిగే సంతానం మామగారిదౌతుంది. బెనింబరులో కన్యకకు శుల్కద్రవ్యంగా ఏర్పరుచుకున్న దంతపుసామాను పిల్ల తండ్రికి చెందటానికి ఎంతోకాలం పడుతుంది. అంతవరకూ అతడు మామగారింట్లోనే ఉండిపోతాడు. అకిప్రయుక్ జాతిలో ఇరవై గోవులకు భార్య లభిస్తుంది. అన్నీ ఒకమాటు చెల్లించక వంతులమీద చెల్లించినప్పుడు అతనికి కలిగే సంతానానికి తొమ్మిది పది సంవత్సరాలు కూడా రావచ్చును. చిక్‌కొండజాతుల్లో ఈ శుల్కాన్ని జీవితాంతంవరకూ చెల్లిస్తూ ఉంటారట. దీనినిబట్టి అనాగరకజాతులుకూడా అనేక మార్గాలుగా క్రయధనం పుచ్చుకోటంవల్ల ఉండే నష్టాన్ని గ్రహించినట్లు అర్థమౌతున్నది. మొత్తం చెల్లించలేని పక్షంలో పిల్లతండ్రికి కుటుంబము పెరగటమూ, కుమార్తె భర్తతో ఇంట్లోనే ఉండి అతని 'పనిపాటలు' చేసిపెట్టుతూ ఉండటంవల్ల ఇటువంటి పద్ధతినే విశేషంగా కొన్ని జాతులు ఆదరించేవని ప్రపంచవివాహ చరిత్రకారుడు వెస్టర్‌మార్కు అభిప్రాయము.

రాక్షసంగా కన్యను ఎత్తుకోపోయి వివాహం చేసుకోటం మొదటిమెట్టు. దానికి ప్రతిగా ఆసురము వచ్చింది. వెల ఇంత అంత అని నిశ్చయం చేయటం కష్టమనిపించినప్పుడు ఆసుర వివాహంలోనే 'బదులుకు బదులు' (*marriage by exchange*, అనే పద్ధతి ఆచారంగా కొన్ని జాతుల్లో ఏర్పడ్డది. అంటే భార్య లభించవలెనంటే ఒక స్త్రీని బదులు ఇవ్వవలసి వచ్చిందన్నమాట. కుమార్తె లుంటే ధూపగల తండ్రులు ఈ మారకం చేస్తారు; చెల్లెలుంటే అన్నదమ్ములు చేస్తారు. చెల్లెళ్లు లేనప్పుడు సవతితండ్రి కూతుళ్లనూ పెత్తండ్రి కూతుళ్లనూ మారకం చెయ్యవచ్చు. మెలనీషియాలోని సోలామన్ జాతిలో మొదట స్నేహితాలు అభివృద్ధిచేసకోటానికని ఏర్పడ్డ స్త్రీల మారకం శుల్కవివాహంగా పరిణమించింది. దక్షిణఆస్ట్రేలియాలో 'నరిన్‌యేరీ' జాతి స్త్రీ ఆమెకు బదులుగా తల్లిదండ్రులకు మరిఒక ఆడపిల్లను ఇవ్వని పురుషుణ్ణి వివాహం చేసుకోటం అగౌరవంగా భావిస్తుందట. ఇటువంటి ఆచారాలు న్యూగినీ, న్యూహెబ్రిడీస్, సోలొమన్, సుమత్రా ద్వీపాలల్లో ఉంది. సుమత్రాద్వీపవాసులు 'జుజు' (కన్యాశుల్కం) ఇవ్వటానికి బదులుగా స్త్రీనే ఇస్తారట. న్యూసౌత్ వేల్సులో కుంబూ, మూరి జాతుల్లో బదులు వివాహం ఉంది.

కొన్ని జాతుల్లో ఈ శుల్కానికి తోడుగా పిల్లలకన్యాత్వాన్ని (*Virginity*) కాపాడినందుకు తల్లికి కొంత ధనమూ, అంగీకారాన్ని ఇచ్చినందుకు అక్కచెల్లెండ్రకూ, తండ్రికీ కొంత ధనమూ ఇవ్వవలసిఉంటుంది. ఈ ధనమంత తిరిగీ అనవసమని తోచినప్పుడు ఇచ్చివేసి పిల్లను తెచ్చుకోటం ఆఫ్రికా జాతులు కొన్నింట్లో ఆచారంగాఉందని వెస్టర్‌మార్కు అభిప్రాయం. 'పసుధనానికి' అమ్మకపోయిన స్త్రీని కాఫర్ జాతులు తక్కువగా చూస్తవట. కొన్ని జాతుల్లో ఈ ధనాన్ని వివాహానంతరం స్త్రీధనంగా మార్చి ఉంచుతారట. నేటి వైవాహిక విధానాలలో బహుమతులుగానూ, కట్నాలు, వసివళ్లుగా నిలిచినా సమస్త వ్యవహారాలూ ఒకనాటి ఆసుర వివాహ లక్షణాలే నని నిశ్చయంగా చెప్పవచ్చును. ఇది ఆంధ్రదేశంలో నేటికీ విరివిగా కనిపిస్తున్నది. ఈ శుల్కం స్త్రీధనంగా మారటమూ, శుల్కాన్ని స్త్రీకే ఇవ్వటమూ ఆసుర వివాహ విధానంలో మరొకమెట్టు పైకెక్కినట్లు వ్యక్తం చేస్తున్నవి. జ్యూ, మహమ్మదీయజాతుల్లో క్రీ పూ 100 సంవత్సరాలనాడే శుల్కంగా ఇవ్వటానికి, కన్యక అయితే ఒప్పుకున్న రెండువందల దీనారాలుగానీ, విధవ అయితే ఇవ్వవలసిన నూరు దీనారాలుగానీ స్త్రీధనం కావటం ఏర్పాటైంది. దీనికోసం భర్త ఆస్తి తాకట్టైనా పెట్టవలసివస్తుంది. వివాహం జరిగినట్లు నిశ్చితం కావలెనంటే స్త్రీధనమైన 'సాదక్'ను తండ్రిపరం చెయ్యవలెనని కొరాను పలికింది.

భారతదేశంలో 'స్త్రీధనం' మనువునాడే ఏర్పాటైంది. టుటానిక్ జాతుల్లో క్రీ శ 6 వ శతాబ్దంలోకాని జరగలేదు. పితృస్వామికాలైన కుటుంబాల్లో ఈ స్త్రీధనం భర్తదగ్గర ఉంటుంది. అతని మరణానంతరం ఆమెకు అతని రాబడిలోనుంచీ భృతికి ఏర్పాటు జరగటం వచ్చింది. మొన్న మొన్నటివరకూ యూరప్, జర్మనీ, స్విట్జర్లాండుదేశాలలో వివాహ సమయంలో ఆచారంగా ఉన్న 'ఉదయప్రదానము' (*Morgengabio*) లేక 'మార్నింగ్ గిఫ్ట్' శుల్కానికీ, స్త్రీధనానికీ సంబంధించింది. ఇటలీలోని 'కొయిల్' ఇటువంటిదే.


అసుర వివాహంలో 'సేవాశుల్కం' అనే ఒకానొక విధానం అనేకజాతుల్లో కనిపిస్తున్నది. తండ్రికి కొంతకాలం సేవ చేసి పిల్లను పొందటమే దీనికి లక్షణం. ధనం ఇచ్చేబదులు 'శరీర సేవ' చేస్తూఉండటంవల్ల ఇదికూడా శాస్త్రజ్ఞులు శుల్కవివాహం(*Marriage by Purchase*)గా భావించారు. కొన్నిజాతుల్లో శుల్కం చెల్లించినా కన్యక తండ్రికి వరుడు కొంతకాలం సేవ చేస్తేగాని భార్య దొరకదు. ఇటువంటి సందర్భాలలో జరిగే వివాహాన్ని ఆసురము (*Marriage by Purchase*) అనటానికి వీలు లేదని ఫీల్డింగు అభిప్రాయము. ఇటువంటి వివాహానికి ఉదాహరణంగా బైబిలులో (*Genesis*

XXIX) జాకొబ్, రాహెలుల కథ కనిపిస్తూ ఉన్నది మాతృస్వామికాలైన (Matriarchal) కుటుంబాలలో కన్యకకుటుంబానికి వరుడు కొంతకాలం సేవచేస్తేగాని భార్య లభించదు అతనికి ఆస్తి లేకపోతే ఎంతకాలమైనా ఆకుటుంబానికి సేవకుడుగా ఉండవలసివస్తుంది; అయితే పితృస్వామికాలల్లో (Patriarchal) సేవ జేయవలసిన కాలానికి ఒక పరిమితి అంటూ ఉంటుంది ఈశాన్యరాష్ లోని కాలిఫాప్ ఇండియనలలోనూ, బ్రెజిలు ఇండియనులలోనూ, యూకటనలలోనూ ఇదే ఆచారము ఉత్తర ఆసియాలో నిగేరికూ, కొరయక్, చుక్చీ జాతి యువకుడు ఈవిధంగా భార్యకోసం సేవచేయవలసిందే ఇండియా, ఇండోచైనా, చైనా, జపాను దేశాల్లో ఇది అనేక జాతుల్లో ఆచారంగా ఉంది ఇండియన్ ఆర్చిపెలగో, ఆఫ్రికా దక్షిణఅమెరికాల్లోనూ కొన్ని కుటుంబాల్లో ఇదే పద్ధతి. ఎస్కిమోజాతిలోనూ మకరంగాలలోనూ (ఆఫ్రికా) ఇదే ఆచారము ఈరీతిగా సేవచేస్తూఉన్న భర్త మంచిగుణాలు లేనివాడని పిస్తే ఎప్పుడైనా అతణ్ణి కన్యక తండ్రిఇంట్లోనుంచి వెళ్లిపొమ్మనవచ్చును. అటువంటి సందర్భాలలో భార్యాభర్తలకు కలిగిన సంతానం కన్యక కుటుంబానికి చెందటమే కనిపిస్తున్నది

ఈ సేవావివాహానికి (marriage by service) ముఖోద్దేశము భర్తకంటే భార్య అధికురాలని నిరూపించటమే అయినట్లు అవగతమౌతున్నది ఇటువంటి వివాహాలు జరిగినప్పుడు స్త్రీకి విశేషస్వాతంత్ర్యం ఉన్నది అసుర వివాహంలో కేవలం వెలయిచ్చి విక్రయించుకున్న భార్యకు ఇటువంటి స్వేచ్ఛ ఉండటానికి అవకాశం ఏమాత్రమూ లేదు సర్వసామాన్యంగా అనాగరక జాతుల్లో స్త్రీ పొందే నైచ్యాన్నీ, అగౌరవభావాన్నీ తీసివేయటానికే ఇటువంటి సేవాలక్షణం అసుర వివాహంలో ఒక భాగంగానూ, ప్రత్యేక వివాహవిధానంగానూ ఏర్పడి ఉంటుందని విజ్ఞుల అభిప్రాయం

పురాతన గ్రీసుదేశంలోని స్పార్టాలో 2/5వ వంతు దేశం స్త్రీకి కట్నంగా వచ్చినదేనని ఎరిస్టాటల్ చెప్పినాడు న్యాయసమ్మతమైన భార్యకు 'డాప్' (స్త్రీ ధనం) ఇవ్వటం ఒకానొకనాడు రోమనులు విశేషంగా గౌరవించేవారు భార్య దానిని నూతన గృహనిర్మాణంకోసం భర్త కిచ్చి తరువాత పుచ్చుకుంటేది ఇటువంటి ఆస్తిని తాకట్టు పెట్టటానికి గానీ, అమ్మటానికిగానీ భర్తకు ఎటువంటి అధికారమూ రోమనుధర్మశాస్త్రము అంగీకరించలేదు. భర్త కట్నంగానూ, భార్య కట్నంగా గానీ, లేక స్త్రీ ధనంతో గానీ నూతన గృహాన్ని ఏర్పరచుకొని కొంతికాలం కాపురంచేసి విభేధాలు వచ్చి విడాకులు పుచ్చుకుంటే ఆ ఆస్తిని ఇరువురూ సమానంగా పంచుకునేవారు

క్రీ పూ 1955 లో బాబిలోనియా రాజు హమ్మురబీ 'భర్త భార్యను ఇంట్లోనుంచి వెళ్లగొట్టి ఆమె స్త్రీ ధనాన్ని ఇచ్చివేయవలసిందే' నని శాసించాడు. 'ఇండీలోని స్త్రీలు' అనే గ్రంథంలో విలియం బౌల్టింగ్ మహాశయుడు స్త్రీ ధనాన్నిగురించి నానావిధానాలైన నియమాలను విచిత్రాలను వివరించాడు ఇటువంటి లక్షణాలే ఇతర జాతుల్లోనూ, దేశాల్లోనూ ఉన్నవి ఆసురవివాహభాగంగా ఉన్న సేవకుడు కేవలం సేవకుడు భవిష్యత్తులో జామాత ఇది అతనికి కేవలం పరీక్షాసమయం విరివిగా కనుపించే బహూకృతులు, తదితరాలూ ఉభయకులాల మధ్య సఖ్యబంధాన్ని అభివృద్ధిచేయటం కోసంగానే కనిపిస్తున్నవి ఈ విషయమే జాఫెర్సన్ సైబీరియాలోని యూకఘిర్ జాతి అభిప్రాయమే ఇటువంటి దైనట్లు వ్రాసినాడు. పావిడా జాతిలో పెళ్లికుమారుడిపక్షం ఏబది నాణాలను పంపితే వాటికి బదులుగా పెళ్లికుమార్తెవారు అయిదుపందులను పంపుతారట! అప్పుడు 'పెళ్లికుమార్తె తండ్రి పెళ్లికుమారుడి తండ్రికి 'మీ నాణాలకు మీకు వచ్చేది ఈ అయిదు పందులుగానీ అందమైన మా అమ్మాయి కాదు' అని చెప్పి పంపుతాడట ఇటువంటి సందర్భాలలో ఇవి లాంఛనాలు పరస్పరమూ సఖ్యభావాన్ని పెంపొందించే క్రియలుగాని ఆసురవివాహ లక్షణాలుగా ఆధునిక వివాహంలో నిలచిన లక్షణాలు మాత్రం కావు



తాళ్ళపాకవారి పదములు

శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ

అన్నమాచార్యుల రచన: (సంపు. ౮; ప ౧౭౭)

౬

శంకరాభరణం - మిశ్రచాపుతాళం

[తాళం ౭ మాత్ర లొక్కొ మొత్తం ఒక్కొక మొత్తాని కొక్కొక దెబ్బగా వేసికొనుట మంచిది సౌలభ్యంకొరకు ౩ ౪ గా మాత్రలు పంచుకొని రెండు ఘాతలుగా వేసుకోవచ్చును ఇంకా సులభం కావలిస్తే ౩-౨-౨ గా కూడు తట్లు తట్టవచ్చును, అప్పుడిది త్రిపుటచాపు అనబడును.]

[పల్లవి]

(౧) స సా సా స ని । స రి గా మ గ । గ రి గ రి, స । సా , , , , ,
గు ఱు తె త్తి న దొం గ కూ గూ గు

(౨) స స గ రి స స ని । స రి గా మ ప । మ గ రి గ రి స । సా , , , , ,
గు ఱు తె త్తి న దొం గ కూ గూ గు

(౩) స స గ రి స స ని । స గ రి గ మ ధ ప పా । గ మ రి సా ధ ని । స , , , , ,
గు ఱు తె త్తి న దొం గ కూ గూ గు

(౧) స రి గా మ గ । రి, గా మా । పా మ మా, గ । రి గ గ మ గ రి
గు డి లో న దా గి ని కూ గూ గు

(౨) స రి గా మ గ । సా రి గా మా । ప ధ ప మ ప మ గ । గా రి ప మ గ రి
గు డి లో న దా గి ని కూ గూ గు

(౩) స రి గ మ గ రి । స రి గ మ ప స ని । సా ని పా, మ । ధ ప ప మ మ గ రి
గు డి లో న దా గి ని కూ గూ గు

(౪) స పా ప మ గ రి । స రి గ మ ప ధ ని । సం గ రిం సం ని ధ రిం । సం ధ ప ప మ గ రి ॥
గు డి లో న దా గి ని కూ గూ గు (గుఱు)

[చరణం]

(౧) గ మా సా పా । పా, ప మ ప మ । పా, ధ ని ధ ప । మ ప మ గా మ రి
నె ల త ల దో చీ ని నీ ళ్లా డె గా నే

(౨) గ మా ప ధ పా । పా, ప మ ప మ । ప సాం సం ని ధ ప । ధ ప ప మ మ గ రి
నె ల త ల దో చీ ని నీ ళ్లా డె గా నే

గ మా ప గ పా మ గ । రి మ గ రి స స ని । సా, గా, రి । గా, , , , ,
కొ ల ని ద రి ని దొం గ కూ గూ గు

మ ప ధ ప మ గా మా । పా, ధ ని ని ప । ప సం ని గ రిం సం సం । ని సం ధ నీ సాం
ఒ లు వై న వు ట్ల పా లా ర గిం చీ ని

మ పా ధ ని సాం । ని ధా పా ధ ని । సాం ని పా, మ । ధ ప ప మ మ గ రి ॥ (గుఱు)
కొ ల ది మీ ఱి న దొం గ కూ గూ గు

ఇట్లే ఈ క్రింది చరణములు:

(౨) చల్ల లమ్మంగ - చనుకట్టు దొడికెని
గొల్లెతలను దొంగ - కూగూగు
ఇల్లిల్లు దప్పక - యిందఱి పాలండ్లు
కొల్లలాడిన దొంగ - కూగూగు॥ (గుఱు)

(౩) తావు కొన్న దొంగ - తగిలి పట్టండిదె
గోవులలో దొంగ - కూగూగు
శ్రీ వేంకటగిరి - చెలువుండో యేమొ
కోవిదు డగు దొంగ - కూగూగు ॥ (గుఱు)

లఘుటీక

అడవులలో ఒకానొక పక్షి 'కూ గూ గు ' అని మిశ్రగతితో కూకరించుట పల్లెవారందఱూ విన్నారు పల్లెపిల్లలు దానిని పల్లవిగా పెట్టుకొని పచ్చి పచ్చిగా పాటకట్టి పాడేవి కూడా కొందరు విని యుందురు ఆ పక్షిని చెళగుప్ప-చెంగాడు అని పిలుస్తారు కుక్కుభమని దీనికే పేరట (మా గురుబాల ప్రబోధిక) దాని ధ్వన్యనుకరణశబ్దాన్నే ముక్తాయిగా పెట్టుకొని వ్రాసిన నిందాస్తుతిపద మిది

కొలనిదరిని దొంగ = స్వామిపుష్కరిణీ తీరవాస
తావుకొన్న = స్థిరనివాస మేర్పఱచుకొన్న

ముద్రితపాఠము దాగేని, దోచేని ఇత్యాది ఇవి వ్యవహారనిరుద్ధరూపములు

నన్నిచోడ మహాకవి కవితా శిల్పము

(10 వ పేజీ తరువాయి)

సందర్భించునట్లుగా నొకచో చంద్రోదయ వర్ణనము చేసినాడు. ఆవర్ణనమునకు పూర్వ వచనములో నిట్లు కలదు 'ఇట్లనేకు లనేక ప్రకారంబులం గామకేళీలాలసు లగుచుండి రంత నక్కడ - హిమవంతుని నగరములోని పౌరుల, పౌరస్త్రీల కామకేళీకలాపము లంతకు మునుపు వర్ణింపబడినది. ఆ సందర్భమునకు సరిపడునట్లుగ, ఔచితీ విలసితముగ జేసిన యీ చంద్రోదయ వర్ణనము చూడుడు

తమ మను నీలవర్ణ పరి
ధానము వీడగ బూర్వశైల శృం
గములను నున్నతస్తన యు
గంబు దనర్ప జకోర బంధు వ
ర్గము ముద మొందగా నిజ
ముఖద్యుతి వెల్వగ నిందు గర్భ చి
హ్నము లభిరామమయ్యె నమ
రాధి పదిక్సతికిం గ్రమంబునన్.

(నన్ని - కుమా - అష్టమాశ్వాసము 105)

ఈ రసౌచితీ విలసిత రచనము జదివినవారు నన్నిచోడని ప్రతిభకు జోహారు లర్పింపక మానరు! తిక్కనసోమయాజియు నిట్టి యౌచితినే పాటించుచు కథాసంగతిసూచకముగా సూర్యచంద్రోదయాది వర్ణనల నచ్చటచ్చట చేసియున్నాడు. విరాటపర్వములోని యీ క్రింది పద్యము చూడుడు

ద్రుపదనందన పరిభవ దుఃఖమునకు
నుల్లమున దురపిల్లుచు నున్న సరసి
వేడి నిట్టూర్పులో యన వెడలె గ్రొత్త
తావి మూతులు విచ్చు నెత్తమ్మివిరుల.

(భార - విరాట - ద్వితీయాశ్వాసము)

పై సందర్భమునందలిదే నన్నిచోడని చంద్రవర్ణన పద్య మిది చూడుడు

రంజిల్లు పూర్వదిక్సతి కటిమణికాంచి
రంజిల్లు నాయక రత్నమొక్కొ
విలసిల్లు నద్దేవి వృత్త స్తనాంతరా
పూరిత కాశ్మీరపుంజ మొక్కొ
తనరారు నాహరి త్తరళాక్షి పరిపక్వ
బింబారుణాధర బింబ మొక్కొ
మేలిల్లు నబ్జాల ఫాలతటంబున
విలసిల్లు రోచన తిలక మొక్కొ
మవ్వ మొప్పదన సమాగమంబునకు నా
రమణివలన బర్వు రాగమొక్కొ
యనగ దరతరంబ తనరె నత్యరుణాంగ
భాతి గువలమైక బాంధవుండు

(నన్ని-కుమా-అష్టమాశ్వాసము—108)

ఈ పద్యము తొలిపాదములోని పూర్వార్ధమున యతి తప్పినది. ఉత్తరార్థమున నొక 'రంజిల్లు' ఉన్నది కాన యిచట మఱొకపదమేదేని యుండవలయును. మునుపు పేర్కొనబడిన పద్యమునకువలెనే యిదియును శృంగారవర్ణన సందర్భమునందలిదే యగుట నీ వర్ణనమును శృంగారాత్మకముగా నుండుట గమనార్హమైన విషయము! ఇందు మఱొక విశేషము కలదు పూర్వదిక్సతి తన శరీరమున నలంకారార్థము దాల్చు నలంకరణవస్తువులుగానే ప్రతిపాదమునను చంద్రు డుత్ప్రేక్షింపబడుట, యీ యలంకార వస్తువులును కటిమొదలు, కాంతాముఖము దనుక నారోహణ క్రమముగాకటి, స్తనములు, బింబాధరము, ఫాలతలము నను చోటుల దాల్పబడినట్లువర్ణించుట యిందలి విశేషము.

ఇది శృంగారాత్మకమైనచో దీనికి ప్రతిగా తిక్కన సోమయాజి వేదాంతార్థముగా పవిత్రముగా గాంచిన సూర్యోదయ వర్ణనమిది చూడుడు. చంద్రుడు రాగోద్దీపకుడైనచో సూర్యుడు—కర్మసాక్షి— ధర్మోద్బోధకుడు! అందుచేతనే మహాకవు లిరువురును చంద్రసూర్య వర్ణనముల నాయా రీతుల గావించిరి!

నీరజాకరములు నిష్పమై జేసిన
భవ్యతపంబుల ఫల మనంగ
దివసముఖాభినందిత చక్రయుగ్మకం
బుల యనురాగంపు ప్రోవనంగ
హరిహర బ్రహ్మ మహానుభావంబు లొ
క్కటి గాగ గరగిన గట్టి యనగ
నతుల వేదత్రయలతికా చయము పెను
పొంద బుట్టెడు మూలకందమనగ
నఖిల జగముల కన్నైఱియగుచు జన స
మాజ కరపుట హృదయ సరోజములకు
ముకుళనంబును జృంభణంబును నొనర్చి
భానుబింబంబు పూర్వాద్రిపై వెలింగె

(భారతము-విరాట-ద్వితీయాశ్వాసము)

నన్నిచోడని సూర్యోదయ వర్ణన పద్య మిది చూడుడు

రాజరుచి వాయ గువలయ రమణ దఱికి
కలయ దమ్ముల మొగముల నెలమి మిగిలె
శీతకరుడైన రాజువాసిన ధరిత్రి
వందు గా కెందు దాయలు వగతు రెట్లు

ఇట్టే 'తమ్ము'లను తమ్ముల (సోదరుల)నుగా వర్ణించిన ప్రభావతీ ప్రద్యుమ్నమునందలి పద్య మిది చూడుడు

తామరసలక్ష్మి లా చందమామరాక
గలుగుచును గుముదాలికై తొలగె నపుడు
తొలగు భావయె కాదె తమ్ముల వరించు
నట్టి సతులకు నతడు ము న్నెట్టిడైన

(ప్రభా - చతుర్థాశ్వాసము)

నన్నిచోడని కవితకు ఔచితి యొక దివ్యాలంకారము! ఔచితీశిల్పనిర్వహణములో నన్నిచోడడు అప్రమత్తుడు! దేవేంద్రుడు పరమేశ్వరునికి దండప్రణామము లాచరించి యాతని సంస్తుతించిన సందర్భములో నట్లున్నది

'అని నాగాభరణు నాగమురజ బంధంబుల బ్రస్తుతించి యక్కుమారుండు న న్నేలినవాడని యెఱుంగక యజ్ఞానభావంబున నాచేసిన యపరాధము సహింపవలయు '

పరమేశ్వరుడు 'నాగాభరణుడు' కనక యతనిని 'నాగము రజబంధము'లలో బ్రస్తుతింప జేయుటలో నన్నిచోడ డెట్టియౌచితిని బాటించినాడు! పైవచనమునకు ముందు 'నాగమురజ బంధములు' అని దిగువనొక కందపద్య మున్నది అది నాగబంధము కాదు, దానికి బూర్వపద్యము నాగబంధములో నున్నది కావున పై 'నాగము రజబంధములు' అనుశీర్షిక 'శరణు మహేశ భూరితర' యన్న నాగబంధ పద్యమునకు పై నుండవలయును ఆ నాగబంధపద్యములో గొన్ని స్ఖాలిత్యములు దొరలియున్నవి బంధము ను చిత్రించి చూడగా నా స్ఖాలిత్యములు తెలియ వచ్చినవి ముద్రణమున నన్న పద్య మిది

శరణు మహేశ భూరితర
చారు సుఖప్రద కామకాల సం
హర భవరోగదారణ సు
రాసుర వంద్య శరీరగుఃఖ దు
స్తర కమలాపహార హిమ
ధామ సమస్తగ సోమదేవ వి
స్తర తర మాదయారసయు
తా యురులబ్ధవిభావనామయా.

(నన్ని-కుమా-దశమాశ్వాసము 449)

పై పద్య మిట్లుండవలయును

శరణు మహేశ భూరితర
సార సుఖప్రద కామకాల సం
హర భవరోగదారణ సు
రాసుర వంద్య శరీరదుఃఖదు
స్తర కమలాపహార హిమ
ధాను సమస్తగ సోమదేవ వి
స్తరిత రమాదయారసయు
తాయురులబ్ధిప భావనామయా!

పై పద్యమున 'సారసుఖప్రద' యని, 'విస్తరితరమాదయా' యని 'యురులబ్ధిప' యని యర్థసంగతి కుదురునట్లు -బంధచిత్రణమున చిక్కులు రానియట్లు - సవరింపబడినవి.

పార్వతిప్రత్యంగవర్ణన సందర్భమునందలి యీ క్రింది పద్యము జూడుడు :

నడు మన దింతి చన్నుల త
నర్పున ముందుఱు గానరాదు, మా
కడుగిడు చోట గా ద్రిమలి
నంతన కాముకబింద మయ్యెడుం
దొడిబడ జేయు 'మావలన
దోసము' లేదని చెప్ప డాపెనా
గడు బెడగొందు గౌరి తెలి
కన్నులు వీనుల డాసి దేసియై.

(నన్ని-కుమా-అష్టమాశ్వాసము 16.)

ఇందు నేత్ర వర్ణనము ప్రసక్తవిషయము. ఆ వర్ణనమును విలక్షణముగ నొకానొక సంప్రదాయ సూచకముగ నన్నిచోడడు తీర్చినాడు

కన్నుల దృష్టి దోషము తగిలి నడుము సన్నగిల్లి పోయినదని యెవరో మేలోర్వని వారు పలికిరట! అందుచే నేత్రములు తమ నేరమేమియు లేదని, యది నట్టి కట్టుకథయని, అపనింద యని వీనులతో తమ నిర్దోషిత్వమును చాటి చెప్పికొనుచున్నవి!

'చన్నుల తనర్పుచే మాకు నడు మెక్కడ కనపడును? అసలు నడుము కనపడుటకు నవకాశమే లేనప్పు డిక దృష్టిదోషము మాట యెక్కడిది? ఇక నడుమసదని మీ కెట్లు తెలియ వచ్చినదని యడుగుదురేమో! ఈ కాంత యిదుగుసపై నడుగు వేయుచు నడమనప్పుడే నితంబ భారముచే నామె నడుము 'విఱిగిపోయినది' నడుము విఱిగి యామె కూలబడుటచే మా కా విషయము తెలియవచ్చినది కాని 'మావలని దోసము'—దృష్టిదోషము—ఆవంతయు లేదని చెప్పుటకు గౌరి తెలికన్నులు, వీనులకు సమీపించినవి ఇందు గౌరినేత్రముల యాకర్ణాంత విశాలత చమత్కారముగా, సకారణముగా సమర్థింపబడినది.

ఈ 'దృష్టిదోష' విషయమే భారతమందును బ్రస్తావింపబడినది కీచకుడు మోహపరవశుడై ద్రౌపదికడ కేగి యామె స్వరూపాదికము నభివర్ణించు పట్టులోని యీ పద్యపాదమును చిత్తగింపుడు

'సుదతి నీమై జక్కజూచుట కోడెద
గనుబాటు వొరయునో యని తలంచి'

(భారతము - విరాట - ద్వితీయాశ్వాసము)

'నీవు - తప్పజూచిన - లోకములు చెడునని పలుకుదురు. నీవు - చక్కజూచినను - మన్మథుడు చెడెను ఇది యాశ్చర్యము ' అని బృహస్పతి మన్మథుని పునరుజ్జీవనమునకై ప్రార్థింప పరమేశ్వరుడు ప్రసన్నుడై మన్మథు నుజ్జీవితు జేసెను అప్పుడు రతిపతి తనపతి ప్రోల నిలిచిన విధము

మలయుచుం బొలుపారు మలయకేతనముతో
నెలరారుగెందలి రెల్లిగ్రాల
దళుకొత్తు నెత్తావి యల రంప పొదులతో
మేలిల్లు నించు వి ట్గలనవుర
జెలరేగు నలిపిక కుల నినాదములతో
రాజకీరాలాప రవము లువియ
వేచి సమ్మదలీల వీచు తెమ్మెరలతో
నలివసంతుడు గూడి నడవ నొండి
కామసుఖములతో బూర్వకామకేళి
కామచిహ్నలు మెలుసురంగంబుగాగ
నెఱయ గైసేసి జవనిక దెఱచి వచ్చు
చెలువుతో వచ్చి రతిప్రోల నిలిచె మరుడు

(నన్ని - కుమా - నవమాశ్వాసము 246)

పరమేశ్వరుని గౌరీప్రీతునిగా జేయ నింద్రడాజ్ఞాపించి పంపునప్పటి మన్మథుని నాచన సోమునియుత్తరహరివంశములో జూడుడు

మకరంద మాని మైమఱచిన గొనయంబు
వెడ్రమోయ గడివోని వింటి తోడ
జలజకేసరరాజి జల్లెడె నూకగా
దాటు వరారి రథ్యములతోడ
గర్ణికాళపు మొగ్గ కనకంపు గుబ్బగా
గోయిలనూరూర గొడుగుతోడ
రతి కన్నుగవమచ్చరము సేయు టెక్కెంబు
వడక వీతెంచు సేవకులతోడ
వలపుమూపులు కరసాన వాడిచేసి
మందు నెలతోడ దన మేనమామయైన
నిండు నెలతోడ వలరాజు నిర్జరేంద్రు
సభకు నేతెంచె భుజబలోత్సాహ మెసగ.

(ఉత్త - హరి. ద్వితీయా 194.)

మన్మథ వర్ణనములో నీరెండు పద్యములును పోటీలు పడుచున్నవి! నన్నిచోడని మన్మథుడే కాదు, అతని కవితయు, లోకమును ముగ్ధమునుగా జేసినది!

ఇట్టి లోకవశీకరణ గుణకయియే యతడు కృత్యవతరణికలో మన్మథస్తుతి చేసినాడు. చూడుడు

హరుడాదిగ సకలచరా
చరమయ జీవాళి నెల్ల సతతము గామా
తురులుగ వలగతిజేసిన
మరు డీపుత మఖిలవశ్యమతి మత్కృతికిన్

(అవతారిక 9)

విజ్ఞానవార్తలు

క్రొత్తగా కనుగొన్న పెనిసిలిన్ ఔషధమునకు గూడ చావని సూక్ష్మజీవు లున్నవట ఇవి పెనిసిలిన్ హతమార్చే స్టాఫిలో కొక్కి (*Staphylococcus pyogenes*) అనే జా సూక్ష్మజీవులలోనే 12½% ఉన్నవట.

* * * *

పరమాణు భౌతికశాస్త్రం(*Atomic Physics*) పాఠశాలలలో విద్యార్థులకు బోధించుటకు ఒక ఫిల్ము తీయబడినది ఇది వెండి తెరపై ఎనభై నిమిషములలో ప్రదర్శింపబడును. దీనిలో పరమాణు వాదము (*Atomic Theory*) మొదలుకొని, హీరోషిమాలో బాంబు పడు వరకు ప్రదర్శింపబడును కడపటి డాక్టరు కాక్రాఫ్ట్, మరియు ప్రొఫెసరు ఐన్‌స్టీను పరమాణు శక్తి యొక్క శాంతి కాలపు ఉపయోగము చర్చించెదరు

* * * *

1947 సం॥ ఫెబ్రవరి నెలలో ఆస్ట్రేలియాలో కృత్రిమముగా వర్షము (*Artificial Rain*) కురిపింపబడినది భూమికి 11,000 అడుగుల ఎత్తులోనున్న ఒక పెద్ద ముద్ద మేఘము (*Cunulus cloud*) పై విమానములనుండి ఘనీభవించిన అంగారామ్లవాయువు (పొడి మంచు గడ్డ=*Dry ice*) వేసిరట. అర్ధగంటలో ఇరవై చదరపు మైళ్ల వైశాల్యముగల నేలపై కుంభవృష్టి కురిసినదట

* * *

'తేనె' పిట్ట

అబిసీనియాలో తేనెనే తిని జీవించే పిట్ట ఉందట ఇది ఒక తేనె గూడు చూచిన వెంటనే దగ్గరనున్న ఒక గ్రామమునకు వెళ్లి ఆ గ్రామస్థులను కొన్ని సంజ్ఞలతో తేనె గూడు వద్దకు తీసికొని వచ్చునట వారు తేనెటీగలను తోలి తేనె సంగ్రహించి, కొంత తేనెపిట్టకు పారితోషిక మిచ్చెదరట!

* * *

పూర్వము ఎస్కిమోలలో, పుట్టిన ఆడశిశువు లన్నింటినీ చంపివేసేవారట. సంసారమునకు బరువైన ముసలాళ్లు ఆత్మహత్య చేసికొనే వారట ఇది ఆహారము చాలక వా రవలంబించిన ఆచారమట!

'రాము'

సచివోత్తములు :

తరిగొప్పుల దత్తనామాత్యుడు

శ్రీ కోన వేంకటరాయశర్మ

[క్రీ. శ. ౧౬ వ శతాబ్దమున 'చంద్రగిరి' రాజధానిగా నేలిన వీరవేంకటపతిరాయల ప్రధాన మంత్రి]

ఇతడు ఆఱువేల నియోగి బ్రాహ్మణ శాఖలోనివాడు మధ్వమతము నవలంబించిన స్వతంత్ర కపిస (కౌశిక) గోత్రుడు తండ్రి నరసామాత్యుడు తల్లి తిప్పాంబ సత్తెనపల్లె తాలూకా యందలి 'రాజనాపుర' వాస్తవ్యులని "కొండవీటి దండకవిలె" వాకొను చున్నది ఈ శాఖవారు కొందఱు పూర్వము విజయ నగరము లోనగు దూర ప్రదేశములకుం జని యచ్చట రాజకీయాది పదవుల నంది నత్యున్నత స్థితి నధివసించి ప్రసిద్ధి వడసిరి. వారిలో గొందఱు మధ్వమత మవలంబించిరి కావున వీరిని నాఱువేల నియోగి మాధ్వు లన జెల్లును ఇట్టివారిప్పటికిని దిరువనంతపుర(*Travancore*), మహీశూర (*Mysore*), రాజ్యములలో ననేకులు గలరు. పూర్ణయ్యమంత్రి యీ శాఖా బ్రాహ్మణుడే!

విజయనగర చక్రవర్తి యగు వీర వేంకటపతి రాయల యొద్ద దత్తనామాత్యుడు కార్యకర్త (*Prime Minister*—)ప్రధానామాత్యుడు) గ నియుక్తు డయినట్టు 'చంద్ర భాను చరిత్ర" మందలి—

వెలయు
దత్తన మంత్రి మహా విపక్ష దు
ర్మద బల మర్మదాభరణ ధు
రంధర సంగర చాతురి విశా
రదు డగు వేంకటక్షితి పు
రందరు నప్రతిమాన రాజ్యసం
పదలు భరింప నాకు లిడు
భవ్యగతి శ్రితపారిజాత మై"
(ప్ర ఆ; ౩౮ ప)

—అను పద్య మవగతి మొనర్చు చున్నది క్రీ శ ౧౫౭౬ వ సం॥రము మొదలుకొని క్రీ. శ ౧౬౧౪ వ సం రము వఱకు వేంకటపతి రాయలు రాజ్యము సేసినాడు గావున నాతని ప్రధానామాత్యు డగు దత్తన మంత్రియు నక్కాల మందే తేజరిల్లె ననట యుక్తము

'వసుచరిత్ర' కృతినాథు డగు తిరుమల రాయల కొమాళ్లలో నాలవవాడే యీ వేంకటపతి రాయలు. అళియ రామరాయల సోదరుడు తిరుమల రాయలు క్రీ శ ౧౫౬౫ దవ సంవత్సరమున బ్రవర్తిల్లిన 'తాళికోట' యుద్ధములో రామరాజు సనిపోయిన తర్వాత దిరుమల రాయలు సదాశివరాయని ముఖ్య మంత్రిగా నుండి క్రి శ ౧౫౭౦ దవ సంవత్సర ప్రాంతమున సదాశివ రాయలు సనిపోగా దిరుమల రాయ లా రాజ్యము నాక్రమించి మూడేడులు మాత్రము పరిపాలించెను ఆవల నితని రెండవ కొమారు డగు శ్రీరంగరాయలు క్రి శ ౧౫౭౨ వ సంవత్సరమున రాజ్యమునకు వచ్చి నట్టు శాసనా ద్యాధారము లగపడుచున్నవి

తల్లికోట యుద్ధము (*Battle of Talikota*) జరగిన తర్వాత దురుష్కులు విజయనగరము పై దండెత్తి దానిం గొల్లగొట్టి బుగ్గియొనర్చి యుండుటచే దిరుమల రాయలు 'పెనుగొండ' (అనంతపుర మండలము) ను రాజధానిగా జేసికొనియెను ఇతని యనంతర మీతని రెండవ కొమారుడు శ్రీరంగరాయలును, నాలవ కొమారుడు వేంకట పతిరాయలును రాజ్యము సేసిరి శ్రీరంగరాయని పరిపాలనా కాలములో బిజాపుర నవాబులు 'పెనుగొండ' ను లాగికొనుటచే 'జంద్రగిరి' శ్రీరంగరాయనికి రాజధాని యయ్యెను. వేంకటపతి రాయలు పరిపాలనమునకు వచ్చునప్పటికి "చంద్రగిరి" యే రాజధాని వీర వేంకటపతి రాయల కాలములో 'వేలూరు' రాజధానిగా నేర్పడియె నని—

"తనకు వేలూరు వర రాజధాని గాగ
వీర వేంకటపతి రాయ విభుడు మిగుల
ధరణి బాలించె ధర్మ తత్పరత జెలగి"

—అను 'రామరాజీయ' పద్య మవగత మొనర్చు చున్నది. నాటినుండి యది 'రాయల వేలూరు' గా జెన్నలరుచున్నది

క్రీ శ ౧౫౭౪ వ సంవత్సరమునకు ముందే తిరుమల రాయని పరిపాలన మంత మయ్యెను గాన నతడు కృతినందిన 'వసు చరిత్రము' క్రీ. శ. ౧౫౭౨ వ సంవత్సరమున రచింపబడి యుండు ననియు, నీ గ్రంథరచనానంతరము ముప్పదేడులకు మల్లన కృత "చంద్రభాను చరిత్రము" రచింపబడి యుండు ననియు దెల్ల మగు చున్నది

తిరుమల రాయలు బ్రదికి యుండగనే కొమాళ్లచే గొన్ని తావుల నేల్బడి సేయింపుచు, దాను విద్యాగోష్ఠీ వినోదము లంగొ నిరంతర ముండుచుండె నని "నమదరి నృపమాళి స్తోమ నీరాజితాంఘ్రిః" — అను శ్రుతిరంజనీ పద్య చరణ మవగత మొనర్చు చున్నది వేంకటపతి రాయలు—

"ద్విజరాజ కార్శ్యము దీర్చు నీ విభుకీర్తి
ద్విజరాజ కార్శ్యము దీర్చు టరుదె
యాజి భవస్ఫూర్తి నడరు నీ నృపుశౌర్య
మాజి భవస్ఫూర్తి నడరు టరుదె
యతి సురభిఖ్యాతి నలరు నీ ఘను నీగి
యతి సురభిఖ్యాతి నలరు టరుదే
చంద్రగోత్ర శ్రీ లొసంగు నీ పతికల్మి
చంద్రగోత్ర శ్రీ లొసంగు టరుదె
యనుచు బుధు లెన్న వలయు రాజాధిరాజ
రాజ పరమేశ సకల కర్ణాటకాంధ్ర
రాజ ధౌరేయ తిరుమల తనయ
చంద్రు డగు వేంకటపతి క్షితీంద్ర మణికి
"సర్వతోముఖ వృత్తి బర్వ నార్వ మహాగ్ని
యును జెల్ల సింధుదేశోద్భటంబు
దీర్ఘకాలస్ఫూర్తి దీపించు విలయాగ్ని
జెడిద మెల్లను సమిపేత శకంబు
భీమరోషోద్వృత్తి బెనుపొందు ఘాలాగ్ని
పెం పెల్లను విదేహ భీషణంబు
బహుసత్త్వ భీకర ప్రౌఢి బొల్చు దవాగ్ని
తేజ మెల్లను విమర్దిత పనాయు
సహహా యని సింధు శక విదేహక వనాయు
లాదిగా గల నిఖిల దేశాళి నెల్ల
రాయిడించునె తిరుమలర య వేంక
టావనీంద్ర భుజప్రతాపాగ్ని కరణి"
"రమణీయాత్మకర ప్రరూఢ వసుధా
రాలాభనం దద్భధో
త్తమ నిత్యాన్న వితీర్ణి సర్వ సుమనో
దైన్యంబు వారింప భూ
రమణీ ధేను గజేశ్వరాత్మక బహు
శ్రీ లిచ్చు శ్రీ వేంకటే
శ మహీవల్లభు సాటియే నిధుడు ద
జ్జన్మక్రియా కర్తయుఙ్"
"మిథ్యాభిమాన సమ్మిళితుల విసరణ
కలితోత్తరంగులగా నొనర్చు
గలనైన ధర్మకౌశలము నేమఱని వా
రలకు హేమాద్రి మార్గంబు దెలుపు
నతినయ జ్ఞప్రాభిరతుల వీక్షించి చిం
తామణి హస్తగతంబు సేయు
బ్రబల తంత్ర విచారపారీణు లగు వారి
దొరసి ప్రాభాకర సరణి జూపు
దత్త దధికారులకు నిట్లు త దుపయోగ్య
గతుల గఱపెడు గురు నై యఖండ సమర
విజయ వేంకటపతిరాయ భుజకృపాణ
మఖిల దర్శనాద్భుతశక్తి నతిశయిల్లు"
"ధీరవతంస వేంకటప
తి త్రుటి తారసితాత పత్త్రము
ల్భూరి జవంబునం దిరుగు
బోరుల ద జ్జయలక్ష్మికిం దిగం
భోరుహనేత్ర లెత్తు తెలి
ముత్తెపు టారతి పళ్లెరంబు లై
చారు తదీయ హేమ కల
శంబులు దీవియ లై వెలుంగగన్."
"వేంకట భూవరుం జెనకు
వీరులు తూఱగ నైన గంటితో
బంకరుహాప్త బింబము వి
భాసిలు నాజి నస్ఫుగ్గ రంబులన్
సంకుల వృత్తి ద ద్వరణ
సంభ్రము సంభ్రమ దాదితేయ తా
టంకవతీ పదాంబుజ హ
రచ్యుత నూపుర రాజమో యనన్"

—ప్రసిద్ధి గాంచెను. ఇ వ్వేంకటపతిరాయల దయావీక్షాగౌరవమున నతిశాశ్వత లక్ష్మీ వైభవము గాంచిన 'తరిగొప్పు' లాన్వయమున భూజనశ్రేణి సంభావింప మల్లన నాగమ్మల గర్భశుక్తి ముక్తాఫలంబన, దన ప్రభావ భావములు ధర ననంతకృతి సమాసాదనంబున దేజరిల్లెడి 'నరసయామాత్యుడు' జనియించెను. ఇతడాశ్రిత బాంధవావన పరుడు. బుధానంద ప్రదానూన దానరసామాన్య యశోవిశోభితుడు. దిగంతశ్రేణి గంధర్వ కిన్నర సామా త్యభిరామ శుద్ధతర గాంధర్వైక సంస్తుత్యుడు అనంతపద చింతాపావనుడు అట్లని 'చంద్రభానుచరిత్ర' మందలి—

"తన నిశాత కృపాణియును బాణియును బతి
శ్లాఘా ధురా నిరాసము ఘటింప
దన కరుణా సారమును సారమును నరి
శాసనస్మయ వివాసనము చలుప
దన సద్గుణ నికాయమును గాయమును సుధా
కిరణ విస్ఫురణ ధిక్కృతి యొనర్ప
దన మనీషా భోగమును భోగమును సుధాం
ధః ప్రధానావధూననము దెలుప
దన ప్రభావంబు భావంబు ధర ననంత
కృతి సమాసాదనంబున దేజరిల్ల
వఱలు నాశ్రిత బాంధవావన పరుండు
మంత్రి మాత్రుండె నరసయామాత్య వరుడు.
"చతురాస్యావన పాళిక స్మెలగు నం
చ త్పొందు పద్మాసన
స్థితి దీపించు వినిర్మలాంబర రుచి
శ్రీమించు హంసాళి న
ప్రతిమానోన్నతి దోప నాడు దిలకిం
ప న్శుద్ధ వర్ణాధిదే
వత గాదే నరసప్రధానమణి దీ
వ్యత్కీర్తి యత్రాంతమున్
"నరసామాన్య చరిత్రుడే ధర బుధా
నంద ప్రదానూన దా
న రసామాన్య యశోవిశోభిత దిగం
తశ్రేణి గంధర్వ కి
న్నర సామా త్యభిరామ శుద్ధతర గాం
ధర్వైక సంస్తుత్యు డౌ,
నరసామాత్యవరుం డనంతపద చిం
తా పావనుం డెంతయున్."
(ప్ర ఆ, ౫౧, ౫౫, ౬౦ ప)

—అను పద్యము లవగాహ మొనర్చు చున్నవి ఇతని యర్ధాంగి "తిప్పాంబ" విజిత భర్తృ దేవతాజన నికురుంబ అన్నదానమున, సద్గురు పరిచర్యను, బంధురక్షను, ఆర్త సంరక్షణమున, శీలస్ఫూర్తిని, బరమ ధర్మాసక్తిని, నిత్య సూనృత యుక్తిని, నతుల భాగ్యలక్షణమున, గారుణ్య వీక్షణమున, — బేర్మిక గాంచి సకలసన్నుత చర్య యని యనిపించి కొనిన దని—

"వెలయు నాతని దేవేరి విజితభర్తృ
దేవతాజన నికురుంబ తిప్పమాంబ
బహు మహాభోగముల నుంచు భర్తకు దల
వంపు లొనరించిన ధరిత్రి పెంపు దెగడి.
"సకల సన్నుత చర్య సద్గురు పరిచర్య
పావన యదువర్య పదసపర్య
యన్నదాన ఖ్యాతి యనఘ సాధ్వీనీతి
నియతార్యజన తాతిశయ వినీతి
బంధురక్షా శక్తి పరమ ధర్మాసక్తి
నిత్య సూనృత యుక్తి నిర్మలోక్తి
యాశ్రితాశాపూర్తి యలఘుశీలస్ఫూర్తి
బహు సతీముఖవర్తి భవ్యకీర్తి
యార్త సంరక్షణంబును నతుల భాగ్య
లక్షణంబును గారుణ్య వీక్షణంబు
సహజసిద్ధంబు లీ పుణ్యచరిత కని ను
తింప బొగడొందు నరసయ తిప్పమాంబ
"గురు పరిభూతి లేని సతి
గోత్ర భర స్థితి లేని యుర్వి సో
దర పరిపాలనా విముఖ
ధామ విహారము లేని కల్మి బి
త్తరి యని బాంధవాశ్రిత వి
తానము సన్నుతి సేయ బొల్చు నా
నరసయ 'తిప్పమాంబ' భువ
న స్తవనీయ గుణావలంబయై

—అను పద్యము లవగత మొనర్చు చున్నవి. ఇ పుణ్య దంపతులకు ౧. అప్పన, ౨. దత్తన, ౩ మల్లన యను వార లుదయించి రని—

"అత్రి ప్రాభవు డా నృసింహు డనఘూ
యాత్యంత సంస్తుత్య చా
రిత్ర శ్రీనిధి తిప్పమాంబ వలనం
బ్రీతి న్బుధానీక ని
త్య త్రాణైక ధురీణు నప్పవిభు నే
త్రానంద పూర్ణేందు ద
త్తాత్రేయాహ్వయు మల్లికార్జునుని నా
ర్యాసక్తి, గాంచె న్మహిన్"

—అను పద్యము విదితము సేయు చున్నది. అందప్పన విభుడు 'నిరతాన్న దాననిధి' యని—

"అనవరతాన్న దాన నిధి
యా నరసప్రభు నప్పనార్యు నీ
డన దగునే సుతా పరిచ
యంబున వేల్పుల కొక్కనాడు భో
జన మతిశీతలం బిడిన
సాగరరాజు బడింట నైదిటన్
ఘనరుచి దక్క నొక్కొకని
గ్రాస మొసంగు తుషార భానుడున్."

—అను పద్యము సువిదిత మొనర్చు చున్నది. అంతియ కాక ఇత డాశ్రిత ద్విజనాయకావను డై, తదిష్టైక సంపద నొడగూర్చు లోకబంధు డని—

"తన దిక్కు జేరు మిత్త్రునకు దేజము మించ
దగు సర్వమంగళోత్పాదకుండు
ఘనుల నానా దిగాగతుల గైకొని పూర్ణ
జీవనం బొసగు లక్ష్మీగురుండు
వర ధర్మమున గోత్ర వర్గంబు తావు
లెనయించి నిలిపిన ఘన సమాఖ్యు
డాశ్రిత ద్విజనాయకావనుం డైత ది
ష్టైక సంపద గూర్చు లోకబంధు
డరయగ బ్రధాన మాత్రు డే యఖిల వినుత
మాధ్వదర్శన ధౌరేయ మాన నియమ
పరమ హరిగురు చరణాబ్జ భజన పరుడు
మంత్రి నరసయ్య యప్పనామాత్య వరుడు"

—అను పద్యము రూఢ సేయు చున్నది. ఇతని తమ్ముడే దత్తనామాత్యు డని—

"త దనుజ రత్న మై వెలయు
దత్తనమంత్రి మహావిపక్ష దు
ర్మద బలమర్మ దారణ ధు
రంధర సంగర చాతురి విశా
రదు డగు వేంకట క్షితిపు
రందరు నప్రతిమాన రాజ్య సం
పదలు భరింప నాకు లిడు
భవ్యగతి శ్రితపారిజాత మై."

—అను పద్యము దెలుపు చున్నది

దత్తనామాత్యుడు తిరుమల రాయేంద్ర భూరి పుణ్యరాశి యగు వేంకటోర్వీశు బ్రాయ సములు బ్రాయు చాతుర్యమున నిజస్వామి హిత విధాన సుర మంత్రి యనియు, ద్వీపాంత ర్నృపాకర్షణ స్ఫురణుం డనియు—

"వర్ణంబులనె కాదు వరస్ఫూర్తితా స్ఫూర్తి
సన్నుతోభయ వంశ జనులయందు
బత్రంబులనె కాదు పంక్తిశోభ సదా ప్ర
దీయమానాన్న భుగ్ద్విజులయందు

(22 వ పేజీ చూడుడు)

భాషారాష్ట్ర సంఘ నివేదిక

భాషారాష్ట్ర ఆదర్శమే పనికిరాదని సూచన

నాల్గురాష్ట్రముల సరిహద్దుల విషయం ప్రస్తావించుచూ, సరిహద్దు జిల్లాలు ఏక భాషా ప్రాంతములుగాక ద్విభాషా ప్రాంతములుగా నుండుటచే, యీ జిల్లాలతో వ్యవహారం విషయంలో యిబ్బంది ఏర్పడునని, తిరువాన్కూర్ కొచ్చిన్ సంస్థానములతో కలుపకుండా మలబార్ జిల్లా ప్రత్యేక రాష్ట్రముగా ఏర్పడుట సాధ్యముగాదని, కర్ణాటక మైసూర్ కలయిక ఉభయులకు శ్రేయస్కరమని, మహారాష్ట్రమును ప్రత్యేక రాష్ట్రముగా నిర్మించవలెనను ఆందోళన యిటీవలిదే గనుక దీని విషయమై ఏ శిఫార్సు చేయవీలులేదని తెలిపిరి.


భాషా ప్రయుక్తముగా రాష్ట్రముల నిర్మించినట్లైతే, యే ఒక్క రాష్ట్రము గూడా ఆర్థికముగా స్వయం పోషకము కాదని, మద్రాసు రాష్ట్రమున కన్నా మంచి రాష్ట్రము కాలేదని, అదిగాక భాషా ప్రయుక్తముగా అగు క్రొత్త రాష్ట్రములను నిర్మించి, ప్రత్యేక ప్రభుత్వములు పరిపాలనా యంత్రములు నెలకొల్పుటవల్ల విపరీతమైన ఆర్థిక వ్యయమును నూతన రాష్ట్రములు భరించవలసి వచ్చునని, యీ వ్యయభార మంతా పన్ను చెల్లించు ప్రజలపై పడునని, దీనితోడు అరు నూత్న రాజధానీ నగరముల నిర్మించవలసి వచ్చుటచే, వ్యయము మరింత హెచ్చి ద్రవ్యోల్బణ స్థితి విషమించునని, క్రొత్తగా అల్పసంఖ్యాక సమస్య యొకటి ఉత్పన్నమగునని, సరిహద్దుల నిర్ణయ విషయంలో గూడా వైషమ్యములు పొడసూపునని కమీషన్‌వారు వెలవిచ్చిరి

కమీషన్ నియోగము

'1947 నవంబర్ నెలలో రాజ్యాంగ పరిషత్తులో చర్చ పర్యవసానముగా రాజ్యాంగ నిర్మాణసంఘం చేసిన శిఫార్సు ఫలితముగను భాషా రాష్ట్ర నిర్మాణ సాధ్యాసాధ్యముల విచారణకు యీ కమీషన్ పరిషదధ్యక్షునిచే నియోగింపబడెను. ఈ కమీషన్ అధ్యక్షుడు శ్రీ యస్ కె దార్, యీయన యింతవరకు అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసెను. కమీషన్‌లో మిగతా సభ్యులు, డా॥ పన్నాలాల్, (ఇదివరకు యు పి గవర్నరు సలహాదారు), శ్రీ జగత్ నారాయణలాల్ (రాజ్యాంగ పరిషత్సభ్యులు), కమీషన్ కార్యదర్శి బి సి. బెనర్జీ వీరికి సహాయభూతులుగా సమాలోచనలలోనూ, సాక్ష్యస్వీకరణలోనూ పాల్గొన్నవారు, రావు కృష్ణారావు, రామలింగం చెట్టి, నారాయణమీనన్‌తో, పూరి సుబ్రహ్మణ్యం, కె యం మున్షీ, ఆర్. ఆర్ దివాకర్, హెచ్ వి పటాస్కర్, గోపీలాల్ వాత్సవగారు కమిషన్ జులై 19 న పని ప్రారంభించి, ఆయా రాష్ట్రములలో పర్యటించి భాషారాష్ట్ర నిర్మాణ సమస్యపై తగు శిఫార్సులు చేయుటకు వలయు సాక్ష్యమును సేకరించెను. ఆంధ్ర తమిళనాడు కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, కొంకణ, సి పి బీరార్‌లలో పర్యటన సందర్భమున 6700 మంది సాక్షులను విచారించి, వెయ్యి వ్రాతపూర్వక విజ్ఞాపనలను అందుకొన్నది కమీషన్ సభ్యులు ఆఖరు సమావేశము నవంబరు 21 న జరిపి ఏకగ్రీవాభిప్రాయంతో తయారు చేసిన తమ నివేదికను డిసెంబర్ 10-వ తేదిన పరిషత్తుకు అందజేసిరి.

నివేదిక సారాంశము

భాషా ప్రయుక్తముగా ప్రత్యేక రాష్ట్రములు నిర్మింపబడవలెనని కోరిన ఆంధ్ర కర్ణాటక, కేరళ, మహారాష్ట్రముల విషయమే మొదటగా అభివర్ణించుచూ, కమీషన్‌వారు తమ నివేదికను ప్రారంభించిరి



భాషారాష్ట్ర విచారణసంఘ సభ్యులు మద్రాసు వచ్చినపుడు తీసిన ఫోటో. అధ్యక్షులు ధార్ మధ్య నిలబడి ఉన్నారు

భాషా ప్రయుక్తముగా రాష్ట్ర పునర్విభజన జరుగుట కనుకూలత తెలుపుచూ, 1921 లగాయతూ కాంగ్రెస్ అప్పుడప్పుడు చేసిన ప్రకటనలను, వాగ్దానములను ఉదహరించుచూ, కాంగ్రెసు వాగ్దానములు చేసినప్పటికి, యిప్పటికి దేశ పరిస్థితులు యెంతో మారినవని, కనుక ప్రస్తుత దేశ పరిస్థితులలో యీ వాగ్దానముల నెరవేర్పుల సాధ్యముగాదని, భారతదేశమును, సుస్థిరముగా నిర్మించుటే యిప్పుడు ఎప్పుడూ గూడా ప్రథమ కర్తవ్యముగా నుండవలెనని, కమీషన్‌వారు ఉద్ఘాటించిరి

"యావద్భారత దేశమునకు తయారు చేయబడుచున్న నూతన రాజ్యాంగము, తక్షణ పరిష్కారంకొరకై వేచియున్న వివిధ సమస్యలు, కోట్లాదిని గూడా, పై అంశమున, అనగా భారతదేశమును పటిష్ఠ జాతిగా నిర్మించుటనే ప్రధానకర్తవ్యము దానిని, దృష్టి నుంచుకొని వర్తించవలెను. జాతీయాభివృద్ధికి దోహదమొసగు ప్రతిదానిని ముందుకు సాగనీయవలెను. జాతీయాభివృద్ధికి అంతరాయము కల్గించునట్టి ప్రతిదానిని త్రోసివేయవలెను లేదా నిలిపి ఉంచవలెను. ఈ ముఖ్యాంశమును, యీ ప్రధాన సూత్రమును దృష్టి నుంచుకొనియే మేము భాషారాష్ట్ర నిర్మాణ సమస్యను పరిశీలించితిమి కాగా, యీ సూత్రమును బట్టి పరిశీలించగా భాషారాష్ట్ర నిర్మాణము ఉపయుక్తము గాదని, యీ నిర్మాణ వాంఛను సాగించవీలులేదని తేలినది. ఒకసారి భాషా ప్రయుక్తముగా రాష్ట్ర పునర్నిర్మాణము జరగవలెనను సిద్ధాంతమును అంగీకరించితిమా, ఈ పునర్నిర్మాణమునకు అంతమనునది యుండదు, యావత్తు దేశము ఛిన్నాభిన్నము కావలసి వచ్చును

భాషారాష్ట్ర నిర్మాణవాంఛ

ఏ ప్రాంతమైనా ప్రత్యేక రాష్ట్రముగా నిర్మించుటకు, భౌగోళిక సంలీనత, ఆర్థిక స్వాయంపోషకత్వము, [illegible] పొందగలగుట, ప్రజాభిమతము అవసరము అసలు భాషారాష్ట్ర నిర్మాణ వాంఛ జనించుటకు రెండు కారణము లున్నవి ఒకటి, భాషావర్గములు, ఉపజాతులు, (సబ్‌నేషన్స్) అందుచేత భారత సమాఖ్య కేంద్ర ప్రభుత్వముల ఉనికి, అధికారములకు మూలాధారమైన రాజ్యాంగ వ్యవస్థలో, ఒప్పందంగలవే యీ ఉపజాతులని, రెండవది, యిప్పటివున్న రాష్ట్రములు పరిపాలనకు అందుబాటులో లేనంత విశాలమైనవిగాను, భిన్నభాషావర్గ సంకలితముగాను ఉన్నవని, పరిపాలనా విషయమై, ముఖ్యముగా శాసనసభలు విద్య మొదలగు విషయంలో యిబ్బందులు కలుగుచున్నవని; కాని, భాషాప్రయుక్త రాష్ట్రనిర్మాణమునకు ప్రాతికూల్యము చూపే వాదములనుబట్టి, భాషా ప్రయుక్తముగా నిర్మితమైన రాష్ట్రములలో భిన్నభాషలాడే అల్పసంఖ్యాకవర్గం [illegible] అసహనము పెంపొందగలదు, సంకుచిత దేశాభిమానము ప్రబలును, సరిహద్దుల నిర్ణయం విషయంలో, ముఖ్యంగా బొంబాయి, మద్రాసు నగరముల విషయంలో వైషమ్యము ప్రబలగలదు భాషాప్రయుక్త రాష్ట్ర నిర్మాణవాంఛ ప్రజాబాహుళ్యములో బాగా పాదుకొని పోయినది, కనుక యీ రాష్ట్రముల నిర్మాణము తక్షణము జరుగకపోయిన, వాయిదా వేయుటవలన వైషమ్యము అపాయము, అశాంతి అగును జనించునని, తత్ఫలితంగా నిర్మాణాత్మకమైన కృషికి దేశము పూనుకోలేదని కొందరి వాదన; బాహ్య సవాలునుండి దేశము యింకా విముక్తి కాలేదని, బ్రహ్మాండమైన ఆర్థిక పరిస్థితి ఎదుర్కొనుచున్నదని, సంస్థానముల సంఘటితపరచు కృషి పూర్తి కాలేదని, యింతవరకు తక్షణ పరిష్కారం కోరు సమస్యలలో ప్రభుత్వము నిమగ్నమై యున్నదని, నూతన రాష్ట్రముల నిర్మాణముల వల్ల కలిగే ఆర్థిక, పరిపాలనా విషయకమైన బరువు భారములను యీ తరుణంలో దేశము మోయలేదని, మరికొందరి వాదన"

బొంబాయి మద్రాస్ నగరముల సమస్య

"బొంబాయి మద్రాసు నగరములలో జనాభా ఒకే భాష మాటాడువారు కాక పోవుటే గాక, ఏ ఒక భాషను మాట్లాడే ప్రజలైనా అధిక సంఖ్యాకులుగా లేరనే మా అభిప్రాయము అవి అన్ని విధములా, బహుభాషా నగరములని చెప్పవచ్చు. ఈ నగరములు రెండు, తమ తమ సంధానాలలో ఒకరకమైన సమష్టి జీవితమును పెంపొందించుకొన్నవి కొద్దో గొప్పో యావద్భారత ప్రాముఖ్యంగల నగరములవి.

కనుక, యీ నగరములను ఏ ఒకభాషా రాష్ట్రములోనూ కలిపివేయుట ఉచితము గాదని, వాటి శ్రేయస్సును, యావద్భారతదేశ ప్రయోజనములను తగినవిధంగా వాటి విషయం ప్రత్యేకముగా ఆలోచించవలెనని మా అభిప్రాయం."

భాషారాష్ట్రములు ఆర్థిక స్వయంపోషకములు గావు

నివేదిక నాల్గవ ప్రకరణములో నూత్న రాష్ట్రముల నిర్మాణంవల్ల ఆర్థికముగా, పరిపాలనావిషయకముగా కలిగే ఫలితములు చెప్పబడెను.

"అరు నూత్న రాష్ట్రములను నిర్మించినచో సమగ్రమైన ప్రత్యేక ప్రభుత్వములను, పరిపాలనా యంత్రములను నెలకొల్ప వలెను, విపరీతమైన ఆర్థిక వ్యయము కలుగును. ఈ వ్యయ భారమంతా పన్ను చెల్లించు వారిపైబడును. పైగా, అరు నూతన రాజధానీ, నగరముల నిర్మాణమునకు గూడా చాలా వ్యయము చేయవలసి యుండును. కాందిశీకులకు గృహవసతి కల్పించవలసి ఉన్న యీ తరుణంలో, అదనముగా యీ నగరముల నిర్మాణము తగనిది ద్రవ్యోల్బణ సమస్య మరింత విషమించును. ఇప్పటికే పలురాష్ట్రముల పరిపాలనా యంత్రములపై విపరీతమైన భారము పడి ఉన్నది నూతన రాష్ట్రములను నిర్మించుటవల యీ భారము మరింత అధికమగును. మరియొక క్రొత్త అల్పసంఖ్యాక సమస్య ఉత్పన్నమగును. సరిహద్దుల నిర్ణయం విషయమై కొంత వైషమ్యం ప్రబలుట తథ్యము. నూతనముగా నిర్మితమైన రాష్ట్రములన్నీ ఆర్థికముగా తగు రాష్ట్రములే. ఈ తగుట కొన్నింటి విషయములో అధికముగాను, కొన్నింటి విషయములో అల్పముగాను ఉండును ఏ ఒక రాష్ట్రము గూడా పాతను రాష్ట్రముకంటె బాగా పనిచేయలేదు"

ఈ అరు రాష్ట్రముల ఆర్థిక స్థితిగతులు విపులముగా నివేదిక మూడవ ప్రకరణములో పరిశీలించబడెను

అయిదవ ప్రకరణములో కమీషనువారి నిర్ణీతాభిప్రాయములున్నవి. వాటి నీవిధముగ తెలిపిరి "భాషాప్రయుక్త రాష్ట్రములు ఉపజాతి తత్వమునకు తోడ్పడి, భారతదేశమును ఏకజాతిగా సమీకరించుటకు ప్రతిబంధకములుగా పరిణమించునని కమీషనువారి అభిప్రాయము భారతదేశములో ఉపజాతులను సృష్టించవలెనునదే ఉద్దేశమైన, దానిని సాధించుటకు ఉపజాతులను సృష్టించుటకన్న మంచిమార్గము లేదు చారిత్రక కారణములవల్ల ఒకే భాషను మాట్లాడు ప్రజలు, భిన్న పరిపాలనా ప్రాంతములలో చేర్చబడి భిన్నమార్గములలో ప్రవర్తిల్లుచున్నందువల్ల, తిరిగి ఏకమవుటకు ఆసక్తిని చూపుటలేదు"

"భాషా ప్రయుక్త రాష్ట్రములను నిర్మించిన ఇతర ప్రాంతములవారు కూడ ఇదేవిధమైన కోరికలను కోరుట తటస్థించును ఇదివరకే ఆ విధమైన కోరికలను ప్రకటించి వత్తిడిచేయుట జరిగినది"

"భారత జాతీయ, ప్రాంతీయ భాషలను గాఢముగా అంటిపెట్టుకొనియున్నది భారతదేశభక్తి, అతి సంకుచితమైన రాష్ట్ర పరిహద్దులను అంటిపెట్టుకొని యున్నది. కాబట్టి భారతదేశము మనవలెనంటే, విస్తృతమైన దేశ శ్రేయస్సు కొరకు, భారత జాతీయాభిమానములను దేశభక్తి, మానవమైన అభిమాన భావములను విస్మరించుట ఆవశ్యకము. స్వపరిపాలనగల రాష్ట్రముల నిర్మాణమును అంగీకరిం

చుట్టుకు తగినంతగా మన జాతీయత బలపడే టంతవరకు, మనరాష్ట్రముల స్వభావ స్వరూపములు, సర్వవిధములా కేవలము కేంద్ర ప్రభుత్వమునకు లోబడు పరిపాలనా ప్రాంతములుగ నుండవలెను”

“నూతన రాష్ట్రముల నిర్మించి, ప్రభుత్వ పరిపాలనలో భాషననుబట్టి అధిక సంఖ్యాకులైన వారి కాధిపత్యమును నిరోధించుటకు భిన్న భాషలవారికి వచ్చే తగాదాల ఫలితముగా ఏర్పడే ప్రతిష్టంభనల నివారించుటకు, విచ్ఛిన్నశక్తులను అరికట్టి జాతీయ భావమును పెంపొందించి, అన్నిటికన్న ఉదాత్తమైన ఏకభారతజాతిని నిర్మించుటకు, కేంద్రప్రభుత్వమునకు అన్నివిధములైన అధికారము లుండవలెను”

మరొకచోట, కమీషను వారీవిధముగ వ్యాఖ్యానించిరి. ఒక్కొక్క భాషవారిని, వారి వారి భాషా ప్రయుక్త రాష్ట్రములలో చేర్చినయెడల, వారి సహజ వ్యక్తిత్వము ననుసరించి, వికసించుదురనే కాక, అలా చేయుటవల్ల వారి సర్గము పెద్దదై దేశమునకు ఇంకనూ ఎక్కువ ప్రయోజనము ప్రాప్తించునని వాదించుటకద్దు. అందువల్ల వారి జాతీయ భావము యిప్పటికన్న ఎక్కువగునని విశదపరచి చెప్పెదరు. కాని యిది పొరపాటభిప్రాయమని మా ఉద్దేశము. వారికి జాతీయభావోద్రేకముకన్న ఉపజాతీయ భావోద్రేకమే ఎప్పుడూ ప్రబలముగా నుండగలదు. జాతీయ ఉపజాతీయ భావములు పరస్పర విఘాతముగ ప్రజ్వరిల్లవలసినటువంటివి. ఈ రెంటిలో ఏదో ఒకటి రెండవదానినణచి పెంపొందవలసియున్నది. భాషాప్రయుక్తరాష్ట్రములలో ఎప్పుడూకూడ ఉపజాతీయ భావమే ప్రాబల్యముగా నుండగలదు. ఈ రెంటికి ఏర్పడిన సంఘర్షణయందు జాతీయ భావము అపజయమునొంది అడుగున పడక తప్పదు” కమీషను యింకనూ ఇట్లు చెప్పసాగినది. “కొంత కాలమైన తర్వాత అనగా సంస్థానముల భవిష్యత్తు ఇప్పటికన్న విస్పష్టముగా తేలిన తరువాత భారతజాతీయ భావము ఇంతకన్న దృఢపడినపిమ్మట ఇప్పుడున్న రాష్ట్రములను కొన్నిటిని పునర్నిర్మించవచ్చును. అయితే ఆ పునర్నిర్మాణము భాషా సౌకర్యమునుబట్టి గాక, పరిపాలనా సౌకర్యమునుబట్టి చేయవలెను”

రాష్ట్రపునర్విభజనకు ప్రస్తుతము ఏమాత్రము సమయము కాదని, కమీషను ఘట్టిగా ఉద్ఘాటించినది. దేశరక్షణ, శాంతిభద్రతలు, అధికచలామణి, ఆహారము, మొదలైన సమస్యలు ఇంతకన్న ముఖ్యమైనవని, వారభిప్రాయపడిరి కేంద్రప్రభుత్వము సర్వవిధములా బలీయముగా నుండి సర్వాధికారములు కలిగియుండునట్లుగా భారత రాజ్యాంగము నేర్పవలెనని, దేశమునకంతటికి జాతీయభాష ఏర్పరచవలెనను వాదము తమకు నచ్చినదని కమిషను తెలియజేసెను.” అయితే ఈ రాష్ట్రములన్నిటిలోనూ పరిపాలనా సంబంధమైన తీవ్రపతిబంధకము లనేకమున్నవి మద్రాసు ప్రభుత్వంలో తెలుగువారికి తమిళులకువున్న ఘర్షణలు, ఈసందర్భమున పేర్కొనవచ్చును. తమప్రాంతీయ అవసరములపట్ల మద్రాసు, బొంబాయి ప్రభుత్వములు తగుశ్రద్ధ చూపుటలేదని, మలబారు, కర్నాటక ప్రాంతీయులు నిష్ఠూరములు వేయుచున్నారు. వీరి నిష్ఠూరములు సత్యములు కాబట్టి వాటిని తక్షణము నివారించుటకు భారత ప్రభుత్వము పరిష్కారమార్గమును ఆలోచించవలెను” అని కమీషను తెలిపెను.

కులాసా కబుర్లు:

“పట్టభద్రులు - పడికట్టురాళ్లు”

శ్రీ జి. యస్. సూరి

డిశంబరు నెల జొరబడినట్టు క్యాలెండరుమీద చూడకుండానే తెలిసిపోతుంది చలిగాడ్పులు, కాన్వకేషన్లు ఈ మాసపు ప్రధాన లక్షణాలు కర్పూరపు గుళికలతోను, కలరా ఉండలతోను, ఏడాదినుంచి పదిలంచేసిన ఉన్ని బనియన్లు, జవహర్‌లాల్ కోట్లు, పెట్టెలలోనుంచి బయటకి దూకుతవి అబద్ధాల కోరు పార్టీల పాపాలన్నిటిని మోసిమోసి, జబ్బుజబ్బయిన లాయరుగౌన్లు, న్యాయస్థానాల నుంచి విద్యాస్థానాలకు రవాణా అవుతవి ఒకవైపున నూతన దంపతులు ముసిముసి నవ్వులతో ముచ్చటపడుతుంటే, మరొకవైపున కొత్త పట్టభద్రులు డిగ్రీలను చూసుకుని మురుసుకుంటూ ఉంటారు

ఈ నెలలో పత్రికా సంపాదకులు నిశ్చింతగా ఉంటారు పేజీలు నింపటానికి కావలసినంత సరుకు సరంజామా అయాచితంగా అందుబాటులో ఉంటుంది విశ్వవిద్యాలయాల అధ్యక్షుల ఉపన్యాసాలు, ఉపాధ్యక్షుల ఉపన్యాసాలు, ప్రారంభోపన్యాసాలు, స్నాతకోపన్యాసాలు, ఆశీస్సులు, సందేశాలు, జాబితాలు, చిత్రపటాలు వగైరాలతోను అనాయాసంగా కాలాలకు కాలాలు నింపివేయవచ్చు సంపాదకీయాలు వ్రాయటానికి విషయంకోసం వెతుక్కునే అవస్థ ఆనాటికైనా తప్పిపోతుంది.

కాన్వకేషన్ తాకిడి ఫోటోగ్రాఫర్లమీద, పెద్దతలకాయలమీద విశేషంగా వ్యక్తమవుతుంది. స్నాతకోత్సవానికి హాజరైన ప్రతి భద్రుడూ ఆ పరాణీవేషంతోనే స్టూడియోకి వెళ్లకమానడు భద్రురాళ్ల విషయం వేరే చెప్పనవసరంలేదు చాటలాంటి నలని కుచ్చుటోపి, తాపళంగా వేసుకున్న ఒళ్లబంగ్రోతు ధవాలు, అరువుతెచ్చిన చాలీచాలని నల్లగవిశన, అలవాటులేని కాలి ఉచ్చులు, కరుస్తున్న కొత్త జోళ్లు, చేతిలో కాగితపుచుట్ట మొదలైన సర్వహంగులతో కెమేరాముందు నిలబడుతారు గంగిరెద్దును మించిపోయే జొంతలబాటుతో కుంగిపోతూ, మెడకు కట్టుకున్న ఉచ్చుగుడ్డ బిగువుకు ఉడుకుడుముకుంటూ, కాలిజోడుబాధకు కుమిలిపోతూ, నవ్వుముఖం పెట్టమని ఫోటోగ్రాఫరు కోరినందుకు పలతెలాబోయే ఇకిలింపుతో పట్టభద్రుడు ఫోటో తీయించుకుంటాడు దీనిని చూసి ముసలి తల్లిదండ్రులు, ఉంటే అమాయకపు భార్యలు ఉబ్బి తబ్బిబ్బులవుతారు

ఉపన్యాసకులకు ఇంతవంటి మహదవకాశం మరొకటి ఉండదు వారి నోరు ఊరుకోదు. మామూలు మీటింగులలో మాట్లాడటం సరదాగానే ఉంటుందికాని, ఎప్పుడు ఏ స్టేజీపైనుంచి కొక్కిరాయి అరుపులు, అల్లరి కేకలు, పాత చెప్పుల ప్రహారాలు, సిద్ధమవుతవో చెప్పటం కష్టం ఈ స్నాతకోత్సవాలలో అటువంటి ఇబ్బందులు సంభవించవు అంతా ఫకడ్‌బందీగా నడుస్తుంది ఏటేటా ప్రతిస్నాతకోపన్యాసకుడూ ఏకరువు పెట్టిన పాతవిషయాలనే వల్లెవేస్తున్నా, కిక్కురుమనకుండా కూర్చుంటారు, అమాయకపు విద్యార్థులు. అందువల్ల ఏమిచెప్పినా చలామణి అవుతుంది ఏ చెత్తఅయినా రాణిస్తుంది.

కాన్వకేషన్ల ఉపన్యాసాలు, ఎవరు ఎప్పుడు ఎక్కడ ఇచ్చినా, ఒకటేవిధంగా ఉంటే తీరగలవు. ఎప్పటినుంచో ప్రచారంలోఉన్న కొన్ని పడికట్టురాళ్లు తప్పని సరిగా పడవలసిందే ముందుగా ప్రతి ఉపన్యాసకుడూ తన అనర్హతను తానే సూచిస్తాడు. ఆతరువాత, కష్టపడి కష్టపెట్టి పరీక్షలు ప్యాసైన పట్టభద్రులను అభినందిస్తూ వారిని చూడగానే తనకు గలిగిన ఉత్సాహాన్ని వివరిస్తాడు ఆపైన విద్య అంటే ఏమిటో, అసలైన చదువుకు పరమార్థ మేమిటో విపులపరుస్తాడు. ఏలాంటి ఆశయాలకోసం, ఆదర్శాలకోసం పాటుబడితే విద్య సార్థకమవుతుందో వివరిస్తాడు పట్టభద్రుల మూపుల మీద పడబోయే బాధ్యతలను, భారాలను గుర్తిస్తాడు. దేశాన్ని, సంఘాన్ని ఎదుర్కొంటున్న సమస్యలను ఏవిధంగా వారు సేవచేసి ఉద్ధరించగలరో ఉద్ఘాటిస్తాడు చిట్టచివరకు ఏ మహాకవి పద్యాన్నో చదివి గంభీరోపన్యాసాన్ని ముగిస్తాడు ఈ పడికట్టురాళ్లు పడని ఉపన్యాసం ఏ స్నాతకోత్సవంలోనూ వినబడదు. అనుమానంగా ఉంటే దేశంలో ఇటీవల జరిగిన కాన్వకేషను రిపోర్టులను ఏ పత్రికలోనైనా తిరగేసి చూడండి నిజమేనని ఒప్పుకుంతీరతారు.

ఈవిధమైన ఉపన్యాసాల్ల ఎటువంటి ప్రయోజనమూ ఉండదు పైన ఉదహరించిన విషయాలు తెలియని పట్టభద్రుడు ఎవ్వడూ ఉండడు కార్డినల్ న్యూమన్, మాత్యూ ఆర్నాల్డ్, వివేకానంద మొదలైనవాళ్ల రచనలు ఈ సందర్భంలో ప్రతి విద్యార్థీ కాలేజీలో చదివే ఉంటాడు. ఏ నాయకుడో, ఏ అమాత్యుడో వీటిని ఏకరువు పెట్టినందువల్ల గొప్పగా జరిగేదేదీ లేదు కాకపోతే కష్టపడకుండా గౌరవ బిరుదులను విశ్వవిద్యాలయాలవాళ్లు అగ్రనాయకులమీద పడజల్లుతున్నారు కాబట్టి తప్పని సరిగా తోచింది మాట్లాడటానికి అవకాశం మాత్రం లభ్యమవుతున్నది అంతకంటె లాభం ఉన్నట్టు నాకు ఎక్కడా తోచదు.

కొత్తగా డిగ్రీలు పుచ్చుకున్నవాళ్లకు ఉపయోగకరంగా ఉండాలంటే ఉపన్యాసాలు మరొకవిధంగా తయారుకావాలి తెలియచెప్పవలసిన విషయాలను నిర్మొహమాటంగాను, నిష్కర్షగాను బల్లగుద్ది చెప్పాలి. మచ్చుకుగాను ఈ టూకీ ఉపన్యాసం చూడండి “అబ్బాయిలూ! అమ్మాయిలూ! బట్టీలు పెట్టో, దండయాత్రలు చేసో, కాపీలు కొట్టో, మార్కులు వేయించుకునో ఏదో విధంగా ఒడ్డున పడ్డారు పేరుచివర పొడిఅక్షరాలు సంపాదించారు ఈ ఉబలాటంలో మీరు మీకోసం పతివాళ్లైనవాళ్లను మరచిపోకండి మీ చదువుకు వాళ్లు ఎన్ని జీతాలు కట్టారో, ఎన్ని పుస్తకాలు కొన్నారో, ఎన్ని జులాన్మానాలు చెల్లించారో, ఎంతరుణం ఆశ్రయించారో ఆలోచించండి మీరు ఎన్ని కాగితాలు పాడుచేశారో, ఎంత సిరాను వదిలించారో, ఎంత కిరసనాయిలును (లేక ఎలెక్ట్రిసిటీని) దహించారో, ఎన్ని కష్టాలకోర్చి సేవించారో యోచించండి ఈమాత్రమైనా రాబట్టటం మీ కనీస ధర్మం మొదట తరగతిలో ఉత్తీర్ణులైనవారు ముఖ్యంగా గమనించాలి ప్రపంచంలో అగ్రస్థానాలను అలంకరించినవాళ్లలో మీ శ్రేణికి చెందినవారు భూతద్దంపెట్టి వెతికినా కనబడరు. అందువల్ల మరీ శ్రమపడవలసినవాళ్లు మీరు మరొక ముఖ్యవిషయం చెబుతున్నాను. చదువు కోసం చదువనేది అర్థంలేని వాదం. దేనికైనా ప్రయోజనం ఉండాలి మిమ్మల్ని మీరు ఉద్ధరించుకుంటే అంతకంటె ఎక్కువ ప్రయోజనం సాధించనవసరంలేదు విద్యను ఎంత దీక్షతో ఆర్జించారో డబ్బును అంతకు మించే దీక్షతో ఆర్జించాలి డబ్బులేకపోతే మొనగాళ్లయినా నిభాయించలేరు రాజాజీవంటివాడు ఇరవై వేల జీతం లేకుండా కాలం వెళ్లదీయలేకపోతున్నాడనే విషయం గమనించండి అయితే ఉద్యోగాలకూ శక్తిసామర్థ్యాలకూ సంబంధం లేదని తెలుసుకోండి జుట్టు పట్టుకుని పైకి లాగేవాడు లేనిదే ఎంతమాత్రం లాభంలేదని నమ్మండి ఏశాసన సభ్యుణ్ణో మామగా మార్చండి” ఈవిధంగా అత్యంత ఉపయుక్తమైన మహత్తర విషయాలను తెలియజేసేట్లుగా ఉండాలి స్నాతకోపన్యాసం అంటే. అంతేగాని కేవలం మాటలపసతో సాధించేదేదీ ఉండదు

విశ్వవిద్యాలయాలు తప్పని సరిగా కొన్ని సంస్కరణలు ప్రవేశపెట్టాలి. ఏడాదికి రెండుసార్లు జరుగుతుండే అనవసరపుతతంగానికి స్వస్తి చెప్పాలి మనకు ఎంతమాత్రం ఒప్పిదం కాని ఈ గౌన్లు, టోపీలు వగైరాలను బహిష్కరించాలి ఇప్పుడు అమలులో ఉన్న పరీక్షా విధానాన్ని రద్దుచేసి అమెరికా విశ్వవిద్యాలయాల పద్ధతిని అనుసరించాలి. దానివల్ల విద్యార్థులకు హాయికి హాయీ, ఆదాకు ఆదా విశేషంగా లభ్యమవుతుంది ముఖ్యంగా గౌరవడిగ్రీలు ఈవిధంగా వినియోగించకూడదు. కేవలం సహజపాండిత్యం వల్ల ప్రతిభవల్ల ఏశాఖలోనైనా ప్రశంసనీయంగా వైదుష్యం కనబరచినవారినే ఈలాంటి గౌరవబిరుదులతో గౌరవించాలి. అంతేగాని ఇతరులెవ్వరూ బిరుదులు ఉంచుకోగూడదని తమకు మాత్రం డాక్టరేట్లను స్వీకరించే అధికారులకు ఎంతమాత్రం ఇవ్వకూడదు. మనకు ఉన్న డాక్టర్లు చాలు; ఉపరిడాక్టర్లు ఎందుకు బాబూ!

నేటిప్రపంచం

(5వ పేజీ తరువాయి)

అదుపాజ్ఞలలో వుంచలేకపోతున్నది నిర్ణయాలు చేసే హక్కేగాని, వాటిని అమలుజరిపే సాధన సంపద లేకపోవడమే సమితి ఈ నిస్సహాయ పరిస్థితిలో వుండడానికి కారణం సమితికి వుండవలసిన సాయుధబల నిర్మాణసమస్య నేటికీ పరిష్కారం కానేలేదు

* * *

ఇండోనీసియా సమస్యపై తిరిగి ప్రతిష్టంభన ఏర్పడింది. డచ్చి అమాత్యులు రిపబ్లికన్ రాజధాని జోగ్జకర్తకు వచ్చి ప్రధాని హట్టాతో జరిపిన సంప్రతింపులు భగ్నమైనవని డచ్చి ప్రభుత్వం ప్రకటించింది రిపబ్లిక్ కలసివచ్చినా, రాకపోయినా ఇండోనీసియా సంయుక్తరాష్ట్రములకు ఫెడరల్ ప్రభుత్వాన్ని 1949 జనవరి 1వ తేదీనాటికి డచ్చివారు ఏర్పాటుచేయదలిచారు రిపబ్లికన్ ప్రధాని హట్టా లోగడ ఇచ్చిన వాగ్దానాలకు భిన్నంగా ప్రవర్తించాడనీ, అందువల్లనే ఈ ప్రతిష్టంభన ఏర్పడిందనికూడా డచ్చివారు ఆరోపిస్తున్నారు. తాత్కాలిక ఫెడరల్ ప్రభుత్వం అమలులో వున్నంతకాలమూ డచ్చి సార్వభౌమత్వాన్ని ఇండోనీషియా అంగీకరించాలనీ, సైన్యంపై సర్వాధిపత్యం తమకే వుండాలనీ డచ్చివారు ప్రతిపాదించగా స్వాతంత్ర్యప్రియులైన రిపబ్లికన్ నాయకులు ఇందుకు సమ్మతించనట్టు కనబడుచున్నది తూర్పుజావా, మధుర ద్వీపాలలో స్వయంగా ఏర్పాటుచేసిన కీలుబొమ్మ ప్రభుత్వం పైన ఆధారపడి ఇండోనీషియన్ ప్రజాభిమతాన్ని హాలెండు ఈవిధంగా తృణీకరిస్తున్నది రిపబ్లికనులు సామరస్యధోరణిలో సంప్రతింపులకు సిద్ధంగా వున్నప్పటికీ, వారితో ఇక సంప్రతింపులు జరిపేది లేదని డచ్చివారంటున్నారు. ఈ ప్రతిష్టంభన ఫలితంగా ఇండోనీసియా రిపబ్లికనుకు, డచ్చివారికీ మధ్య తిరిగి సంఘర్షణల తప్పదేమో సమస్య తిరిగి ఐక్యరాజ్యసమితిలో చర్చకు రావచ్చు

ఈ సమస్య ఈవిధంగా వుండగా, ఇండోనీసియా రిపబ్లిక్ అధ్యక్షుడు డా॥ సోకర్నో భారత ప్రధానామాత్యుడు నెహ్రూ ఆహ్వానాన్ని అంగీకరించి ఇండియాకు రావడానికి ఇష్టపడ్డాడు వివిధ దూరప్రాచ్య దేశాలతో ఇండోనీషియా స్నేహసంబంధాలను ఈవిధంగా దృఢతరం చేసుకుంటున్నది ఈసారి ఏదైనా అశాంతి ప్రజ్వలించినట్లయితే, ఆసియా సహించదు స్వీయ క్షేమాన్ని కాంక్షించి అయినా హాలెండు ఈ అఘాయిత్యానికి పూనుకోనక, శాంతియుత పరిష్కారానికి పునః ప్రయత్నం చేయటం దానివిధ్యుక్తం.

గుండు సూదులు

(వ్యంగ్యరచన)

శ్రీ పురాణం సుబ్రహ్మణ్యశర్మ

గుండు సూదులు ఐపోతూవుంటవి. ఐపోయినప్పుడల్లా ఆఫీసులో అల్లరు జరుగుతూ ఉంటవి. అల్లరు జరిగినప్పుడల్లా అధికారులు 'మెమో' (Memo) లు వ్రాస్తూవుంటారు 'మెమో'లు వ్రాసిన తరువాత ఒకరిద్దరు గుమాస్తాలు తిరగబడుతూ వుంటారు ఈ తిరగబడ్డం గురించి ఎవడోఒకడు ఉన్నవీ లేనివీ కల్పించి పైకి—పై అధికారులకి--వ్రాసుకుంటాడు ఎదో వంక చూసుకుని 'వాండ్లని 'సస్పెన్షన్'లో వుంచుతారు. తతిమ్మా అకౌంటెంట్లు, ఇత్యాది చిల్లర ఉద్యోగస్థులు చంకలు వాయించుకుంటారు.

ఇల్లా మళ్లీ కొన్నాళ్లకి గుండుసూదుల మాట ఎవడో ఎత్తుతాడు ఆఫీసులో ఎంతమందిని టూసుచేయించినా 'గుండుసూదులు' భోషాణం లోంచి బయటికి రాలేదు. ఇతరులు మనకు పంపించిన కాగితాల్ని గుండుసూదులు ఉన్నంత కాలం యీ గుమాస్తాలు వాడుకుంటూ వచ్చారు

ఇప్పుడు వాళ్లు పంపే కాయితాల్ని కూడా గుండుసూదులు వుండటంలేదు. ఏతావతా ఒక వేళ వుంటే అవి కాగితాల్లోంచి వూడిరావు. మొన్న ఒకటిరెండు కాగితాలకి గుండు సూదుల కోసం వచ్చిన టపాలన్నీ వెదికితే అన్ని పుత్తరాలూ జిగురెట్టి అంటించివున్నాయి. ఇవ్వాళ సిరాబుడ్డిక్రింద ఒక ఒడుసూది దొరికింది నిన్న మధ్యాహ్నం పాతకాగితాల అడుగునవాలుగు గుండుసూదులు సాక్షాత్కరించాయి రేపు తలకాయ దువ్వుకొంటూంటే అందులో చిక్కడి వుంటే ఒకటిరెండు దువ్వెన్నకు దొరకవచ్చు ఇదివరకు రోజూ టపాలన్నీ గుంజితే ఆఫీసుకి గుండుసూదులు ప్రత్యేకంగా కొనవలసిన అవసరం వీర్పడేది కాదు ఇప్పుడు గుండుసూదులు లేకపోవటంవలన గుమాస్తాలకు బాధఎక్కువైంది. మళ్లీ గుమాస్తాలు ఆందోళనచేశారు ఏమని?

గుండుసూదులు కావాలని; వెంటనే తెప్పించవలసిందని; ఒక్కసారే ఒక సంవత్సరానికి సరిపోయే గుండుసూదులు తెప్పించాలన్నారు ఆ పని చేసేవాళ్లెవరో ఎవర్నడగాలో తెలియలేదు గుమాస్తాలకు. సంవత్సరం స్టేషనరీ కొన్నప్పుడే గుండుసూదులుకూడా కొంటున్నారు. కొన్న గుండుసూదులు గుమాస్తాల వాడకానికియ్యవలసిన బాధ్యత, యిప్పించవలసిన బాధ్యత రెండూ ఆఫీసువారిమీద వుంది. ఆఫీసువారంటే ఒకరు జీతం పుచ్చుకుంటూన్న అధికారి, ఇంకొకరు సానికగౌరవోద్యోగి. గుమాస్తాలకు గుండుసూదులు వాడకానికి యివ్వటం లేదుగనుక, ఒకవేళఐపోయి వుంటే తెప్పించవలసిన బాధ్యత వీరిద్దరిది

ఐతే అడిగికన్నా అర్థాన్నంగా ఉన్న యీ ఆఫీసులో ముగ్గురో నలుగురో గుమాస్తాలు ఒక మేనేజరువుంటారు ఏడాదికి రెండు అర్థసంవత్సరాలు వస్తాయి అర్థ సంవత్సరం యింక ఆర్నెల్లకు వస్తుందనగా ముందునుంచీ పనిచేసి - ఆదివారాలు, శనివారాలు, యూనిట్లువేసి వడ్డీలు కట్టి సిద్ధంగా వుండాలంటారు జూన్ ముప్ఫై, లేదా డిశంబరు ముప్ఫై తారీకు వచ్చేదాకా గుమాస్తాల్లో వేడిపుట్టాలు వేడిపుట్టినా, పుట్టకపోయినా నువ్వు చచ్చినట్లు పనిచెయ్యాల్సిందే అంటాడు మేనేజరు 'ఔను, అంతే' అంటాడు అకౌంటెంటు ఉన్న గుమాస్తాల్ని పోగుచేస్తే యిద్దరు ఎట్లా పూర్తిచేస్తారు పని? ఇంకో గుమాస్తాని వేసుకుందామనే జ్ఞానం వాండ్లకుండదు ఇదివరకు నలుగురు వుంటే అందులో ఒకడు యితరత్రా బ్రతుకుతెరువు చూసుకున్నాడు ఆ ఖాళీలో యింకొకణ్ణి వెయ్యలేదు ఉన్నవాళ్లనే రాసిరాపాడేద్దాం లేకపోతే 'మెమో' రాసి సంజాయిషీ యిమ్మందాం అని మేనేజరు ధిలాసా వీళ్లకసలు ఆ పని చెయ్యటం ఎవరైనా నేర్పారా? నేర్పకుండా ఎట్లా చేస్తారు? ఏమో - అవన్నీ అనవసరం. చచ్చినట్లు చెయ్యాలిసిందే పని వున్నప్పుడు?

పని లేనిది ఎప్పుడు? నువ్వు చచ్చిపోయినప్పుడు! నిన్ను కాటిమీద కక్కొంచి మీద కట్టెలు పేర్చి నిప్పంటిస్తూన్నా - యీ గుమాస్తా క్రిందటి ఆదివారం పనికి రాలేదు. చచ్చిపోయిన తరువాత వీడి పెళ్లానికిచ్చే జీతంలో - శెలవు పెట్టినన్నాళ్లకి - తెగ్గోయిద్దాం, ఏం? అంటాడు మేనేజరు అధికారితో అధికారి ఔనల్లాగే - అంటాడు శెలవు కాగితం వెనక్కాల 'వీడు చచ్చిపోయాడు - చచ్చిపోయినప్పటికీ వీడి పెళ్లానికిచ్చే జీతంలోంచి - జబ్బులో వాడుకున్న శెలవుకి, శెలవుహక్కు లేనందున తెగ్గోసి యివ్వవలిసింది' అని రాస్తాడు. అధికారి సంతకం పెట్టేస్తాడు ఒకవేళ యిది అన్యాయం అని ఎవరైనా అంటే రూల్సులో అల్లా వుంది అంటారు.

అసలింతకీ గుండుసూదులు తెప్పించేందుకు అధికారి సమ్మతి తీసుకోవాలి. ఆయన గౌరవాధికారి అందువలన ఇష్టం వచ్చినపుడు వెళ్లి అడగటానికి వీల్లేదు. ఒకసారి ఆఫీసుకు ఆయన స్వంతపనిమీద వచ్చినప్పుడు - యిల్లా గుండుసూదులు కావాలని గుమాస్తాలు మొఱపెట్టుకున్నారు. "నేను చెప్పాను - అందుకని మేం యిట్లా చేశాం" అనటానికా - వొద్దు నాకొద్దీగొడవ-మీ పెద్దఆఫీసుకి వ్రాసి సమ్మతి తెచ్చుకుంటే నాకేం అభ్యంతరం లేదు -' అన్నాడాయన. పెద్దఆఫీసుకు వ్రాస్తే 'మార్కెటులో ఎక్కడ చవగ్గా దొరుకుతయ్యో, అక్కడికి అధికారి వీలువెంబడిని, యథాశక్త్యా మేనేజర్ని వెంబడించి వెళ్లి, వెయ్యికళ్ల పరీక్ష చేసి చూసి మరీ కొనమని, లేదా టెండర్లు పిలవమనీ వ్రాశారు.

మేనేజరుకి, అధికారికి వీలు కుదరదు కుదిరినప్పుడేగాని గుండుసూదులు కొనరు చవగ్గా గాని కొనకూడదు ఇక్కడ ప్రియం అంటే అక్కడ ప్రియం అంటూ ఏడాది గడిపేశారు

ఈలోగా గుమాస్తాలు మారిపోయారు కొందరు చచ్చిపోయారు కొందరు గుండుసూదుల్లేవని రాజీనామా లిచ్చారు

ఆ ఆఫీసులో ఒక కుఱ్ఱగుమాస్తావున్నాడు. ఆ సంవత్సరమే అతడు బెజవాడ కాలేజీలో ఇంటరు మీడియేటు ఒక్కయింగ్లీషు మినహా పాసయివచ్చాడు. తెలుగులో మంచి ఘాటుగా వ్రాస్తాడు మనిషి బక్కపలచగా పూచలా వుంటాడు మాట్లాడితే, నడిస్తే, వ్రాస్తే విప్లవం నేను నీలో వర్ధిల్లుతున్నానంటుంది అతనిలోని రక్తం మంచి పొంగుల్లో వుంది. అతను ఒకసారి తగులుకున్నాడు

'ఇదేమి నీశ్రాద్ధం ఆఫీసు. కర్చుపెడితే నీతాతగారి సొమ్మా—నాతాతగారి సొమ్మా? గుండుసూదులు తెప్పించు చూస్తావేం' అన్నాడు మేనేజరు 'హూ!' అని మూలుగుతూ అకౌంటెంటుని సాక్ష్యం పలకమన్నాడు. అకౌంటెంటు 'కుఱ్ఱగుమాస్తా మేనేజర్ని సాక్షాత్తూ నాకళ్ల ఎదుట ధిక్కరించాడు' అనివ్రాసి వాఙ్మూలం యిచ్చాడు ఆరోజు కుఱ్ఱవాడు యింటికెళ్లాడు మర్నాడు సాయంత్రం మేనేజరు అధికార్ని హాజరు కమ్మన్నాడు అకౌంటెంటుని లోపలికివచ్చి కూర్చోమన్నాడు ఇప్పుడు కుఱ్ఱగుమాస్తాని లోపలికి పిలిచారు దండనకి. ఆ అధికారికి బాగా రౌద్రం ఎక్కేదాకా క్రొత్తగుమాస్తా, అవిధేయత అసమర్థత, అతితెలివితేటలు, నూరిపోశాడు గాంధిగార్ని చంపినగాడ్సేనికూడా నేరం ఒప్పించటంకోసం కోర్టులో ప్రయలుసాగిస్తున్నారు. ఈగుమాస్తాని మాడ్డంతో—చడాబడా నాలుగన్నాడు

నీవు ఎందువల్ల అన్నావ్? ఏమిటి సంగతని ఆ వచ్చినాయన అనలేదు 'ఇటువంటి వాళ్లను వేసుకోవద్దని అందుకే చెప్పాను' అన్నాడు. మేనేజరు 'వీడికి పొగరుపోతుతనం లావు గుండుసూదులు కొనలేదేమని జమాయించి అడుగుతున్నాడు వీడ్నికంట బెదిరించాలి' అన్నాడు అంతమాత్రం ఆసరా వుందికదా అని ఆ పెద్దమనిషి 'అమ్మ, అక్క' అనకుండా మిగతా అనవలసిన మాటలన్నీ అన్నాడు రెక్కలు విరిచి కట్టించి బండకొయ్య వేయించలేదు కాని అంత పనిచేశారు

అది పరిపోయింది గుండుసూదులు అడిగినందుకు, వీడికి క్రొత్తపని అంటకట్టాలి అనుకున్నారు అకౌంటెంటు మేనేజరు ఆలోచించి యూనిట్లు, వడ్డీలు కట్టమందాం అనుకున్నారు తతిమ్మా గుమాస్తాలనుకున్నారు—'ఇన్నాళ్లబట్టీ గుండుసూదుల్లేకుండా గడుపుకోవటం లేదా? ఎవరికీ అపకారం చెయ్యని యీ పిల్లవాణ్ణి నిష్కారణంగా ఆ అధికారిచేత నానా మాటలు అనిపించాడే యీ మేనేజరు తినేమన్నా గుండుసూదులు తింటాడా? తిండానికి యింటికి పట్టుకుపోడానికి అవేమన్నా గారెలా? బూరెలా? పొరపాటున గుండుసూదులు యిప్పించమన్నాం అనకపోయినా బాగుండిపోయేది' అని కొందరికి లోలోపల గుండుసూదులు వాడుకోవటం అనే హక్కు సంపాయిద్దాం అనే కాంక్ష వుంది అందువల్ల వారి దివ్యసమక్షంలో—'అయ్యా మాకు గుండుసూదుల అవసరం ఎక్కువగా వుంది—అవి తెప్పించటం సంగతి అటోయిటో తేల్చండి' అన్నారు పట్టుబట్టి

'మేం యిప్పుడు పొగరుమోతు గుమాస్తాల్ని అణచడానికి వచ్చాం మేమేమన్నా తాబేదార్లమా మీకు? మా యిష్టం వుంటే—మేమూ మేమూ ఆలోచించుకుంటాం — తెప్పించుకుంటాం ఇస్తే పుచ్చుకోండి—లేకుంటే మానెయ్యండి గుండుసూదులకు టెండర్లు యిచ్చ్యరట వూళ్లోఅన్నిచోట్లా విచారించాం—ధరలన్నిటా ఒకే మోస్తరుగా ఉన్నాయి. ద్రవ్యోల్బణం వలన ఎక్కువ డబ్బుకు తక్కువసరుకులు వస్తున్నాయి ఇప్పుడు కొనటం శుద్ధ బుద్ధితక్కువ' అని సెలవిచ్చారు

చివరకు యిప్పట్లో గుండుసూదులు కొనరు. కొనకపోతే పోనీ ఉన్నవేనా వాడుకోనిస్తారా అంటే అదీ లేదు వాడుకుంటే అయిపోతయి అయిపోతే మళ్లీ కొనటానికి యింత అవస్థపడాలి—అదీగాక ధరలు పడిపోయే సూచనలు కనిపిస్తున్నాయి. ఒక ప్రక్క ద్రవ్యోల్బణం అంతర్జాతీయ పరిస్థితులుకూడా ఏం బాగాలేవు పాకిస్తాన్‌కీ మనకీ రాకపోకల్లేవు వున్న చోట్ల ధరలు జాస్తి, చూస్తూచూస్తూ ప్రజాసంస్థద్రవ్యం వ్యర్థంగా కర్చుచెయ్యటం ఎట్లాగ? ఒక వేళ మేనేజరు గుండుసూదులు కొందామని అనుకున్నా—అతడు దేముడిమొహం చూసి నడుస్తున్నాడాయె దేముడిమొహం గుండుసూదులు కొంటే ఏమంటుందో ఏమో !

తరిగొప్పుల దత్తనామాత్యుడు

(19 వ పేజీ తరువాయి)

వాచికోక్తినే కాదు సూచితార్థ బహుత్వ
 మతుల సత్కవి బుధాశ్రితులయందు
లిఖనక్రియనె కాదు లీలాప్రభావనం
 బాన తారాతి ప్రధానులందు
బౌరయు దిర్మల రాయేంద్ర భూరి పుణ్య
రాశి యగు వేంకటోర్వీశు వ్రాయసకులు
వ్రాయు చాతుర్యమున నిజస్వామి హిత
ధాన సురమంత్రి వరసయ దత్తమంత్రి"
"అరుదార న్వరపత్రి వృత్తి యయి ద
 త్తాత్రేయ సంస్పర్శ నా
తుర యోగోన్నతి గన్న లేఖిని మహా
 గర్వాంధ సామ్రాజ్య సం
హరణం బున్నత రాజ్యసంభృతియు ద్వీ
 పాంత ర్న్నృపాకర్షణ
స్ఫురణంబు న్బహు దేశ వస్తు భరణం
 బుం గాంచు నంచద్గతిన్."
"యాదవాగ్రజుని పటాటోప మెల్ల గౌ
 రీవిభు సగ్రీవభావ మెల్ల
గుముదాప్తు మంటల క్రమణ చిహ్నం బెల్ల
 నుడు పరంపర నందు నునికి యెల్ల
సిరిగన్న తండ్రి యాంతర మెల్ల బలుకుల
 కొమ్మయు దలయెత్తికొనుట యెల్ల
శేషపన్నగము నుస్నేమ వైఖరి యెల్ల
 జదలు వ్రాని కడింది చాయ యెల్ల
నగి తెగడి మీతి కేరి తృణం బొనర్చి
యడచి కారించి వారించి యడరు నే
వేకనిధి కీర్తి యత డొప్పు వేంకటాద్రి
దత్త సామ్రాజ్య విభవుండు దత్తమంత్రి."
"ఘన గోత్రోద్ధరణం బసంఖ్య సుకవి
 గ్రామ ప్రదానైక సా
ధన సద్భావ ధురంధరత్వము మహో
 దర్వోద్ధతారి ప్రధా
న నిరాసోద్భట పాటవంబు నిరవొం
 ద న్దత్తనార్యుండు శ్రీ
దనరు న్వేంకటరాజ దక్షిణభుజా
 దండావిశేషస్థితిన్"

—అను 'చంద్రభానుచరిత్ర' మందలి పద్యము లవగాహ మొనర్పు చున్నవి.

'చారు చంద్రోదయ' మందలి—

"రమణ వేంకటపతి రాయేంద్రుడు నతింప
బటుకార్యదక్షుడై ప్రబలినాడు"

—అను పద్యపాదము "దత్తన మంత్రి వేంకటపతిరాయలు వినుతించునటుల బటుకార్యుడై ప్రబలినా డని తెలుపుచున్నది

ఇమ్మహామాత్యులు కార్యదక్షులు, నిజస్వామిహితరతులు, దానశాధేయులు, మూసీమకు జెందినవా రని తెలిసికొని యుప్పొంగుచున్నారము

తెలుగు దేవాలయాలు

శరత్కాలప్రకృతి సౌందర్యము






శ్రీ పి. కృష్ణచందర, మచిలీపట్టణము.
ఛాయా చిత్రకారుడు.






శ్రీ మంగళగిరి పానకాలస్వామి ఆలయము. ఛాయాచిత్రకారుడు: కె. నాగభూషణరావు, గుంటూరు.



సర్పవర దేవాలయ పురోభాగము, మంటపము



మంటపము - శిథిలావస్థ.



సర్పవరము దేవాలయ గోపురము.
ఛాయాచిత్రకారుడు: జి. ఎల్. రావు.

Regd. No M. 4479

భారతి

రజతోత్సవ సంచిక

ఉత్తమోత్తమమైన వ్యాసాలతో ★ మంచిమంచి కథలతో ★ రమణీయమైన చిత్రాలతో,
అందమైన కూర్పు తీర్పులతో ★ 300 పేజీల ఉజ్వల సంపుటము.

1949 జనవరి 7-తేదీన వెలువడుతుంది.

వెల రూ. **2-8-0** పోస్టేజి అదనం.

ఆశాభంగం చెందకుండా మీ ప్రతికిగాను మాకు గాని, మీ సమీపంలో ఉన్న మా ఏజెంటుకు గాని వెంటనే ఆర్డరు ఇవ్వండి.

వ్యాపారస్థులకు:

విద్యాధికులు, ధనాధికులు నైన వేనకువేల ఆంధ్ర మహాజనులకు మీ వ్యాపార సందేశం అందజెయ్యటానికి ఈ

రజతోత్సవసంచిక

అపూర్వమైన అవకాశం ఇస్తుంది.

ప్రకటన రేట్లు

పూర్తి పేజి రెండు రంగులలో	రు.	50/-	ఒక రంగులో అర పేజి	రు.	18/-
పూర్తి పేజి ఒక రంగులో	రు.	35/-	పావు పేజి	రు.	10/-

ప్రకటన ఛార్జి పూర్తి మొత్తము ముందుగా చెల్లించవలెను.

7, తంబుచెట్టివీధి,
మద్రాసు 1.

మేనేజరు,
భారతి.

ఆంధ్రపత్రిక

శ్రీ విరోధినామ సంవత్సర పంచాంగం

శుభానికిగాని, అశుభానికిగాని పంచాంగము చూడని హిందువు ఉండడు.
ప్రతి హిందూ గృహానికి తప్పనిసరి వస్తువు పంచాంగము.

దైవజ్ఞభూషణ
బ్రహ్మశ్రీ పిడపర్తి కృష్ణమూర్తి శాస్త్రులు
గారిచే గుణింపబడినది.

1000 కి రు. **175/-** **100** కి రు. **20/-** వెల **1**-కి రు. **0-4-0.**

ప్యాకింగు, పోస్టేజి ప్రత్యేకము. ఆర్డరుతోపాటు, సగం పైకం అడ్వాన్సుగా పంపవలెను.
(1000 ప్రతులకు ఆర్డరిచ్చువారి చిరునామా ముఖపత్రముమీద ముద్రించబడును.)

వివరములకు మేనేజరు,

ఆంధ్రపత్రికా కార్యాలయం, మద్రాసు.

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., G. T. Madras